www.visalaandhra.com

స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2015-17

అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66 | సంచిక : 227 | బుధవారం 07-02-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ



మాల్దీవులలో కల్లోలం

'సుప్రీం' జడ్జీల అరెస్టు...!

- భారత సైనిక జోక్యానికి విజ్ఞప్తి
- ఆర్థిక ఆంక్షలకు అమెరికాకు విజ్ఞప్తి
- అత్యవసర పరిస్థితి విధింపు

మాలే : హిందూ మహాసముద్రంలోని ద్వీప దేశం మాల్దీవుల్లో రాజకీయ సంక్షోభం తీవ్ర రూపం దాల్చింది. అనూహ్య పరిణామాలు శరవేగంగా చోటు చేసుకుంటున్నాయి. మాల్దీవులు అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్ దేశంలో అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) విధించిన కొన్ని గంటల్లోనే ప్రధాన న్యాయమూర్తి అబ్దుల్లా సయీద్, మరో సీనియర్ జడ్జి జస్టిస్ అలీ హమీద్, ప్రతిపక్ష పార్టీకి చెందిన ఓ కీలక నేతను మంగళవారం ఉదయం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఏకంగా సుప్రీంకోర్టు జడ్జీలనే అరెస్ట్ చేయడంతో ప్రజలు షాక్‌కు గురయ్యారు. మాజీ అధ్యక్షుడు అబ్దుల్ గయూంను ఆయన స్వగృహంలో నిర్బంధించారు. అయితే ఆయన బలవంతంగా బైటకు వచ్చినప్పుడు పోలీసులు ఆయనకు సెల్యూట్ చేసారనీ, ఒక వెబ్‌సైట్ తెలియజేసింది. తనను

- మిగతా 2 లో

మార్కెట్లకు అ'మంగళం'..!

రూ.5లక్షల కోట్లు ఆవిరి



7లో

రెండు నెలలుగా ఆల్‌టైమ్ రికార్డులతో కళకళలాడిన దేశీయ మార్కెట్లు మంగళవారం భారీ నష్టాలతో కుప్పకూలి వెలవెలబోయాయి. కేవలం మంగళవారం రూ. 5 లక్షల కోట్ల పెట్టుబడి కొన్ని నిమిషాల్లోనే ఆవిరైంది. బడ్జెట్ నేపథ్యంలో కిందటి రెండు సెషన్లలో అతలాకుతలమైన స్టాక్ మార్కెట్లకు మంగళవారం అంతర్జాతీయ మార్కెట్ల సెగ తగిలింది. అమెరికా క్రెడిట్ రేటింగ్‌ను తగ్గించడం అక్కడి మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపింది. దీనికి తోడు ఫెడ్ వడ్డీ రేట్లను పెంచే అవకాశాలుండటంతో మార్కెట్ భారీగా పతనమైంది. అటు ఆసియా మార్కెట్లు కూడా నేలచూపులు చూస్తున్నాయి. దీంతో ఆ ప్రభావం భారత మార్కెట్లపై కూడా పడింది. ఆరంభంలోనే కుప్పకూలిన సూచీలు.. మార్కెట్ ప్రీ సెషన్లో భారీ నష్టాలతో ట్రేడ్ అయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 1200 పాయింట్లు.. నిఫ్టీ 350 పాయింట్లకు పైగా నష్టంతో కొనసాగింది. ప్రస్తుతం సెన్సెక్స్ 561 పాయింట్ల నష్టంతో 34,195 వద్ద, నిఫ్టీ 168 పాయింట్లు కోల్పోయి 10,498 వద్ద ట్రేడ్ అయ్యాయి. టాటామోటార్స్ 5.82 శాతం, యాక్సిస్ బ్యాంకు 4.65 శాతం, ఆంధ్రాబ్యాంకు 6.24 శాతం, సెంట్రల్ బ్యాంకు 4.79 శాతం, ఐసీఐసీఐ బ్యాంకు 4.09 శాతం, ఐడీబీఐ 6.56 శాతం...ఇలా అన్ని బ్యాంకుల షేర్లు పడిపోయాయి.

తేల్చని మోడీ

- కలిసిన సుజనాపై ఆగ్రహం
- ఆందోళన విరమించాలని సూచన
- సీఎంతో మాట్లాడతానన్నారని సమాచారం
- హామీలు ఇవ్వని వైనం



హామీలపై జైట్లీ హామీ

- ఈఏపీ లోటు భర్తీ చేస్తాం
- నాబార్డు ద్వారా నిధులివ్వలేము



11 లో

న్యూఢిల్లీ- విశాలాంధ్ర బ్యూరో : విభజన హామీలపై పార్లమెంటులోని ఉభయసభల్లో జరుగుతున్న గందరగోళంపై కేంద్రం దృష్టిని సారించింది. టీడీపీ పార్లమెంటరీ పార్టీనేత సుజనా చౌదరిని వెంటనే వచ్చి కలవాలని ప్రధానమంత్రి కార్యాలయం వర్తమానం పంపటంతో మంగళవారం న్యూఢిల్లీలోని పార్లమెంటులో ఉన్న ప్రధాని కార్యాలయానికి వెళ్లారు. కేంద్ర మంత్రి, టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత సుజనా చౌదరి ప్రధానమంత్రితో భేటీ అయ్యారు. విభజన హామీల అమలు విషయంలో కేంద్రం ఆంధ్రప్రదేశ్‌ను అవమానించటం సరికాదని, ఆర్థికంగా ఏపీని ఆదుకోవాలని కోరారు. ఒక వైపు ప్రత్యేక హోదా కల్పిస్తామని ప్రకటనలు చేసిన మీరు.. ఆ హోదా నుంచి ప్యాకేజీకి వచ్చారని అయినా తాము ప్రజల్ని ఒప్పించి మంచి ప్యాకేజీ వస్తుందని చెప్పామన్నారు. ఆఖరికి విభజన హామీలు అమలు కాలేదని, ప్యాకేజీలో అంశాల విషయంలో కూడా కేంద్రం నిర్లక్ష్యం వహిస్తుందని చెప్పినట్లు సమాచారం. నరేంద్ర మోడీ నుంచి మాత్రం సానుకూలంగా స్పందన రాలేదని సమాచారం. పార్లమెంటులో గందరగోళం చేయటం మంచిది కాదని, ఏమాత్రం చూస్తూ ఊరుకోమని హెచ్చరించినట్లు తెలిసింది. టీడీపీ ఎంపీలు

- మిగతా 2 లో

ఆన్‌లైన్లో ఏపీ సెట్స్-2018

జీవో జారీచేసిన ప్రభుత్వం



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని వివిధ విద్యా సంస్థలలో కోర్సుల ప్రవేశాల కోసం ఏపీ సెట్స్-2018 (ఏపీ కామన్ ఎంట్రన్స్‌సెట్స్) పరీక్షలను ఆన్‌లైన్లో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆదిత్యనాథ్ దాస్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ ఆన్‌లైన్లో ఆయా విభాగాలకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షల షెడ్యూలును గత డిసెంబరు 1వ తేదీన రాష్ట్ర మానవ వనరులశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు వెల్లడించిన విషయం విదితమే. ప్రస్తుత షెడ్యూలు ఆధారంగా ఎడ్‌సెట్-ఏప్రిల్ 19, లాసెట్-ఏప్రిల్ 19న, ఎంసెట్ ఇంజనీరింగ్-ఏప్రిల్ 22 నుంచి 25 వరకూ, ఎంసెట్-బైపీసీ పరీక్షలు ఏప్రిల్ 26న నిర్వహిస్తారు. ఐసెట్-మే 2న, ఈసెట్-మే 3న, పీజీ ఈసెట్-మే 10 నుంచి 12వరకూ, పీఈసెట్-మే 4 నుంచి 9వరకూ కొనసాగుతాయి. ఇప్పటివరకూ ఏపీ సెట్స్‌ను ఆఫ్‌లైన్లోనే నిర్వహించారు. 2018-19 విద్యా సంవత్సరం ఏపీ సెట్స్ పరీక్షలను ఆన్‌లైన్లో నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టాలని ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు ఉత్తర్వులు జారీ చేశారు. పూర్తిగా కంప్యూటర్ ఆధారంగా ఆన్‌లైన్లోనే ఈ పరీక్షలు కొనగుతాయి. ఏపీ సెట్స్‌లో భాగంగా 8 విద్యారంగాల పరీక్షలు ఏ ప్రిల్ 19 నుంచి మే 12 వరకూ కొనసాగుతాయి. ఆన్‌లైన్లో పరీక్షల నిర్వహణతో ఫలితాలు వేగవంతంగా వచ్చే అవకాశముంది. ఆయా సెట్లలో అభ్యర్థులు చూపిన ర్యాంకుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. గత ఏడాది బీఈడీ ప్రవేశ పరీక్షకు అభ్యర్థుల నుంచి స్పందన లేదు. రాష్ట్ర వ్యాప్తంగా తక్కువ మంది హాజరయ్యారు. బీఈడీ కోర్సును రెండేళ్లకు పెంచడంతో.. ఈ కోర్సు చదివేందుకు అభ్యర్థులు ఆసక్తి చూపట్లేదు. గత విద్యా సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా బీఈడీ కళాశాలల్లో సీట్లు మిగిలిపోయాయి. అన్ని పరీక్షలనూ ఆన్‌లైన్లో నిర్వహించడంతో గ్రామీణ ప్రాంత అభ్యర్థులకు కొంత అసౌకర్యం నెలకొనే అవకాశముంది.

డ్రామా ఉద్యమాలను ఆపాలి

- నిధుల కేటాయింపుపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- రేపటి బంద్‌కు టీడీపీ మద్దతు తెలిపాలి : రామకృష్ణ



విలేకరులతో మాట్లాడుతున్న రామకృష్ణ. పక్కన ముప్పాళ్ల, రావుల వెంకయ్య తదితరులు

విశాలాంధ్ర - ఒంగోలు : కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందంటూ పార్లమెంట్‌లో కాకుండా పార్లమెంట్ బయట గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన తెలపటం రాష్ట్ర ఎంపీలతో పాటు టీడీపీ ప్రభుత్వం సిగ్గుపడాల్సిన విషయమని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ అన్నారు. సీపీఐ ప్రకాశం జిల్లా 15వ మహాసభల సందర్భంగా ఒంగోలు నగరానికి వచ్చిన ఆయన సీపీఐ జిల్లా కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్ ఉభయసభలలో ఉన్న రాష్ట్రానికి చెందిన 39మంది ఎంపీలు కేంద్ర బడ్జెట్‌పై ఒక్కసారి రాష్ట్ర ప్రజల వాణి వినిపిస్తే కేంద్రం దిగొచ్చేదన్నారు. అలాకాకుండా కేవలం ఆరుగురు ఎంపీలు మాత్రమే గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులు ప్రదర్శించారన్నారు. మిగిలిన ఎంపీలు ఎమయ్యారని ప్రశ్నించారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని కూడా ప్రశ్నించే స్థితిలో ఎంపీలు లేరన్నారు. వారికి కావాల్సినవి వారి వ్యాపారాభివృద్ధులు, వారి ఆస్తులకు రక్షణ మాత్రమేనన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విభజన చట్టంలోని ఒక్క హామీని నెరవేర్చకుండా ఐదు కోట్ల మంది ప్రజలను మోసం చేశాయన్నారు. ఈ నెల 8న

- మిగతా 2 లో

సీపీఐ ప్రకాశం జిల్లా కార్యదర్శిగా ఎంఎల్ నారాయణ



విశాలాంధ్ర - ఒంగోలు బ్యూరో : సీపీఐ ప్రకాశంజిల్లా కార్యదర్శిగా ఎంఎల్ నారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మూడు రోజులపాటు ఒంగోలులో జరిగిన సీపీఐ జిల్లా 15వ మహాసభల్లో 67 మందితో నూతన సమితిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కౌన్సిల్ సభ్యులు స్థానిక మల్లయ్య లింగం భవనంలో సమావేశమై 15 మందితో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంఎల్ నారాయణ, ఆర్ వెంకట్రావు, వి హనుమారెడ్డి, పీవీఆర్ చౌదరి, అందే నాసరయ్య, ఆహ్వానితునిగా ఎస్‌డి సర్దార్ కార్యదర్శివర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా పై వారితోపాటు కేవీ కృష్ణ గౌడ్, ఎస్ రావమ్మ, ఐ లక్ష్మీశేషు, వై రవీంద్రబాబు, ఎస్‌డి మౌలాలి, పి మాలకొండయ్య, పి సింగరకొండ, పీవీఆర్ చౌదరి, కె వీరారెడ్డి, డి శ్రీను ఆహ్వానితులుగా ఎస్ కాశీం, బీవీ ఆంజనేయులు ఎన్నికయ్యారు.

ఇదీ లోకం!



అబ్బ కామెడీ ఛానల్ ఏం చూస్తాం గానీ విభజన హామీల నాటకం ఉంచండి. చాలా సరదాగా ఉంది!

కొరియాలో 'వికాసం' !

- వడివడిగా అడుగులు వేస్తున్న ఒడిశా
- అభివృద్ధి కార్యక్రమాలతో ఆకట్టుకునే యత్నం
- ఆచితూచి స్పందిస్తున్న ఆంధ్ర



విశాలాంధ్ర బ్యూరో-విజయనగరం : ఆంధ్రా ఒడిశా సరిహద్దుల్లో వివాదాస్పద కొఠియా గ్రామాలను సొంతం చేసుకొనేందుకు రెండు రాష్ట్ర ప్రభుత్వాలు పావులు కదుపుతున్నాయి. ఇన్నాళ్లూ అక్కడి ప్రజలను ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసిన పాలకులు, అక్కడి ఖనిజ సంపదను దృష్టిలో పెట్టుకొని గిరిపుత్రులను మచ్చిక చేసుకొనే ప్రయత్నాలను వేగవంతం చేశాయి. దీనిలో భాగంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసేందుకు ప్రత్యేక చర్యలను చేపట్టాయి. ఈ విషయంలో 'కొఠియా వికాసం' పేరుతో ఒడిశా ప్రభుత్వం ముందంజలో ఉండగా, ఆంధ్రప్రదేశ్ మాత్రం ఆచితూచి అడుగులు వేస్తోంది. కొఠియా ప్రాంతంలోని 22 వివాదాస్పద గిరిజన గ్రామాలు ఏళ్ల తరబడి నిర్లక్ష్యానికి గురయ్యాయి. ఈ గ్రామాలు మావంటే మావని ఒడిశా, ఆంధ్ర ప్రభుత్వాలు గొడవపడి, వివాదం సుప్రీంకోర్టుకు చేరింది. అక్కడినుంచి బంతి పార్లమెంటులోకి వెళ్లి యథాతథస్థితి అమల్లో ఉంది. ఈ పరిస్థితుల్లో రెండు రాష్ట్రాలూ ఈ గ్రామాల గిరిజనులను కేవలం ఓటర్లుగా మాత్రమే గుర్తించాయి. ఎన్నికల సమయంలో మాత్రమే వీరిని

- మిగతా 2 లో

ఇంత జరుగుతున్నా...

అమరావతి రైల్వే లైనుకు 10 కోట్లే

- 2017-18 అంచనా వ్యయం రూ. 2680 కోట్లు
- డీపీఆర్‌లో మారిన అంచనా వ్యయం రూ. 3272 కోట్లు
- ఏడాది వ్యవధిలో రూ. 592 కోట్లు పెరుగుదల



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : రాజధాని అమరావతి పూర్తిస్థాయిలో నిర్మాణం కానందున ఇప్పట్లో రైలుమార్గ నిర్మాణం అనవసరమని రైల్వేశాఖ భావిస్తున్నట్లు స్పష్టమైంది. విజయవాడ, గుంటూరులతో రాజధాని అమరావతిని అనుసంధానం చేస్తూ 106 కిలోమీటర్ల మేర కొత్త మార్గాన్ని నిర్మించాలని చంద్రబాబు ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ఈనేపథ్యంలో 2017-18 బడ్జెట్‌లో రూ. 2680 కోట్ల అంచనా వ్యయంతో కూడిన ఈ ప్రాజెక్టుకు కేంద్రం పచ్చజెండా ఊపింది. ఈ వ్యయాన్ని

- మిగతా 2 లో



సూడాన్‌లో కొనసాగుతున్న ఆందోళనలు

ఖర్టూం : సూడాన్ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా ప్రజల నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. సూడాన్ కమ్యూనిస్టు పార్టీతో సహా ఇతర ప్రతిపక్షాలు, ప్రజలు తమ నిరసన కొనసాగిస్తున్నారు. ఆర్థిక విధానాలను తిరస్కరిస్తూ నినాదాలు చేశారు. రాజధాని ఖర్టూం, ఓండర్మన్ నగరంలో భారీ ప్రదర్శనలు జరిగాయి. జనవరి 31వ తేదీన ఖర్టూం ఉత్తరప్రాంతంలో జరిగిన భారీ ప్రదర్శనకు ప్రజలు బ్రహ్మాండమైన తోడ్పాటు అందించారు. నిరసన తెలియజేస్తున్న ప్రతిపక్షాలు, కమ్యూనిస్టు కార్యకర్తలపైన ప్రభుత్వ సైనిక దళాలు విరుచుకుపడి తీవ్రంగా అణచివేసేందుకు పూనుకున్నాయి. అనేక పట్టణాలలో ప్రదర్శనలు జరుగుతున్నాయి. నిరసనకారులను జాతీయ నిఘా భద్రతా సర్వీసు దళాలు అరెస్టు చేశాయి. అరెస్టయిన వారిలో సూడాన్ కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ అబ్దుల్లా ఎల్‌డొమ ఉన్నారు. ఆయనతోపాటు మరో 450 మంది రాజకీయ కార్యకర్తలు, జర్నలిస్టులను 15 రోజులక్రితమే అరెస్టు చేశారు. వీరందరిని తక్షణం జైలునుంచి విడుదల చేయవలసిందిగా అనేక దేశాల కమ్యూనిస్టు పార్టీలు, ప్రజాస్వామ్య శక్తులు సూడాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ప్రకటనలు చేశాయి. రాజకీయ కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని డెమోక్రటిక్ ఫ్రంట్ న్యాయవాదులు డిమాండ్ చేశారు. కమ్యూనిస్టు పార్టీ వార్తాపత్రిక అల్-మియడాన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపైన నిరసన వ్యక్తం చేస్తున్నట్టుగా కమ్యూనిస్టు పార్టీ వెబ్‌సైట్ పేర్కొంది. దేశాన్ని పాలిస్తున్న ఫాసిస్టు ప్రభుత్వాన్ని తప్పించేందుకు విప్లవాత్మకమైన ప్రక్రియను కొనసాగించాలని కమ్యూనిస్టు పార్టీ ప్రజలకు పిలుపునిచ్చింది.



వెనిజులాకు అమెరికా బెదిరింపు

స్వాతంత్ర్య పరిరక్షణకు మదురో వాగ్దానం



కారకాస్ : వెనిజులానుంచి ముడిచమురు ఎగుమతులపై ఆంక్షలు విధిస్తామని, సైనిక జోక్యం చేసుకునే అవకాశం ఉంటుందని అమెరికా బెదిరించింది. అయితే ఈ బెదిరింపులకు తాము భయపడబోమని దేశ స్వాతంత్ర్యాన్ని పరిరక్షించుకుంటామని అధ్యక్షుడు నికొలస్ మదురో స్పష్టం చేశారు. అమెరికా విదేశాంగమంత్రి రెక్స్ టిల్లర్సన్ లాటిన్ అమెరికాలోని అర్జంటైనా రాజధాని బ్యూనస్ ఎయిర్స్‌లో పర్యటిస్తూ వెనిజులాకు దిగుమతులపైన, అలాగే ఆ దేశంనుంచి ఎగుమతి అయ్యే ముడిచమురుపైన ఆంక్షలు విధిస్తామని బెదిరించారు. ఆయన లాటిన్ అమెరికా, కరేబియన్ దేశాల్లో పర్యటించి చివరిగా అర్జంటైనాకు చేరుకున్నారు. వెనిజులాలో నూతన రాజ్యాంగం ప్రకారం ఏప్రిల్‌లో అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. అయితే ఈ ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయంగా పరిశీలనకు వీలుగా జరగాలని తాము కోరుకుంటున్నట్టు టిల్లర్సన్ చెప్పారు. ఒక స్వతంత్ర దేశంలో ఎన్నికలు జరుపుకోవడం అది అక్కడి ప్రభుత్వ హక్కు అన్న విషయాన్ని కూడా టిల్లర్సన్ ఖాతరు చేయకుండా బెదిరించాడు. పైగా వెనిజులాలో పరిస్థితి దారుణంగావుండి అందువల్ల తాము ఆంక్షలు విధించే అవకాశం వుందని టిల్లర్సన్ మాట్లాడారు. వినిమయవస్తువుల కొరత తీవ్రంగావుందని ద్రవ్యోల్బణం చాలా ఎక్కువగా ఉందని మాట్లాడారు. ఒకవైపు అన్ని విధాలుగా వెనిజులాను దిగ్బంధం చేస్తూ మరోవైపు అక్కడ కొరతలున్నాయని చెప్పడం అమెరికాకే చెల్లింది. టిల్లర్సన్ గతంలో బహుళజాతి కంపెని ఎగ్జన్‌మోబిల్ సిఇఒగా పనిచేశారు. ఇప్పుడే ఆయన వెనిజులాలోని సోషలిస్టు ప్రభుత్వంతో వివాదానికి దిగారు. వెనిజులాలో జరుగుతున్న రాజకీయ క్రమాన్ని తాము అంగీకరించబోమని టిల్లర్సన్ మాట్లాడారు. ప్రభుత్వంపై తిరుగుబాటు చేసేందుకు అక్కడి ప్రతిపక్షాలకు అమెరికా అన్నిరకాలుగా సహాయపడుతున్న విషయం బహిరంగ రహస్యమే. అమెరికా బెదిరింపులపై మదురో ఫేస్‌బుక్ వీడియో ద్వారా స్పందిస్తూ బెదిరింపులను ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగానే ఉన్నామని అన్నారు. తమ దేశంలో చమురు పరిశ్రమ పనిచేస్తున్నది. ఒకవైపు సామ్రాజ్యవాదులు బెదిరిస్తున్నారు. తమ కార్యకలాపాలను ఎవరూ అడ్డుకోలేరని ఆయన హెచ్చరించారు.

వందేళ్లయినా సమాన హక్కులకై మహిళా పోరు



లండన్ : బ్రిటన్‌లో వందేళ్లక్రితం ప్రజా ప్రాతినిధ్య చట్టం అమలులోకి వచ్చింది. ఈ చట్టం కొంతమంది మహిళ లకు ఓటు హక్కు కల్పించింది. అయితే మహిళలకు సంబంధించిన ఇతర హక్కు లు, సమస్యలు ఇంకా పరిష్కారం కాకుండా మిగిలేవున్నాయి. వీటికోసం ఇంకా పోరాటం కొనసాగించవలసిన పరిస్థితే నెలకొనివుంది. ఈ అంశాలన్నిటిపై లేబర్ పార్టీ కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం సాగిస్తు న్నారు. మహిళలకు ఆస్తి హక్కు కల్పించి వందేళ్ల యిన సందర్భంగా లేబర్ పార్టీకి సంబంధించిన షాడో కాబినెట్ మ్యూజియం ఆఫ్ లండన్‌లో సమావేశం కానున్నది. 1918లో 30 శాతానికిపైగా మహిళలకు ఓటు హక్కు లభించింది. ఇది జరిగిన 10 ఏళ్ల తరువాత 21 ఏళ్లు నిండిన మహిళలందరికీ ఓటు హక్కు లభించింది. ఈ అంశాన్ని వివరిస్తూ లేబర్ పార్టీ తమ షాడో కాబినెట్‌లో స్త్రీ, పురుష సమానత్వం ఉన్నదని పేర్కొన్నది. ప్రస్తుతం బ్రిటన్ పార్లమెంటులో మహిళా ఎంపీల సంఖ్య 32 శాతం ఉన్నది. పురుషులతో సమానంగా మహిళా ప్రాతినిధ్యం సాధించడం 2062 నాటికి మాత్రమే సాధ్యమవుతుందని కొంతమంది అంచనా వేశారు. మహిళల సంఖ్య పెరగడంద్వారా రాజకీయ చైతన్యంతో మహిళా హక్కులు కాపాడుకునే చట్టాలను ఆమోదించడానికి వీలుకలుగుతుందని ఫాసెట్ సొసైటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ శ్యామ్‌స్మెదర్స్ తెలిపారు. అయితే ఈ క్రమం వేగవంతం కావడానికి అవసరమైన చట్టాలకు ఆయా పార్టీలు తగిన చర్య తీసుకోవాలని ఆమె సూచించారు. మహిళా హక్కులపైన విస్తృత ప్రచారం నిర్వహించేందుకు షాడో క్యాబినెట్ నిర్ణయం తీసుకోనున్నది.

అమెరికా ఫెడరల్ రిజర్వు చైర్మన్ పావెల్



వాషింగ్టన్ : అమెరికా ఫెడరల్ రిజర్వు (సెంట్రల్ బ్యాంక్) నూతన చైర్మన్‌గా జెరొమిపావెల్ బాధ్యతలను స్వీకరించారు. జానెట్ ఎల్లెన్‌నుంచి ఆయన ఈ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నేడు నిరుద్యోగం చాలా తక్కువగా ఉంది, ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతోంది, ద్రవ్యోల్బణం తక్కువగా ఉంది అని అన్నారు. మనం తీసుకున్న ద్రవ్య విధానమే వీటికి కారణం, ఆర్థికవృద్ధికీ, మెరుగైన ఉద్యోగాల మార్కెట్‌కి ధరల స్థిరీకరణకు మన మద్దతు ఉంటుంది అని పావెల్ అన్నారు. ఫెడరల్ రిజర్వు 16వ చైర్మన్‌గా పావెల్ నియమితులయ్యారు. ఈ ఏడాది జనవరి చివరిలోనే పావెల్ నియామకాన్ని సెనేట్ ఆమోదించింది. ఆయన పదవీకాలం నాలుగేళ్లు ఉంటుంది. ఎదురయ్యే ఇబ్బందులకు తగిన విధంగా స్పందించేందుకు తాను తన సిబ్బంది సిద్ధంగా ఉంటామని పావెల్ అన్నారు. ఎగుడుదిగుడులకు లోనవుతున్న మార్కెట్ విసిరే సవాళ్లను ఆయన ప్రస్తుతం ఎదుర్కోవలసి వున్నది. అమెరికా స్టాక్ మార్కెట్లు సోమవారం కుప్పకూలాయి. గతవారం చివరిలో భారీ విక్రయాల కారణంగా ఈ పరిస్థితి ఏర్పడింది. పావెల్ హయాంలో వడ్డీరేట్లు పెరగవచ్చునని భావిస్తున్నారు. ఈ ఏడాది మొదటిసారిగా మార్చిలోను ఆ తరువాత రెండుదఫాలుగా వడ్డీరేట్లను పావెల్ పెంచే అవకాశంవుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు.

ఏఎన్‌సీ ఆఫీసు ఎదుట నిరసన

జోహాన్స్‌బర్గ్ : దక్షిణాఫ్రికా రాజధాని జోహాన్స్‌బర్గ్ డౌన్‌టౌన్‌లోని ఆఫ్రికా నేషనల్ కాంగ్రెస్ (ఎఎన్‌సి) ప్రధాన కార్యాలయం ఎదుట నల్లజెండాలతో నిరసన తెలియజేశారు. నిరసన తెలియజేస్తున్న మహిళలను ఎఎన్‌సి కార్యకర్తలు కొట్టారు. అధ్యక్షుడు జాకబ్‌జుమాకు వ్యతిరేకంగా నినాదాలు చేసిన ఉపాధ్యక్షుడు సిరిల్‌రాంఫోసా మద్దతుదారులను జుమా అనుకూల కార్యకర్తలు కొట్టారు. అనేకమంది నల్లటి టీషర్టులు ధరించినవారు రాంఫోసాకు అనుకూలంగా నినాదాలు చేశారు. ఎఎన్‌సి అధ్యక్ష పదవికి రాంఫోసా పోటీచేయనున్నారు. నిరసన తెలియజేస్తున్న మహిళలను లాక్కునివెళ్లి ట్రక్కులలో విసిరివేసి కొడుతున్న దృశ్యాలను దక్షిణాఫ్రికా టైమ్స్ వెబ్‌సైట్ ప్రసారం చేసింది. ఆఫ్రికన్ టైమ్స్ పత్రికలో బ్లాక్‌లాండ్ ఫస్ట్ గ్రూపు మద్దతుదారులను రాంఫోసా అనుచరులు కొట్టినట్టుగా తెలియజేసింది. పోలీసులువచ్చి బాధితులను కాపాడినట్టు ఆ పత్రిక పేర్కొంది. బ్లాక్‌లాండ్‌ఫస్ట్ గ్రూపుకి రాంఫోసా మద్దతుదారులకు మధ్య ఘర్షణ నివారించేందుకు పెద్దసంఖ్యలో పోలీసులు అవసరమయ్యారు. ప్రదర్శనకు ముందు ఎఎన్‌సి మహిళా ప్రతినిధి కౌసెలడికొ మాట్లాడుతూ నిరసన తెలిపే పౌరుల హక్కులను పాలక పార్టీ ఎల్లవేళలా గౌరవిస్తుందని అన్నారు. అయితే ఈ తాజాగా జరిగిన దాడిని మహిళలను కొట్టడాన్ని ఎఎన్‌సి తీవ్రంగా ఖండించింది.

టర్కీ వైఖరిపై లెబనాన్‌లో ప్రదర్శన



బీరుట్ : సిరియాలో అఫ్రిన్ నగరంపై టర్కీ సైన్యం దాడులు చేయడాన్ని వ్యతిరేకిస్తూ లెబనాన్‌లో వందలాదిమంది ప్రదర్శన జరిపారు. ప్రదర్శన జరిపినవారంతా కుర్దిష్ మూలాలు కలిగిన ప్రజలు. బీరుట్ నగరంలోని అమెరికా రాయబార కార్యాలయం ఎదుట ప్రదర్శనచేసి ఆదేశానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కారణంగానే టర్కీ దాడులు జరుపుతున్నదని ప్రదర్శకులు ఆరోపించారు. సిరియాలో తాము పోరాటం జరిపి ఐఎస్ ఉగ్రవాద సంస్థను నిర్మూలించామని అలాంటిది ఇప్పుడు టర్కీ సైన్యం తమపైన దాడులు జరుపుతున్నదని కుర్దిష్ ప్రదర్శకులు ఆరోపించారు. అమెరికా సైనిక దళాల కూటమిలో కుర్దిష్‌లు కూడా ఉండి ఐఎస్ ఉగ్రవాదులను నిర్మూలించినట్టుగా వారు చెప్పారు.

కల్లోలం

(మొదటిపేజీ తరువాయి)

అరెస్టుచేస్తే, సైన్యంలో చీలిక వస్తుందని ఆయన హెచ్చరించినట్లు తెలుస్తోంది. భారతదేశం దౌత్యపరమైన, సైనికపరమైన జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దాలని రాజకీయ ఖైదీలను విడుదల చేయించాలని ప్రస్తుత అధ్యక్షుడు రాజీనామా చేసేలా వత్తిడి తీసుకురావాలని ప్రవాసంలో ఉన్న మరో మాజీ అధ్యక్షుడు మహమ్మద్ నషీద్ భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. అరెస్టుచేసిన న్యాయమూర్తులను కూడా విడుదల చేయాలని ఆయన కోరారు. అలాగే దేశ పాలకులపై ఆర్థికఆంక్షలు విధించాలని అమెరికా ప్రభుత్వాన్నికూడా కోరారు. సామాన్యుల పరిస్థితి ఏంటని ఆందోళన చెందుతున్నారు.

రాజకీయ అనిశ్చితి కారణంగా 15 రోజులపాటు ఎమర్జెన్సీ అమల్లో ఉంటుందని అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్ సోమవారం (ఫిబ్రవరి 5న) ప్రకటించారు. ఎమర్జెన్సీ ప్రకటించిన గంటల వ్యవధిలోనే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులలో ఇద్దరిని అరెస్ట్ చేయడాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఏ కారణాలు, సెక్షన్ల కింద అరెస్ట్ చేశారో తెలపలేదు.. కానీ అరెస్ట్ విషయాన్ని ట్వీటర్ ద్వారా పోలీసులు వెల్లడించారు. దేశంలోని మీడియా సంస్థలపైన కూడా ప్రతికూల ప్రభావంపడింది. వాస్తవపరిస్థితులు పూర్తిగా అందే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. కొన్ని సంస్థలు వెబ్‌సైట్ల ద్వారా సమాచారం అందిస్తున్నాయి.

అసలేం జరిగిందంటే....?

9 మంది ప్రతిపక్ష నేతలను జైలు నుంచి విడుదల చేయాలని మాల్దీవుల సుప్రీంకోర్టు గత గురువారం ఆదేశించింది. ఇందుకు అధ్యక్షుడు యమీన్ నిరాకరించడంతో రాజకీయ సంక్షోభం నెలకొంది. తీర్పును వెనక్కి తీసుకోవాలంటూ యమీన్ ప్రధాన న్యాయమూర్తులకు లేఖ రాశారు. జడ్జీలు తమ తీర్పుపై వెనక్కి తగ్గక పోవడంతో యమీన్ ఎమర్జెన్సీ ప్రకటించారు. దీంతో భద్రతా దళాలకు విశేషాధికారాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశానుసారం సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ అబ్దుల్లా సయీద్‌తో పాటు మరో సీనియర్ జడ్జి జస్టిస్ అలీ హమీద్‌లను అరెస్ట్ చేసి మిగతా ఇద్దరు జడ్జీలు తమ తీర్పును మార్చుకోవాలని పరోక్షంగా హెచ్చరికలు జారీ చేసినట్లయింది. ఇదిలా ఉంటే...మాల్దీవుల్లో యమీన్ ఎమర్జెన్సీని విధించడం ఇది రెండోసారి. తనపై హత్యా ప్రయత్నం జరిగినప్పుడు 2015లో కూడా ఆయన ఎమర్జెన్సీ విధించారు. ఎమర్జెన్సీ విధించిన విషయాన్ని అధ్యక్షుడు రెండు రోజుల్లో పార్లమెంట్‌కు తెలియజేయాలి. పార్లమెంట్‌పై ఇప్పటికే నిరవధిక సస్పెన్షన్ విధించారు. యమీన్‌పై తిరుగుబాటు చేసిన 12 మంది ఎంపీల నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించడంతో దేశంలో రాజకీయ సంక్షోభానికి తెరలేచింది. రెబల్ ఎంపీలు ప్రతిపక్ష పార్టీతో చేతులు కలిపితే తన అభిశంసనకు అవసరమైన మెజారిటీ వారికి లభిస్తుందన్న భయంతోనే యమీన్ తీర్పును నిరాకరిస్తున్నట్టు తెలుస్తున్నది. న్యాయమూర్తులలోనూ పాలక,ప్రతిపక్షాలవలే విభజన ఏర్పడినట్లు తెలుస్తోంది. మరోవైపు ఎమర్జెన్సీ విధించినప్పటికీ యాత్రికులుదేశంలోకి రావచ్చుననీ, విమానాలు యాథావిధిగా తిరుగుతాయని యెమెన్ ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. మాల్దీవులకు వెళ్లవద్దని భారత ప్రభుత్వం ప్రజలను హెచ్చరించింది. అమెరికా, చైనా, బ్రిటన్‌లు కూడా మాల్దీవులకు వెళ్లవద్దని తమ దేశ ప్రజలను హెచ్చరించారు.

కొఠియాలో 'వికాసం'!

(మొదటిపేజీ తరువాయి)



ఉపయోగించుకొనేవి. రెండు రాష్ట్రాల ఎన్నికల్లోనూ ఈ గ్రామాల ప్రజలు ఓటు వేయడమే తప్ప. అభివృద్ధి కార్యక్రమాలు మాత్రం అరకొరే. కనీస సదుపాయాలు లేక గిరిజనులు ఇన్నాళ్లూ అల్లాడిపోతుండేవారు. ఈ నేపథ్యంలో ఇటీవలే విశాలాంధ్రతోపాటుగా వివిధ పత్రికల్లో ఈ ప్రాంత ప్రజల అవస్థలపై వరుసగా కథనాలు వెలువడ్డాయి. విజయనగరం జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్ స్పందించి, ఎంతో శ్రమకోర్చి కొఠియా గ్రామాల్లో పర్యటించారు. జన్మభూమి సభ నిర్వహించి, అక్కడి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ఒడిశా ప్రభుత్వం, కొఠియా గ్రామాలు తమవేనని మొండివాదన చేస్తూ కలెక్టర్‌పై కేసు పెట్టేందుకు కూడా సిద్ధమైంది. అంతటితో ఆగకుండా అభివృద్ధి కార్యక్రమాలను కూడా వేగవంతం చేసింది. ఒడిశా మీదుగా కొఠియా గ్రామాలకు ఆంధ్రా అధికారుల రాకపోకలను నియంత్రించేందుకు చెక్‌పోస్టును కూడా ఏర్పాటు చేసింది. ఎగువసెంబి నుంచి నేరెళ్లవలస మీదుగా కొఠియా గ్రామాలకు వెళ్లేందుకు వీలుగా దుర్భేద్యంగా ఉన్న అడవులు, కొండలు మధ్యగా అసంపూర్ణంగా ఉన్న సుమారు 4.5కిలోమీటర్ల రహదారిని పూర్తి చేసేందుకు తక్షణమే చర్యలు ప్రారంభించింది. కొఠియా గ్రామాల్లో ఉపాధిహామీ పనులను ప్రారంభించి, గ్రామాల మధ్య రహదారి సౌకర్యాలను కల్పించడంతోపాటు, గిరిజనులకు ఉపాధినిచ్చే చర్యలకు శ్రీకారం చుట్టింది. కోరాపుట్ కలెక్టర్ సుదర్శన చక్రవర్తి, ఆర్‌డిఓ కృతిపాత్ రౌత్ ఈ ప్రాంతాల్లో పర్యటించి, ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. కొఠియా నుంచి అంపావల్లి, కోరాపుట్ ప్రాంతాలకు హుటాహుటిన రెండు బస్సులను ప్రారంభించి రవాణా సౌకర్యాన్ని కల్పించారు. ముఖ్యంగా అక్కడి ప్రజాప్రతినిధులు మరింత దూకుడు ప్రదర్శిస్తూ కొఠియా గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ప్రజలను తమవైపు తిప్పుకొనేందుకు 'కొఠియా వికాశ్' ఉద్యమానికి కూడా శ్రీకారం చుట్టారు. ఒక కమిటీని ఏర్పాటు చేసి, ఈ కమిటీ సిఫార్సు చేసిన అభివృద్ధి పనులను చేస్తూ గిరిజన ప్రజల హృదయాలను గెలుచుకొనే ప్రయత్నాలు చేస్తున్నారు. కొఠియా గ్రామాల విషయంలో ఆంధ్రప్రదేశ్ తొలి నుంచి ఆచితూచి వ్యవహరిస్తోంది. పాఠశాలల ఏర్పాటు, తాగునీటి సౌకర్యం, ఆసుపత్రులు, రహదారుల నిర్మాణంలో ఒడిశాతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్ వెనుకబడి ఉందనే చెప్పాలి. ఈ గ్రామాల పట్ల తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ, ఇన్నాళ్లూ ఓటర్లుగానే గుర్తించింది. వివాదాస్పద 22 గ్రామాలకు కేంద్రమైన కొఠియా గ్రామానికి నేటికీ ఆంధ్ర నుంచి నేరుగా రహదారి సౌకర్యం లేదు. ఒడిశా మాత్రం తమ ప్రాంతం నుంచి నేరుగా కొఠియాకు చేరుకునేందుకు బీటీ రోడ్డును ఎన్నడో నిర్మించింది. అభివృద్ధి పనుల విషయంలో ఒడిశా దూకుడుగా వెళ్తోంది. కొఠియా నుంచి ఎగువసెంబి వరకు రహదారిని పూర్తి చేస్తే దాదాపు అన్ని కొఠియా గ్రామాలపైనా ఆధిపత్యం వచ్చినట్లే. ఇంత జరుగుతున్నా ఆంధ్రా మాత్రం జోరు పెంచలేదు. ఇటీవలే కలెక్టర్ పర్యటన తరువాత ఐదు గ్రామాలకు సోలార్ లైట్లను పంపిణీ చేశారు. అక్కడి ప్రజలకు ఆధార్ కార్డుల పంపిణీకి కూడా విజయనగరం ప్రభుత్వ యంత్రాంగం కొద్దిరోజుల క్రితం చర్యలు చేపట్టింది. ఎప్పటినుంచో ఉన్న డిమాండు ప్రకారం, ఏ రాష్ట్రంలో చేరాలన్న విషయంలో కొఠియా ప్రాంతంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తే ప్రజలు తమవైపే మొగ్గుచూపే విధంగా ఒడిశా ముందస్తు వ్యూహంతో దూసుకెళుతుండగా, ఆంధ్రప్రదేశ్ మాత్రం ఇవేమీ పట్టించుకోకుండా నిదానంగా వ్యవహరిస్తోంది.

రాష్ట్ర చేనేత సహకార సంఘాల అధ్యక్షుల పదవీకాలం పొడిగింపు

విశాలాంధ్ర-మచిలీపట్నం : రాష్ట్రంలోని చేనేత సహకార సంఘాల అధ్యక్షుల పదవీ కాలాన్ని ఆరునెలల పాటు పొడిగించారు. రాష్ట్రంలో 930 చేనేత సహకార సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల అధ్యక్షుల పదవీ కాలం ఈ సంవత్సరం జనవరి 31కి ముగియడంతో వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆప్కో పాలక వర్గం విజ్ఞప్తి మేరకు పొడిగించారు. దీంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత పారిశ్రామిక సంఘం లిమిటెడ్ డైరెక్టర్ల పదవీ కాలాన్ని పొడిగించినట్లయింది. రాష్ట్రంలో ఒక్కో జిల్లాకు ఒక్కో ఆప్కో డైరెక్టర్ ఉన్నారు. అయితే, ప్రస్తుతం 13మంది డైరెక్టర్లకుగాను 10మంది మాత్రమే ఉన్నారు. శ్రీకాకుళం జిల్లా డైరెక్టర్ కాలేపు సత్యారావు మృతి చెందడంతో, ఆయన స్థానంలో ఎవరినీ ఆప్కో డైరెక్టర్‌గా ఎన్నుకోలేదు. ప్రకాశం, చిత్తూరు జిల్లాల్లో డైరెక్టర్లు అనర్హులుగా ఉన్నందున ఈ రెండింటినీ కూడా భర్తీ చేయలేదు. ప్రతి జిల్లాలోని చేనేత సహకార సంఘాల అధ్యక్షులు ఆప్కో డైరెక్టర్‌ను ఎన్నుకుంటారు. అలా ఎన్నిక కాబడిన డైరెక్టర్లు ఆప్కో చైర్మన్‌ను ఎన్నుకుంటారు.

డ్రామా ఉద్యమాలను ఆపాలి

(మొదటిపేజీ తరువాయి)

వామపక్షాలు నిర్వహించే రాష్ట్ర బంద్‌కు టీడీపీ మద్దతివ్వాలన్నారు.. రాష్ట్ర ప్రజలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గందరగోళం పరిస్థితుల్లోకి నెడుతున్నారన్నారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉండి, హైదరాబాద్ మన చేతుల్లో ఉన్న సమయంలో కూడా రాష్ట్ర బడ్జెట్ లక్ష కోట్లకు మించలేదన్నారు. రాష్ట్రం విడిపోయి సంక్షోభంలో ఉన్న సమయంలో 13 జిల్లాలకు రెండు లక్షల రూపాయలతో బడ్జెట్ ఎలా ప్రకటించేందుకు ప్రయత్నిస్తున్నారో చెప్పాలన్నారు. బడ్జెట్‌కు ఉన్న ఆదాయ వనరులేంటో, డబ్బు ఎక్కడ నుండి తెస్తారో తేల్చాలన్నారు. విభజన సమయంలో 58శాతం జనాభాతో ఉన్న నవ్యాంధ్ర రాష్ట్రానికి అప్పుల వాటాగా 92వేల కోట్ల రూపాయలు వచ్చాయన్నారు. గడిచిన 44 నెలల కాలంలో ఆ అప్పును 2.26 లక్షల కోట్లు చేసిన ఘనత చంద్రబాబు నాయుడుదే అన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి కేవలం 44 నెలల్లో ఇంత అప్పు చేసిన దాఖలాలు లేవన్నారు. రాష్ట్ర ప్రజలను అప్పుల ఊబిలోకి నెట్టారన్నారు. కార్మికుల అసెంబ్లీ ముట్టడి సందర్భంగా సమస్యల పరిష్కారం ఢిల్లీ లో తేల్చుకోవాలని పేర్కొన్న చంద్రబాబు నాయుడు మరుగుదొడ్ల నిర్మాణాల కోసం శ్రీకాకుళంలో ధర్నా చేస్తామనటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆయన కూడా ప్రధాని నరేంద్ర మోడీ ఇంటి ఎదుట ధర్నా చేపట్టి సమస్యలను అక్కడే చెప్పుకోవాలని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కులాల కుమ్ములాటలకు కారణం చంద్రబాబు నాయుడే అన్నారు. ఇందుకు సంబంధించి అతి సున్నితమైన విషయాలు ఆలోచించకుండా, తనపరిధిలో లేని హామీలను చంద్రబాబు ఇచ్చారన్నారు.

బంద్‌కు అందరి మద్దతు : కేంద్రబడ్జెట్‌లో ఏపీకి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ, విభజన చట్టంలోని అంశాలకు నిధులు కేటాయించాలని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరుతూ ఈ నెల 8న రాష్ట్ర బంద్‌కు వామపక్ష పార్టీలు ఇచ్చిన పిలుపునకు అన్ని పార్టీలు మద్దతు తెలుపుతున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ నుండి ఈ పాటికే ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రఘువీరారెడ్డి మద్దతు ప్రకటించగా, జగన్‌కూడా వైఎస్సార్‌సీపీ బంద్‌లో పాల్గొంటుందని తెలిపారన్నారు. అలాగే ఉత్తరాంధ్ర చర్చావేదిక, అధ్యక్షులు కొణతాల రామకృష్ణ మద్దతు ప్రకటించారన్నారు. ఈ బంద్‌లో టిడిపి శ్రేణులు కూడా పాల్గొనాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, ఏఐకేఎస్ ఉపాధ్యక్షులు రావుల వెంకయ్య, సీపీఐ జిల్లా నాయకులు ఎంఎల్ నారాయణ, ఉప్పుటూరి ప్రకాశరావు, ఎస్‌డి సర్దార్, పివిఆర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

తేల్చని మోడీ

(మొదటిపేజీ తరువాయి)

వెంటనే ఆందోళన నిలిపివేసి ప్రభుత్వానికి సహకరించాలని ప్రధాని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. అయితే ఆందోళనను నిలిపే అంశం తన చేతిలో లేదని, ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయటంపై పార్లమెంటులో కేంద్రం ఒక స్పష్టమైన ప్రకటన చేయాలని సూచించారు. ఏపీ పట్ల కేంద్ర వ్యవహరిస్తున్న తీరును చూసి ఒకవైపు ప్రతిపక్షాలు మరోవైపు ప్రజలు కూడా తమను చిన్నచూపు చూస్తున్నారని వెంటనే ఏదో ఒక ప్రకటన చేయండి అని కోరినట్లు తెలిసింది. ప్రధానమంత్రిగా మీరు ప్రమాణ స్వీకారం చేసిన సమయం నుంచి నేటి వరకు కూడా కేంద్రానికి అన్ని విషయాల్లో తాము సహకరిస్తున్నామని సుజనా గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వచ్చి మీరు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని, అలాగే విభజన సమయంలో చట్టంలో పొందుపరిచిన వాటిని కూడా అమలు చేయలేదని సుజనా ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. రాజధాని శంకుస్థాపన సందర్భంగా కూడా చేసిన కొన్ని వాగ్దానాలను మరిచిపోయారని ప్రతిపక్షాలు దుమ్మెత్తి పోస్తున్నాయని ప్రధాని దృష్టికి తీసుకువచ్చారు. 2014 నుంచి 2018 వరకు కేంద్రం ఇచ్చిన నిధులు, అమలు చేసిన విభజన హామీలు కూడా చాలా తక్కువేనన్నారు. మరో ఏడాదిలో ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో కూడా కేంద్రం ఏపీని పట్టించుకోకపోతే తాము ప్రజల్లోకి ఎలా తిరిగి ఓట్లు అడగాలని ప్రశ్నించారు. ఇది కేవలం టీడీపీకి మాత్రమే కాదని, బీజేపీకి కూడా భారీగా నష్టం వాటిల్లే అవకాశం ఉందని సుజనా ప్రధానికి సూచించారు. విభజన హామీలు కేంద్రం నెరవేర్చకపోతే తాము ప్రజల్లోకి తిరగలేమని ఆందోళన బాటలో పయనించాల్సిందేనని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌పై వివక్షత కొనసాగించటం ఏమీ బాగోలేదని, ఎంపీలంతా కూడా చాలా ఆవేదనతో ఉన్నారని మోడీకి చెప్పారు. ఇటీవల చంద్రబాబు నాయుడు మిమల్ని కలిసి ఏపీ సమస్యలను వివరించారని, కానీ వాటినికూడా పట్టించుకోకుండా పక్కన పెట్టేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. దీనిపై ప్రధాని మోడీ స్పందిస్తూ ముందు మీ ఎంపీలంతా ఆందోళనను విరమించాలని ఆ తర్వాతే కేంద్రం ఏ నిర్ణయమైనా తీసుకుంటుందని ప్రధాని చెప్పినట్లు తెలిసింది. ఆందోళన విరమణ తన చేతిలో లేదని సుజనా చెప్పటంతో అయితే ఇక మీ సీఎంతో మాట్లాడుతాలే అంటూ ప్రధాని తన కుర్చీలోంచి లేచి లోపలికి వెళ్లిపోయారని సమాచారం. అయితే సుజనా చౌదరి ప్రధానమంత్రిని కలిసిన తర్వాత మీడియాతో మాట్లాడేందుకు నిరాకరించారు. ప్రధానితో సుజనా కలిసిన తర్వాత కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జెట్లీ ఉభయ సభల్లో కూడా ప్రకటన చేయటం విశేషం. ఇలాంటి ప్రకటనలు ప్రజలు నమ్మబోరని, ఒక నిర్దిష్టమైన కాలపరిమితితో కేంద్రం హామీ ఇస్తేనే ఆందోళన విరమిస్తామని ఎంపీలు చెప్పటం విశేషం. సాయంత్రం సుజనా చౌదరి, ఎంపీలు టీడీపీపీ ఛాంబర్‌లో సమావేశమై చంద్రబాబుతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. చంద్రబాబు కూడా ఎంపీల అభిప్రాయాలను తెలుసుకున్నారు. మోడీ మాటలు, కేంద్ర మంత్రుల హామీల గురించి చంద్రబాబు హామీలు వద్దు, రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన అంశాలను అమలు చేసే విషయంలో నిర్దేశిత కాలపరిమితిని ప్రకటించాలని, ఆ విధంగా పట్టుబట్టాలని ఎంపీలకు సూచించినట్లు తెలుస్తోంది. కేంద్రం దిగివచ్చినా వారి మాటలను టీడీపీ నేతలు నమ్మనట్లుగా అర్థమవుతోంది. ఏపీ ప్రయోజనాలు కాపాడతామంటూ మోడీ, కేంద్ర మంత్రులు గత నాలుగేళ్ళ నుంచి చెప్తూనే ఉన్నారని, అయినా కూడా స్పష్టమైన వివరణ కాలపరిమితి ప్రకటిస్తేనే తప్ప రాష్ట్ర ప్రయోజనాల విషయంలో వెనక్కు తగ్గాల్సిన పనిలేదని టీడీపీపీ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే తాము చెప్పిన మాటలను, హామీలను టీడీపీ అధినేత చంద్రబాబు, ఎంపీలు విశ్వసించటం లేదని అభిప్రాయానికి కేంద్రపెద్దలు వచ్చినట్లు తెలిసింది.

అమరావతి రైల్వే లైనుకు 10 కోట్లే

(మొదటిపేజీ తరువాయి)

కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 నిష్పత్తిలో భరించాల్సి ఉంది. మూడేళ్ల వ్యవధిలో నూతన మార్గాన్ని అందుబాటులోకి తీసుకురావాలని చంద్రబాబు ఆకాంక్షించారు. గత ఏడాది నవంబరులో రూపొందించిన సవివర ప్రణాళిక నివేదిక (డీపీఆర్)లో ఈ మార్గానికి రూ. 3272 కోట్ల వ్యయం కానుందని అంచనా వేసారు. ఏడాది వ్యవధిలోనే అంచనా వ్యయం రూ. 592 కోట్లు పెరిగింది. తాజాగా విడుదలైన పింక్‌బుక్‌లో 2018-19 సంవత్సరానికి గాను అమరావతి రైలు మార్గానికి రూ. 10 కోట్లను మాత్రమే కేటాయించారు. దీంతో ఇప్పట్లో ఈ ప్రాజెక్టు పూర్తి కాదన్న సంకేతాలకు నామమాత్రంగా కేటాయించిన నిధులే ఊతమిస్తున్నాయి. ఏటా ప్రాజెక్టు అంచనా వ్యయం పెరిగిపోతుంటే అరకొర నిధులను కేటాయించి చేతులు దులిపేసుకోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఆయా ప్రాజెక్టులపై పెట్టే పెట్టుబడి, వచ్చే రాబడిని దృష్టిలో ఉంచుకొని రైల్వేశాఖ ప్రాధాన్య క్రమంలో నిధులను కేటాయిస్తూ వస్తోంది. ప్రస్తుతం రైల్వేశాఖ ఖర్చు పెట్టే ప్రతి రూపాయిలో 57 పైసలు మాత్రమే రాబడి వస్తోందని, మిగిలిన 43 పైసలను కోల్పోవాల్సి వస్తోందని రైల్వే అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదాయం వచ్చే మార్గాకే ప్రాధాన్యం ఇస్తున్నట్లు స్పష్టం చేస్తున్నారు. అయితే రాజధానిలో వెలగపూడిలో తాత్కాలిక సచివాలయం తప్ప ఎలాంటి నిర్మాణాలు లేకపోవడంతో ప్రజా రవాణా ఇంకా ఊపందుకోలేదు. ఇటువంటి తరుణంలో అమరావతి రైల్వేస్టేషన్ నిర్మాణం అవసరంలేదనే వాదన వినిపిస్తోంది. ఇదే సమయంలో తాత్కాలిక రాజధాని విజయవాడతోపాటు పొరుగునున్న గుంటూరు పరిసరాల్లో ప్రభుత్వశాఖలకు చెందిన ప్రధాన కార్యాలయాలు రావడంతో ఆయా పనుల కోసం రాష్ట్ర నలుమూలల నుంచి రాకపోకలు పెరిగాయి. దీంతో విజయవాడ రైల్వేస్టేషన్‌పై వత్తిడి విపరీతంగా పెరిగింది. అదేవిధంగా గుంటూరు రైల్వేస్టేషన్‌కు కూడా ప్రయాణీకుల రాకపోకలు ఊపందుకున్నాయి. ముందుగా ఈరెండు స్టేషన్ల అభివృద్ధిపై దృష్టి సారించిన తర్వాతే అమరావతి ప్రాంతంలో కొత్త టెర్మినల్ నిర్మాణానికి ప్రాధాన్యం కల్పిస్తారనే అభిప్రాయాలను రైల్వే కార్మిక సంఘాల నేతలు వ్యక్తం చేస్తున్నారు. ముందుగా ప్రధాన నగరాలను అనుసంధానం చేస్తూ రైలు మార్గాన్ని నిర్మించాల్సి ఉందని, ఇదే సమయంలో కాజీపేట మార్గాన్ని అనుసంధానం చేసే క్రమంలో కృష్ణానదిపై వంతెనను కూడా నిర్మించాల్సి ఉందంటున్నారు. ఇవన్నీ జరిగే సమయానికి రాజధాని అమరావతి ప్రజలతో కళకళలాడం ఖాయమంటున్నారు.

అర్చక పరీక్షలకు నోటిఫికేషన్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆంధ్రప్రదేశ్ దేవాదాయ,ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర అర్చక శిక్షణ అకాడమీ ద్వారా వైదిక (స్మార్త), శైవ, పాంచరాత్ర, వైఖానస, తంత్రసార, వీరశైవ, చాత్తాద శ్రీవైష్ణవ, గ్రామదేవత ఆగమాలలో ప్రవేశ, వర ప్రవరల పరీక్షలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైంది. ఈ పరీక్షలు ఏప్రిల్‌లో నిర్వహిస్తామని కంట్రోలర్ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. నమూనా ధరఖాస్తు www.apendownments.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరచినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ధరఖాస్తులను ఫిబ్రవరి 10వ తేదీ నుంచి ఆన్‌లైన్, పోస్టు ద్వారా 'డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ అర్చక శిక్షణా సంస్థ, సీతా బిల్డింగ్, సీతానగరం, గుంటూరుజిల్లా' చిరునామాకు మార్చి 6వ తేదీలోగా సమర్పించాలన్నారు. పరీక్ష తేదీ వివరాలతో కూడిన హాల్‌టికెట్లు ఏప్రిల్ 2వ తేదీ నుంచి వెబ్‌సైట్ నుంచి నేరుగా పొందవచ్చన్నారు.

నేటి నుంచి చంద్రబాబు దుబాయ్ పర్యటన

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు మరో తొమ్మిది మందితో కలసి బుధవారం నుంచి రెండ్రోజులపాటు దుబాయ్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) దేశాలలో పర్యటించనున్నారు. ఇందుకు సంబంధించిన పాలనపరమైన అనుమతిని మంజూరు చేస్తూ సాధారణ పరిపాలనశాఖ కార్యదర్శి (పొలిటికల్) శ్రీకాంత్ నాగులాపల్లి జీవోను మంగళవారం జారీ చేశారు. రాష్ట్రంలో ఈనెల 24వ తేదీ నుంచి 26 వరకూ మూడ్రోజులపాటు జరగనున్న భాగస్వామ్య సదస్సు-2018 సందర్భంగా పెట్టుబడులే లక్ష్యంగా ఈ పర్యటన సాగనుంది. అలాగే యూఏఈలో జరిగే బిజినెస్ లీడర్స్, ఇన్వెస్టర్ల సదస్సులో చంద్రబాబు ప్రసంగించనున్నారు. ఈ బృందంలో రాష్ట్ర ఆర్థికశాఖమంత్రి యనమల రామకృష్ణుడు, ప్రభుత్వ సలహాదారు డాక్టర్ పరకాల ప్రభాకర్, ముఖ్యమంత్రి ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సతీష్‌చంద్ర, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ జి సాయిప్రసాద్, ఇంధనశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్, ఏపీ ఎకనామిక్ డెవలెప్‌మెంట్ బోర్డు సీఈఓ జాస్తి కృష్ణకిషోర్, ముఖ్యమంత్రి పర్సనల్ సెక్రటరీ పెండ్యాల శ్రీనివాసరావు, ముఖ్యమంత్రి ముఖ్య భద్రతాధికారులు సీహెచ్ భద్రయ్య, లంకెల సుబ్బారాయుడు ఉన్నారు.



అగ్ని-1 సక్సెస్

బాలాసోర్: స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన స్వల్ప శ్రేణి ఖండాతర క్షిపణి అగ్ని-1ను భారత్ మంగళవారం విజయ వంతంగా ప్రయోగించింది. ఒడిశాలోని డా.అబ్దుల్ కలాం ద్వీపం నుంచి క్షిపణిని విజయవంతంగా ప్రయోగించినట్లు రక్షణ శాఖ వెల్లడించింది. అణ్వస్త్ర సామర్థ్యం గల ఈ క్షిపణి ఉపరితలం నుంచి ఉపరితలంపై ఉన్న లక్ష్యాలను ఛేదిస్తుంది. ఇది దాదాపు 700 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను చేరుకోగలదు. అగ్ని-1 సుమారు 12 టన్నుల బరువు, 15మీటర్ల పొడవు ఉంటుంది. దాదాపు 1000 కేజీల వరకు పేలోడ్స్ మోసుకుపోగలదు. భారత సైన్యానికి చెందిన వ్యూహాత్మక దళాల శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఈరోజు క్షిపణి ప్రయోగం చేశారు. ప్రయోగం పూర్తిగా విజయ వంతమైందని, క్షిపణి లక్ష్యాలను ఛేదించిందని అధికారులు వెల్లడించారు. దీన్ని ఇప్పటికే భారత సైన్యంలో చేర్చారు.

బంద్ భగ్నానికేనా...!

- మరో కొత్తనాటకానికి తెర తీసిన టీడీపీ
- తూతూమంత్రంగా ఎంపీల నిరసనలు
- ప్రజల్లో అసంతృప్తిని చల్లార్చే పన్నాగాలు
- అఖిలపక్ష సమావేశానికి అధినేత అయిష్టత
- నాలుగేళ్లలో కానిది.. ఏడాదిలో అయ్యేనా : ప్రతిపక్షాలు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం జరిగిందని కేంద్రంపై టీడీపీ చేస్తున్న ఒత్తిడి తూతూమంత్రమేనని తేలిపోయింది. గత మూడ్రోజుల్లో చోటుచేసుకున్న పరిణామాలను గమనిస్తే.. ఎంపీలతో చంద్రబాబు సమావేశమైన సమయంలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఫోన్ చేయడం, ప్రధాని మోడీతో మాట్లాడాలని సూచించడం, టీడీపీ తన వ్యూహాన్ని మార్చుకోవడం, ఉభయ సభల లోపలా, బయటా ఎంపీల నిరసనలు.. మోడీతో కేంద్రమంత్రి భేటీ.. ఇలా మొత్తం ఎపిసోడ్‌లన్నింటికీ చంద్రబాబు మార్గదర్శకంలోనే జరుగు తున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇవన్నీ కూడా 8వ తేదీన జరిగే బంద్‌ను భగ్నం చేయడానికేనని స్పష్టమవుతోంది. ఎన్డీయే భాగస్వామిగా ఉన్న టీడీపీ బయట కేంద్రంపై యుద్ధం చేస్తున్నట్లు నటిస్తూ, లోపాయకారిగా అవగాహనకు వచ్చిందనే విమర్శలు రాజ్యమేలుతున్నాయి. బీజేపీ సహకారంతో టీడీపీ పథకం ప్రకారం ఈ నాటకానికి తెరలేపిందనడానికి ప్రస్తుత పరిణామాలు మరింత ఊతమిస్తున్నాయి. ప్రధానంగా ఈనెల 8వ తేదీన రాష్ట్రబంద్ జరగకుండా ఏవిధంగా అడ్డుకోవాలనే విషయమై ఈ రెండు పార్టీలు వ్యూహాలను రచించినట్లు తెలుస్తోంది. బంద్ జరిగినట్లయితే ప్రభుత్వాలపై ప్రజల్లో మరింత వ్యతిరేకత పెరిగిపోవడం ఖాయమని గుర్తించిన పాలకులు దీనిని ఏదో విధంగా నీరుగార్చాలని చూస్తున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. మోడీ, జైట్లీ హామీల అమలుకు కట్టుబడి ఉన్నామని చెబుతున్నందున మరికొంత కాలం వేచిచూద్దామనే నిర్ణయానికి చంద్రబాబు రావచ్చనే అభిప్రాయాలను చాలా మంది వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రానికి నాలుగేళ్లుగా కేంద్రం అన్యాయం చేస్తోందన్న విషయమై ప్రజల్లో నెలకొని ఉన్న అసంతృప్తిని గ్రహించిన కొందరు టీడీపీ ఎంపీలు ఆయా సందర్భాల్లో పార్లమెంటులో గట్టిగా మాట్లాడినా, తర్వాత అధినేత ఆజ్ఞలతో వెనుకడుగు వేస్తున్నారని చెబుతున్నారు. ముఖ్యంగా ప్రధానితో ఐదుగురు ఎంపీలే భేటీ కావాలని, మిగిలినవారు పార్లమెంటులో నిరసన తెలియచేయాలంటూ చంద్రబాబు ఆదేశాలు జారీచేయడంపై కూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి కీలక సమయంలో టీడీపీ ఎంపీలు ఇతర ఎంపీలను కలుపుకొని మూకుమ్మడిగా ప్రధానిని కలసి ఆయన వద్దే నిరసన వ్యక్తం చేస్తే ఫలితం ఉండేదని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. ఒకవైపు తాడోపేడో తేల్చుకుంటామని బెదిరిస్తూనే, మెత్తబడటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే ఇచ్చిన అనేక హామీలను విస్మరించిన కేంద్రం తాజాగా రాష్ట్రానికి నిధుల విషయంలో ఇచ్చే హామీని ప్రజలు నమ్మే పరిస్థితిలేదన్న విషయాన్ని చంద్రబాబు గుర్తించాలంటున్నారు. విభజనానంతరం కష్టాల్లో ఉన్న రాష్ట్రాన్ని ఆదుకోవడంలో కేంద్రం విఫలమైందని నాలుగేళ్లుగా పదేపదే వల్లె వేస్తున్న టీడీపీ ఆయా సందర్భాల్లో హడావుడి చేయడం.. కేంద్రం నుంచి ఏదో ఒక హామీ రావడం.. చంద్రబాబు మెత్తబడడం.. నేను ఎవరికీ భయపడననడం కేంద్రంతో గొడవలు పడి ఉపయోగంలేదు, ఏదో విధంగా కేంద్రాన్ని ఒప్పించి నిధులను రాబట్టుకుంటాం.. అని చెప్పడం పరిపాటై పోయిందని విపక్షాలు విమర్శిస్తున్నాయి. బడ్జెట్‌లో రాష్ట్రానికి కేంద్రం మొండి చెయ్యి చూపించడంతో ఈనెల 8వ తేదీన వామపక్షాలు బంద్‌కు పిలుపునివ్వడం, కాంగ్రెస్, వైసీపీ సహా పలు రాజకీయ పార్టీలు, వివిధ ప్రజా, కార్మిక, ఉద్యోగ, విద్యార్థి, యువజన సంఘాలు మద్దతు తెలిపిన విషయం తెలిసిందే. ప్రజల్లో నెలకొన్న అసంతృప్తిని దృష్టిలో పెట్టుకొని బంద్‌ను విజయవంతం చేసేందుకు పాలకులు సహకరించాలని వామపక్షాలు సూచిస్తున్నాయి. పోలీసులను ఉపయోగించి బంద్‌ను నీరుగార్చే యత్నాలు మానుకోవాలని కోరుతున్నాయి. రాష్ట్రాలకు ఏదైనా అన్యాయం జరిగితే ఏకంగా ప్రభుత్వాలే బంద్‌కు పిలుపునిచ్చిన సందర్భాలు అనేకం ఉన్నాయని గుర్తుచేస్తున్నాయి. రాజకీయ విశ్లేషకులు సైతం ఈవిషయంలో వామపక్షాల వాదనతో ఏకీభవి స్తున్నారు. ఓటుకు నోటు కేసును తిరగతోడతారనే భయం తోనే బాబు కేంద్రం చెప్పినట్లు ఆడుతున్నారని పునరుద్ఘా టిస్తున్నారు. మరోసారి మోడీ జిమ్మిక్కులకు తలొగ్గినట్లయితే ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో క్షమించరని పేర్కొంటున్నారు. ముఖ్యమంత్రి అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించేందుకు సిద్ధంగా లేరని టీడీపీకి చెందిన కొందరు నేతలు కూడా అంగీకరిస్తున్నారు. చావో,రేవో తమ అధినేత తేల్చుకుంటారే తప్ప ఆ అవకాశాన్ని వేరొకరికి ఇవ్వరని ఘంటాపథంగా చెబుతున్నారు.

ఆరోగ్యానికే 'సూర్య ఆరాధన'

అన్ని మతాల మనోభావాలను గౌరవిస్తా
ముస్లిం పెద్దలకు స్పష్టం చేసిన సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మత సామరస్యం తమ విధానమని, ఏ ఒక్కరి మత విశ్వాసాల్లో జోక్యం చేసుకునే ఆలోచన తనకు ఎంత మాత్రం లేదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ముస్లింలు కూడా సూర్య ఆరాధన చేయాలని ప్రభుత్వ పరంగా నిర్ణయించినట్లుగా ప్రసారమైన వార్తలతో ఆందోళన చెందిన మజ్లిస్-ఉల్-ఉల్మా వల్ ఐమా ప్రతినిధులు మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ అన్ని మతాల వారి మనోభావాలను గౌరవిస్తూ మత సామరస్యంతో వ్యవహరించడం తమ విధానమని చెప్పారు. సూర్యుని వలన కలిగే లాభాలను మనం ఆస్వాదించాలని, స్వీకరించి మన ఆరోగ్యం కాపాడుకోవాలన్న ఉద్దేశంతో మాత్రమే 'సూర్య ఆరాధన' కార్యక్రమ చేపట్టామని, మరేవిధమైన ఆలోచన తనకు లేదని చంద్రబాబు తెలిపారు. రాజమండ్రి మసీదులో చిన్న గురువు(మౌజన్)గా ఉంటూ హత్యకు గురయిన ఫరూక్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని, 5 లక్షల ఆర్థిక సహాయాన్ని పెంచాలని ముస్లిం పెద్దలు కోరగా ముఖ్యమంత్రి రూ. 10 లక్షలకు పెంచుతూ సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. అలాగే మసీదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరగా సీఎం సానుకూలంగా స్పందించారు. మదరసా బోర్డు విషయమై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై తమకు అభ్యంతరాలున్నాయని, రాష్ట్రంలో అది అమలు కాకుండా చూడాలని వారు కోరారు. దానిపై ఆందోళన చెందవద్దని ముఖ్యమంత్రి ముస్లిం పెద్దలకు భరోసా ఇచ్చారు. ఎమ్మెల్సీ అహ్మద్ షరీఫ్ సాహెబ్, ముస్లిం జేఏసీ కన్వీనర్ షేక్ మునీర్ అహ్మద్, ముస్లిం జర్నలిస్టు ఫోరం కన్వీనర్ అబ్దుల్ అలీం, ముఫ్తి ముజాహిద్ సాహెబ్, ముఫ్తి యూసఫ్ సాహెబ్, ముఫ్తి హబీబ్ సాహెబ్, ముఫ్తీ అక్బర్ సాహెబ్, అక్బర్ సాహెబ్, మౌలానా ఫరూక్ సాహెబ్, హఫీజ్ సాహెబ్, ఫరూక్ సాహెబ్, తదితరులు ముఖ్యమంత్రిని కలసిన వారిలో ఉన్నారు.



బడ్జెట్‌ను నిరసిస్తూ విద్యార్థుల అర్ధనగ్న ప్రదర్శన

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం జరిగిందని నిరసిస్తూ విద్యార్థి సంఘాలు మంగళవారం విజయవాడ లెనిన్‌సెంటరులో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించాయి. గత నాలుగేళ్లుగా బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే మాయమాటలు చెబుతూ ప్రజలు, యువకులు, విద్యార్థుల చెవుల్లో పువ్వులు పెడుతోందని నేతలు విమర్శించారు. చెవుల్లో పువ్వులు పెట్టుకొని అర్ధనగ్న ప్రదర్శన చేస్తూ కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఎండగట్టారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. ఏడాదిలో కోటి ఉద్యోగాలిస్తామని నరేంద్రమోడీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఉన్న ఉద్యోగాలను ఊడబీకుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ వల్ల చిన్న, మధ్య తరహా పరిశ్రమలు అనేక మూతపడ్డాయన్నారు. దీంతో అనేక కుటుంబాలు జీవనోపాధి లేక రోడ్డున పడుతున్నాయని తెలిపారు. విభజన చట్టంలో పేర్కొన్న విధంగా విశాఖపట్నం కేంద్రంగా కొత్త రైల్వేజోన్, కడప ఉక్కు ఫ్యాక్టరీ, కేంద్ర విద్యా సంస్థల ఏర్పాటుపై కేంద్రం విపరీతమైన జాప్యం చేస్తోంద న్నారు. మంజూరైన కేంద్ర విద్యాసంస్థలకు అరకొరగానే నిధులను సమకూరు స్తోందని విమర్శించారు. రాజధాని అమరావతి, పోలవరం నిర్మాణానికి నిధులను ఇవ్వడంలేదని, బడ్జెట్‌లో లోటును తీర్చడంలో కూడా కేంద్రం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. విభజన హామీలు, బడ్జెట్ కేటాయింపుల్లో అన్యాయానికి వ్యతిరేకంగా ఈనెల 8వ తేదీన నిర్వహించతలపెట్టిన రాష్ట్రబంద్‌ను జయప్రదం చేయాలని అన్ని వర్గాలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏఐవైఎఫ్, డీవైఎఫ్ఐ నాయకులు పి చరణ్‌సాయి, కె రమేష్, మోతుకూరి అరుణ్‌కుమార్, ప్రభాకర్, ఆర్ క్రాంతికుమార్, ఎస్‌కే అలీ, వినయ్‌కుమార్, ఇక్బాల్, నాగేశ్వరరావు, ఎం సోమేశ్వరరావు, కోటిబాబు, టి ప్రవీణ్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్లో 'టెట్' మాక్ టెస్టులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఏపీ టెట్ (ఉపాధ్యాయ విద్యార్హత పరీక్ష) రాసే అభ్యర్థుల కోసం సోమవారం నుంచి ఆన్‌లైన్లో మాక్ టెస్టులను అందుబాటులో ఉంచారు.పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వెబ్‌సైట్‌లోని ఏపీ టెట్ విభాగంలో మాక్ టెస్టులు సబ్జెక్టుల వారీగా ఉన్నాయి.తొలిసారిగా ఆన్‌లైన్ పద్ధతిలో టెట్ (పేపర్-1,2,3 పరీక్షలను) ఈ నెల 21వ తేదీ నుంచి మార్చి 3 వరకూ ప్రభుత్వం నిర్వహించనుంది.ఆన్‌లైన్‌లో నిర్వహ ణపై రాష్ట్రవ్యాప్తంగా అభ్యర్థులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. అభ్యర్థుల విన్నపాల మేరకు ఇప్పటికే రెండుసార్లు టెట్‌ను అధికారులు వాయిదా వేసిన విషయం విదితమే. ఆన్‌లైన్ పరీక్షలతో తమకు అసౌకర్యం కలుగుతుందని గ్రామీణ, గిరిజన ప్రాంత అభ్యర్థులు వాపోతున్నారు. టెట్‌ను ఆఫ్‌లైన్లోనే నిర్వహించాలని ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో నిరసనలు వ్యక్తం చేశారు.టెట్ పేపర్-1,2,3 విభాగాల్లో 150 మార్కులకు వేర్వేరుగా సబ్జెక్టుల ఆధారంగా నిర్వహిస్తారు. టెట్ పరీక్షలో 150 ప్రశ్నలకు(150 మార్కులు)గాను 150 నిమిషాల(2.30 గంటలు) సమయం కేటాయించారు. కంప్యూటర్ డిస్‌ప్లేలో ఒకేసారి ప్రశ్నలు, జవాబులు కన్పించవు. ఐదు నుంచి 10వరకూ మాత్రమే ఉంటాయి.ఆ తర్వాత మళ్లీ ప్రశ్నల నంబర్ల ఆధారంగా ముందుకెళ్లాలి.ప్రతి ప్రశ్నకూ జవాబు ఇచ్చేందుకుగాను కేవలం ఒకే ఒక్క నిమిషం సమయం కేటాయించారు.దీంతో సమయం వృధాగా మారుతుంది.ఇందులో సైకాలజీ అప్లికేషన్స్,ఇంగ్లీషు, తెలుగు వ్యాకరణాంశాలు, మ్యాథ్స్ సమస్యల సాధనకు కంప్యూటర్‌పై అవగాహన వున్న వారికే ఒక్క నిమిషం సరిపోదని అభ్యర్థులు పేర్కొంటున్నారు.ఆన్‌లైన్ టెస్టులతో సమయం వృధా అవుతుందని, అన్ని ప్రశ్నలకూ జవాబులు రాయడం కష్టమని వాపోతున్నారు.

టెట్ పేపర్-3 అభ్యర్థులకు సమాచారం

ఇటీవల టెట్ పేపర్-2 నుంచి పేపర్-3కి మార్పుచేసుకున్న భాషాంశాల అభ్యర్థుల రివైజ్డు దరఖాస్తులను ఆన్‌లైన్లో ఉంచారు. అభ్యర్థులంతా ఆప్షన్ల నమోదును సరిచూసుకుని నిర్ధారించు కోవాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యా లయం సూచించింది. ఈ మేరకు అభ్యర్థుల సెల్‌ఫోన్లకు వ్యక్తిగతంగా మెసేజ్‌లు పంపారు. టెట్ పేపర్-1,2,3 అభ్యర్థులకు ఈ నెల 10వ తేదీ నుంచి హాల్‌టిక్కెట్లను ఆన్‌లైన్లో అందుబాటులో వుంచుతారు. పేపర్-2 నుంచి పేపర్ 3కి ఆప్షన్ నమోదు చేసుకునే భాషాపండితుల అభ్యర్థుల కోసం టెట్ వెబ్‌సైట్‌లో ఎడిట్ ఆప్షన్‌ను అందుబాటులో ఉంచారు.



డీఎల్ రాతపరీక్ష, ఇంటర్వ్యూ మార్కుల వెల్లడి

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల లెక్చరర్ల(డీఎల్) రాత పరీక్ష, మార్కుల వివరాల్ని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) సోమవారం ప్రకటిం చింది. ఏపీపీఎస్సీ కమిషన్ వెబ్‌సైట్‌లో సబ్జెక్టుల వారీగా ఆయా కేటగిరీల అభ్యర్థులు రాత పరీక్ష, ఇంటర్వ్యూలో సాధించిన మార్కుల వివరాల్ని వెల్లడిం చారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా వున్న ఇంగ్లీషు, తెలుగు, స్టాటిస్టిక్స్, కెమిస్ట్రీ, మైక్రో-కెమిస్ట్రీ, బయో-కెమిస్ట్రీ, జూవాలజీ, కంప్యూటర్ అప్లికేషన్, కంప్యూటర్ సైన్స్, పొలిటికల్ సైన్స్, బోటనీ, కామర్స్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, ఎకనామిక్స్, హిందీ, హిస్టరీ సబ్జెక్టుల భర్తీకిగాను ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ నంబరు 26/2016 విడుదల చేసింది.రాత పరీక్షలో అభ్యర్థులు సాధించిన మార్కుల ఆధారంగా విజయవాడ ఏపీపీఎస్సీ కమిషన్ కార్యాలయంలో ఇటీవల వరకూ ఇంటర్వ్యూలు నిర్వహించారు.

ఆయేషా మీరా హత్య కేసు పునర్విచారణ ప్రారంభం

విశాలాంధ్ర - విజయవాడ : రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన బి.ఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా హత్య కేసు పునర్విచారణ ప్రారంభమైంది. హైకోర్టు ఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) మంగళవారం విచారణను ప్రారంభించింది. ఇబ్రహీం పట్నంలోని నిమ్రా కళాశాలలో బి.ఫార్మసీ చదువుతున్న ఆయేషా మీరా 2007 డిసెంబర్ 27వ తేదీన దారుణ హత్యకు గురైంది. ఈ ఘటన అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కేసులో తొలుత కింది కోర్టు నందిగామ ప్రాంతానికి చెందిన సత్యంబాబును దోషిగా నిర్ధారించి యావజ్జీవ శిక్ష విధించింది. అయితే హైకోర్టు మాత్రం సత్యంబాబును నిర్దోషిగా పేర్కొంటూ గత ఏడాది ఏప్రిల్ 30వ తేదీన విడుదల చేయాలని ఆదేశించింది. ఆ తర్వాత అసలు నిందితులను పట్టుకోవా లని పలువురు సామాజిక కార్యకర్తలు హైకోర్టులో ప్రజాప్రయోజనాల వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. ఈ మేరకు అసలు దోషులను పట్టుకోవాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. ఇందుకోసం ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి సూచించింది. కేసు దర్యాప్తు మాత్రం హైకోర్టు పరిధిలోనే సాగుతుందని స్పష్టంచేసింది. దీంతో ప్రభుత్వం విజయవాడ పోలీసు కమిషనర్ నేతృత్వంలో, విశాఖ పట్నం రేంజ్ డీఐజీ శ్రీకాంత్‌ను సిట్ అధికారిగా, మరికొందరు సభ్యులను నియమించింది. ఈ మేరకు విశాఖ రేంజ్ డీఐజీ శ్రీకాంత్ తన బృందంతో కలిసి మంగళవారం ఇబ్రహీంపట్నం వచ్చారు. ఆయేషా మీరా హత్యకు గురైన హాస్టల్‌ను పరిశీలించారు. హాస్టల్ సిబ్బంది నుంచి వివరాలు సేకరించారు.



విశాఖ ఉక్కులో సీఐటీయూ విజయకేతనం!

విశాలాంధ్ర - గాజువాక : ప్రతిష్ఠాత్మక విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ గుర్తింపు ఎన్నికల్లో సీఐటీయూ విజయం చేజిక్కించుకుంది. ఐఎన్‌టీయూసీపై సీఐటీయూ 198 ఓట్లు తేడాతో గెలుపు కైవశం చేసుకుంది. వరుసగా సిటు 3,784, ఇంటక్ 3,586, ఏఐటీయూసీ 3,234 ఓట్లు సాధించాయి. దీంతో ఏఐటీయూసీ మూడో స్థానంతోనే సరిపెట్టుకుంది. కేంద్ర కార్మిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికలు గట్టి బందోబస్తు నడుమ జరిగాయి. పోలింగ్ ప్రక్రియ పూర్తయిన వెంటనే బాక్సులు వీఎస్‌పీ శిక్షణ కేంద్రానికి తరలించారు. రాత్రి 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ మొదలయ్యింది. అర్ధరాత్రి 12 గంటలకు గానీ ఫలితాలు వెలువడలేదు. సిటు విజయంతో అక్కడి శ్రేణులు పండగ జరుపుకొన్నాయి.



తెలుగు పెద్దల చరిత్ర భావితరాలకు స్ఫూర్తి

పుస్తకావిష్కరణలో సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తెలుగు పెద్దల జీవిత చరిత్రలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని సీఎం చంద్రబాబు అన్నారు. అయితే నేటి తరానికి ఆశించినంత స్థాయిలో అందుబాటులో లేవన్నారు. రాష్ట్ర సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ మల్లాది కృష్ణానంద్ అక్షరీకరించిన 'మన తెలుగు పెద్దలు' పుస్తకాన్ని మంగళవారం రాత్రి సచివాలయంలో సీఎం ఆవిష్కరిం చారు. కీర్తి శేషులైన 241 తెలుగు ప్రముఖుల వివరాలు, జీవన రేఖా చిత్రాలతో ప్రచురించిన ఈ పుస్తకం పాత్రికేయులకు, విద్యార్థులకు, పరిశోధకులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని చంద్రబాబు తెలిపారు. తెలుగు పెద్దల జీవన రేఖా చిత్రాలు ఈ తరం వారికి స్ఫూర్తినిస్తాయని చెప్పారు. గతించిన పెద్దలతోనే వారి కీర్తి, స్ఫూర్తి కాలం ఒడిలోకి చేరకూడదని, అది భావితరాలకు అందాలన్నారు. తెలుగు పెద్దల జీవిత చరిత్రలు పరోక్షంగా ఎన్నో విషయాలు ప్రబోధిస్తాయని, నూతన స్ఫూర్తి, అవగాహన, ఉత్తేజాన్ని కలిగించి మార్గదర్శనం చేస్తాయన్నారు. మన సంస్కృతి, భాష, శాస్త్ర, సాంకేతిక రంగాలే కాకుండా అనేక రంగాల్లో కీర్తిశేషులైన తెలుగు పెద్దల జీవిత చిత్రాలను అందించిన మల్లాది కృష్ణానంద్‌ను ముఖ్యమంత్రి అభినందించారు. రాష్ట్ర సమాచార, గ్రామీణ గృహనిర్మాణ శాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ 'వీరి జీవిత చరిత్రలు ఒక వినూత్న జీవన వికాసం కలిగిస్తాయి' అని అన్నారు.

యావత్ తెలుగు జాతి గర్వపడేలా అనేక రంగాల్లో ఎందరో పెద్దలు విశేష కృషి చేశారని కొనియాడారు. వారి జీవిత చరిత్రలు నేటి తరానికి ప్రాతస్మరణీయం కావాలని ఉద్బోధించారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రు లు కింజరాపు అచ్చెన్నాయుడు, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు, సమాచార శాఖ కమిషనర్ సాలడుగు వెంకటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వానిదే తప్పు : చలసాని



విశాలాంధ్ర-కాకినాడ : ప్రత్యేక హోదా, విభజన హామీల విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్లిప్తంగా వ్యవహరించారని, రాష్ట్రానికి అన్యాయం జరిగిన విషయంలో మొదటి ముద్దాయి కేంద్రమైతే, రెండవ ముద్దాయి రాష్ట్ర ప్రభుత్వమని ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు చలసాని శ్రీనివాసరావు పేర్కొన్నారు. రాష్ట్రానికి చెందిన ఎంపీలు ఇక రాజీనామాల డ్రామాలు కట్టిపెట్టాలని అన్నారు. మంగళవారం తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కేంద్రప్రభుత్వం రాష్ట్రంపై కక్ష సాధింపు వైఖరి అవలంభించి దుర్మార్గంగా బడ్జెట్ కేటాయింపులు చేసిందని ధ్వజమెత్తారు. రైల్వేపరంగా రాష్ట్రానికి రూ.3,700 కోట్లు కేటాయించారని కాని కర్ణాటకకు రూ.20 వేల కోట్లు, మహారాష్ట్రకు రూ.50 వేలకోట్లు కేటాయించి రాష్ట్రానికి అన్యాయం చేస్తే బీజేపీ నాయకులు కాకి లెక్కలు చెబుతున్నారని విమర్శించారు. విద్యా సంస్థల ఏర్పాటుకు రూ.11వేల కోట్లు కావాల్సి ఉండగా రూ.240 కోట్లు మాత్రమే ఇచ్చారని, రాజధానికి ఒక్క రూపాయి ఇవ్వలేదని, పోలవరం ప్రాజెక్టుకు నిధుల కేటాయింపుల్లోనూ అన్యాయం జరిగిందన్నారు. ధైర్యం, చిత్తశుద్ధి ఉంటే రాష్ట్ర ఎంపీలందరూ ప్రధాని నరేంద్రమోడీ ఇంటిముందు ధర్నా చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం చేసిన తప్పును సవరించుకోవాలని డిమాండు చేశారు. ఈనెల 8వ తేదీన వామపక్షపార్టీలు ఇచ్చిన బంద్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి పూర్తి మద్దతునిస్తోందని, కాంగ్రెస్ వైసీపీ ముందుకు రావడాన్ని స్వాగతిస్తూ పవన్‌కళ్యాణ్ కూడా బడ్జెట్‌కు స్పందించి మద్దతు ఇవ్వాలని, టీడీపీ కూడా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి జిల్లా కన్వీనర్ తాటిపాక మధు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు కె.సత్తిబాబు, బీకేఎంయూ జిల్లా ప్రధానకార్యదర్శి నక్కా కిషోర్, విద్యార్థి జేఏసీ నాయకులు రవితేజ, బులిరాజు, వై.బాబి, శ్రీనివాస్, జాన్ పాల్గొన్నారు.

సమ్మెకు 'జూడా'లు సై..

14 నుంచి నిరసనలు -డీఎంఈకు నోటీసులు
రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు
ప్రభుత్వం స్పందించకుంటే అత్యవసర సేవలు నిలుపుదల: జూడా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ జూనియర్ డాక్టర్లు(జూడాలు) సమ్మెకు సన్నద్ధమయ్యారు.స్టైఫండును సక్రమంగా విడుదల చేయాలని, ఎండీ, ఎంఎస్ డిగ్రీలు పూర్తయిన వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలనే ఈ నెల 14వ తేదీ నుంచి సమ్మెకు దిగుతున్నట్లు డీఎంఈ(డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్), వైద్యారోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలకు నోటీసులు జారీ చేశారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే 16 నుంచి అత్యవసర సేవలను సైతం బహిష్కరిస్తామని ప్రకటించారు.ఏపీ జూడా అసోసియేషన్ ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్తంగా 13జిల్లాలకు చెందిన పీజీ, డిగ్రీ, డిప్లొమో వైద్య విద్యార్థులు సమ్మెకు సిద్ధమయ్యారు. ప్రభుత్వం స్పందించకుంటే 14 నుంచి జూడాలు ఆందోళనలు ప్రారంభిస్తారు.సమ్మెలో మూడేళ్ల పీజీ, రెండేళ్ల పీజీ డిప్లొమో, ఏడాది డిప్లొమో అభ్యర్థులు 10వేల మంది వుంటారు.ఎంబీబీఎస్ విద్యార్థుల పరీక్షల అనంతరం సమ్మెలో పాల్గొంటారు.

ప్రభుత్వం దిగి రాకుంటే సమ్మె యథాతథం: జూడా ప్రెసిడెంట్ వెంకటరమణ : 48గంటల్లోగా తమ సమస్యలను పరిష్కరించకుంటే ఈ నెల 14వ తేదీ నుంచి సమ్మెను కొనసాగిస్తామని ఏపీ జూడా అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ వెంకటరమణ పేర్కొన్నారు.తమ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలిపారు.ప్రభుత్వ జీవోలకు అనుగుణంగా స్టైఫండు ఇవ్వట్లేదని వాపోయారు.దీంతో జూనియర్ డాక్టర్లు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. పెండింగులో వున్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండు చేశారు.2016 నుంచి వేతనాలు పెంచాల్సి వున్నా..ఇంతవరకూ ప్రభుత్వం స్పందించలేదన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా 13జిల్లాల వారీగా ఎక్కడికక్కడే ఆందోళనలు కొనసాగుతాయని తెలిపారు.ఎండీ,ఎంఎస్ డిగ్రీలు అనంతరం చేయాల్సిన ఏడాది ప్రాక్టీస్ కోర్సుకు తమకు అభ్యంతరం లేదన్నారు.ఈ కోర్సు చేసే ముందే తమ డిగ్రీలను రిజిస్ట్రేషన్ చేస్తే..అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు వెళ్లేందుకు అవకాశముంటుందని పేర్కొన్నారు.

జూడాల సమస్యలు వెంటనే పరిష్కరించాలి
-ఏపీ కాంగ్రెస్ డాక్టర్స్ సెల్ కో-చైర్మన్ అంబటి

జూడాల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీ కాంగ్రెస్ డాక్టర్స్ సెల్ కో-చైర్మన్ అంబటి రాధాకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండు చేశారు. జూడాలు అత్యవసర సేవల నిలుపుదలకు పిలుపునివ్వడంతో రోగుల వైద్యసేవలకు ఆటంకం కలిగే ప్రమాదముందని పేర్కొన్నారు.ఈ సమయంలో ఒక్కరోగి ప్రాణం కోల్పోయినా ప్రభుత్వమే బాధ్యత వహించాలని పేర్కొన్నారు. సీనియర్ రెసిడెంట్లకూ సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధింపులకు గురిచేస్తున్నారని తెలిపారు. వైద్యులపై ప్రభుత్వం దారుణంగా వ్యవహరించడం బాధాకరమని పేర్కొన్నారు. జూడాల సమ్మెకు ఏపీ కాంగ్రెస్ డాక్టర్స్ సెల్ తరపున ఆయన సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

అమరావతిలో సీఎస్ఐఆర్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : అమరావతిలో పారిశ్రామిక, శాస్త్రీయ పరిశోధనకు ఉపకరించే ముఖ్య కేంద్రం ఏర్పాటు కాబోతోంది. దేశంలో అతి పెద్ద పరిశోధన-అభివృద్ధి సంస్థగా ఉన్న 'సీఎస్ఐఆర్' (కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్) తన ప్రయోగ కేంద్రాన్ని ఏపీ రాజధానిలో ఏర్పాటు చేయడానికి తగిన ప్రతిపాదనలతో ముందుకొచ్చింది. దేశవ్యాప్తంగా ఉన్న సీఎస్ఐఆర్ ప్రయోగశాలల్లో కనుగొన్న పరిశోధన ఫలాలను, సరికొత్త ఆవిష్కరణలను పరీక్షించి, ప్రదర్శించడానికి వీలుగా ఇక్కడ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. 'సెంటర్ ఫర్ స్కేలింగ్ అప్ అండ్ డిమాన్‌స్ట్రేషన్ ఆఫ్ రెలవెంట్ సీఎస్ఐఆర్ టెక్నాలజీస్' పేరుతో నెలకొల్పుతున్న ఈ ప్రాజెక్టుకు సంబంధించి మరో రెండు మాసాల్లో సవివర కార్య ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ గిరీశ్ సాహ్ని వెల్లడించారు. మంగళవారం సాయంత్రం గిరీశ్ సాహ్నీ, సీఎస్ఐఆర్ డైరెక్టర్లుగా ఉన్న సీనియర్ శాస్త్రవేత్తలతో కలిసి సచివాలయంలో సీఎం చంద్రబాబుతో సమావేశమయ్యారు. వివిధ శాఖలకు చెందిన రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు కూడా పాల్గొన్న ఈ సమావేశంలో సీఎస్ఐఆర్ డైరెక్టర్ల బృందం ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. దేశవ్యాప్తంగా సీఎస్ఐఆర్ నేతృత్వంలో 38 ప్రయోగశాలలు, 39 ఫీల్డ్ స్టేషన్లు ఉన్నాయని తెలిపారు. ఏరోస్పేస్ ఇంజనీరింగ్, కన్‌స్ట్రక్షన్ ఇంజనీరింగ్, ఓషన్ సైన్సెస్, లైఫ్ సైన్సెస్, మెటలర్జీ, కెమికల్స్, మైనింగ్, ఫుడ్, పెట్రోలియం, లెదర్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ వంటి అన్ని రంగాలలో తాము నిరంతర పరిశోధన చేస్తున్నామని గిరీశ్ సాహ్ని ముఖ్యమంత్రికి వివరించారు. శాస్త్ర సాంకేతికతను సమర్థంగా వినియోగించుకుంటున్న ఏపీ ప్రభుత్వ భాగస్వామ్యంలో కొత్త ప్రాజెక్టు కోసం పనిచేయడం తమకు ఎంతో ఉత్సాహాన్ని కలిగిస్తోందని చెప్పారు. రెండు మాసాలలో పూర్తి డీపీఆర్‌తో వస్తామని తెలిపారు. శాశ్వత నిర్మాణం పూర్తయ్యేవరకు వేచివుండాల్సిన అవసరం లేదని, తాత్కాలిక ఏర్పాటు చేసుకుని వెంటనే కార్యరంగంలోకి దిగాలని ముఖ్యమంత్రి వారికి సూచించారు. భారతదేశం గర్వించే స్థాయికి సీఎస్ఆర్ఐ ఎదిగినా, పరిశోధనా ఫలాలు క్షేత్రస్థాయికి చేరడం లేదన్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి తోడు ఇప్పుడు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ జత కలిసిందని గుర్తుచేశారు. సాంకేతికంగా ఉన్న ప్రతి ఒక్క అవకాశాన్నీ తమ ప్రభుత్వం సంపూర్ణంగా వినియోగించుకుంటోందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతోందని, డిజరప్టివ్ టెక్నాలజీ రంగప్రవేశంతో మన నైపుణ్యాలకు మరింత సాన పెట్టుకోవడం అవసరంగా మారిందని చెప్పారు. శాస్త్ర సాంకేతికతను మరింత సమర్థంగా వినియోగించుకునేలా సీఎస్ఐఆర్ తమకు మార్గదర్శనం చేయాలని కోరారు.

సంపాదకీయం

మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2018-19 కేంద్రబడ్జెట్ నిస్సందేహంగా వచ్చే ఏడాది జరుగనున్న లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఓటర్లను ఆకర్షించడానికి చేసిన కసరత్తే. బడ్జెట్‌లో కొత్తగా ప్రతిపాదించి బీమా సౌకర్యంతో కూడిన జాతీయ ఆరోగ్య సంరక్షణ పథకం (ఎన్‌హెచ్‌పీఎస్) ఆయుష్మాన్‌భవ పట్ల ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి వున్నదా? అంటే బహుశా లేదనే చెప్పాలి. ఈ పథకం బీమా సంస్థలు, ప్రైవేటు ఆరోగ్య సంరక్షణ కేంద్రాలను కాపాడుతుందేమోగానీ, సామాన్య ప్రజల ఆరోగ్యాన్ని ఏ మాత్రం కాపాడదనే చెప్పాలి. గతంలో కూడా ఆరోగ్య సంరక్షణకు కుటుంబానికి లక్ష రూపాయల బీమా సౌకర్యంతో ఆరోగ్య పథకం వుంది. అయితే, ఆ పథకం ప్రకారం ఎంతమందికి బీమా మొత్తాలు అందాయో గణాంకాలు లేవు. ఇప్పుడు ప్రతిపాదిత ఎన్‌హెచ్‌పీఎస్‌లో బీమా మొత్తాన్ని రూ. 5 లక్షలకు పెంచారు. కానీ విధివిధానాలు వెల్లడించకపోవడంతో కొత్త ఆరోగ్య సంరక్షణ పథకంపై ప్రజల్లో గందరగోళం నెలకొంది. 'అన్నం వుడికిందో లేదో తెలియడానికి ఒక మెతుకు పట్టుకుంటే చాలు' అన్నట్లుగా గత మూడున్నరేళ్ల మోడీ ప్రభుత్వ పాలనలో అనుసరించిన కార్పొరేట్ అనుకూల ప్రజావ్యతిరేక విధానాలను లోతుగా పరిశీలిస్తే అర్థమవుతుంది. ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడానికి ప్రభుత్వ ఆసుపత్రులు, అత్యాధునిక పరికరాలతో కూడిన ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, అంకితభావం గల వైద్యులు దోహదపడుతారు గానీ బీమా సంస్థలు మాత్రం కాదని చెప్పడం అతిశయోక్తి కాదు. ఎందుకంటే, ఆరోగ్య సంరక్షణ వ్యయం భారీగా వున్నప్పటికీ, బీమా కంపెనీలు అందించే మొత్తాలు మాత్రం అతితక్కువగా వుండటమే. ఆరోగ్య సంరక్షణ సౌకర్యాల తీవ్ర కొరత వున్న దాదాపు 135 కోట్ల జనాభా గల భారతదేశంలో ఈ ఏడాది బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి కేటాయించింది రూ. 54,667 కోట్లు మాత్రమే. గత ఏడాది కేటాయింపుల కన్నా కేవలం రూ. 5 వేల కోట్లు మాత్రమే అధికం. ఇది ప్రజల ఆరోగ్య సంరక్షణపై ప్రభుత్వ చిత్తశుద్ధిని పట్టిస్తుంది. ప్రభుత్వ ఆసుపత్రులలో, ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో అత్యాధునిక పరికరాలు లేకపోవడం కారణంగా ప్రతిఒక్కరూ ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లకే వెళతారు. ఆరోగ్య సంరక్షణకు అయ్యే భారీ వ్యయానికిగాను బీమా కంపెనీలు అందించే మొత్తం అతిస్వల్పం మాత్రమే. అందుచేత, దేశంలో ప్రస్తుత ఆరోగ్య బీమా కవర్ పద్ధతి ఒక జోక్‌గా మారిపోయింది. తగినంతగా లేని ఆరోగ్య సంరక్షణ మౌలిక సౌకర్యాలను అత్యవసర ప్రాతిపదికపై మెరుగుపర్చడానికి ప్రయత్నించడానికి బదులు బాధితుల సంరక్షణకుగాను ప్రభుత్వం బీమా సంస్థలకు నిధులు సమకూర్చి, వాటిని విశ్వసించడం దిగ్భ్రాంతికరమైనది. దేశానికి కావలసింది వందలాది పరికరాలు గల ఆరోగ్య కేంద్రాలు, లక్షలాది మంది మెడికల్ ప్రాక్టీషనర్లు, పారా మెడికోలు. అందుకు కావలసిన చర్యలు చేపట్టడానికి పథకాలు చేపట్టకుండా ఆరోగ్య సంరక్షణ విషయంలో సామాన్య ప్రజలను బీమా కంపెనీల దయాదాక్షిణ్యాలకు ఒదిలేయడం క్షంతవ్యంకాదు. డిమాండుకు తగ్గ విధంగా సరఫరాలు లేకపోవడంతో తీవ్ర ఒత్తిడికి లోనై ప్రస్తుత ప్రజారోగ్య సంరక్షణ సౌకర్యాలు

ఎన్‌హెచ్‌పీఎస్‌పై గందరగోళం

హరించుకుపోతున్నాయి. ప్రభుత్వాసుపత్రులలో రోగగ్రస్థుల రద్దీ విపరీతంగా వుండటంతో బాధిత సాధారణ పౌరులు విధిలేక ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లకు వెళ్లి వారి స్తోమతకు మించి ఖర్చులు భరించవలసిన దుస్థితిలో వుంటున్నారు. ప్రతిపాదిత నూతన జాతీయ ఆరోగ్య సంరక్షణ పథకం ప్రకటించిన వెంటనే బీమా కంపెనీలు, ప్రైవేటు ఆసుపత్రులు బడ్జెట్‌పై ప్రశంసలు ఎందుకు కురిపించాయో దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు. "ఇది మాకు బాగా తోడ్పడుతుంది. ప్రస్తుత బీమా పథకం ఆచరణ సాధ్యం కానిది. అయితే, బీమా కవర్ పెంచారు కనుక ఎన్‌హెచ్‌పీఎస్ కింద రోగుల సంఖ్య పెరుగుతుందని భావిస్తున్నాము" అని అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ ఎండీ సునీతరెడ్డి అన్నట్లు ఉటంకించబడింది. ఆమె సరిగానే చెప్పినట్లు కనబడుతోంది. ప్రైవేటు ఆసుపత్రుల్లో డెంగ్యూ జ్వర చికిత్సకు రూ. 16 లక్షల వరకు బిల్లు చెల్లించేందుకు దేశంలో కొన్ని బీమా పథకాలు అవకాశం కల్పిస్తున్నాయి. కార్పొరేట్ ఆదాయపన్ను చెల్లించకుండా వుండేందుకు ట్రస్టులుగా నడిపే కొన్ని ప్రైవేటు ఆసుపత్రులలో శుక్లాల శస్త్ర చికిత్స బిల్లు సైతం కవర్ కాని ఆరోగ్య బీమా విధానాలు వున్నాయి. దీన్నిబట్టి నూతన జాతీయ ఆరోగ్య పథకం వల్ల కార్పొరేట్ ఆసుపత్రులకే తప్ప సామాన్యులకు కాదని స్పష్టమవుతోంది. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రభుత్వ ఆర్థిక సహాయంతో కూడిన జాతీయ ఆరోగ్య కార్యక్రమం ఆచరణ సాధ్యం కాదని, అసలు ఈ పథకం శ్రీకారమే ప్రశ్నార్థకమని ఆర్థిక నిపుణులు, విశ్లేషకులు భావిస్తున్నారు. ఇది కేవలం రానున్న లోక్‌సభ ఎన్నికల ప్రచార అజెండాగా మాత్రమే మిగిలిపోతుంది. అంతిమంగా, ఈ ఆర్థిక భారంలో కొంత భారాన్ని రాష్ట్రాలు భరించవలసి వున్నందున రాష్ట్రాల భాగస్వామ్యం లేనందున జాతీయ స్థాయిలో ఈ పథకం అమలు చేయలేకపోయామని చెప్పి కేంద్రం చేతులు దులుపుకొంటుందనేది నిస్సందేహం. ఏడాదికి రూ. 30 వేలు బీమా కవర్‌ను సమకూర్చే రాష్ట్రీయ స్వస్థ బీమాయోజన (ఆర్ఎస్‌బీవై) స్థానంలో ఎన్‌హెచ్‌పీఎస్‌ను ప్రతిపాదించారు. ఏడాదికి రూ. 5 లక్షల వరకు బీమా కవరేజీతో 10 కోట్ల కుటుంబాలను నూతన ఆరోగ్య పథం కిందకు తీసుకొచ్చి వైద్యం అందించాలన్నది ప్రభుత్వ యోచన. ఆలోచన, ప్రతిపాదన మంచిదే అయినప్పటికీ... ఆచరణ సాధ్యం కానిదే. "ప్రైవేటు ఆసుపత్రుల ద్వారా సార్వజనీన ఆరోగ్యబీమా ఎక్కడా పేదలకు ప్రయోజనం కలుగజేయలేదు. అతిపెద్ద లబ్ధిదారులు ప్రైవేటు ఆసుపత్రులు, బీమా కంపెనీలే. ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణకు ప్రత్యామ్నాయం లేదు" అని మైక్రో బ్లాగింగ్‌లో ఆర్థికశాఖ మాజీ కార్యదర్శి అరవింద్ మాయారామ్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ పటిష్టత కార్యక్రమానికి కేంద్ర బడ్జెట్‌లో పాక్షికంగా మాత్రమే నిధులు కేటాయించారు. 2017 జాతీయ ఆరోగ్య విధానం ఆరోగ్య సంరక్షణ వ్యయం స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో 2.5 శాతం పెరుగుతుందని సూచించింది. ఇప్పుడు ఆరోగ్య సంరక్షణపై వ్యయం జీడీపీలో 1.2 శాతంగా మాత్రమే వుంది. ప్రభుత్వం ఎన్‌హెచ్‌పీఎస్ ప్రకటనతో సరిపెట్టుకోకుండా, సామాన్య, పేద ప్రజల ఆరోగ్య సంరక్షణకు అత్యాధునిక వైద్య పరికరాలతో ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలను, మెడికల్, పారామెడికల్ సంస్థలను, నర్సింగ్ కాలేజీలను పటిష్టపరిచేందుకు నిధులు కేటాయించి, వెచ్చించినప్పుడే ఆరోగ్య సంరక్షణ లక్ష్యం నెరవేరుతుంది. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

చురక

విభజన హామీల అమలు
విశ్వాసం సన్నగిల్లె
బడ్జెట్‌లో పైసా రాక
ప్రజల కళ్లు చెమ్మగిల్లె

కేంద్రంతో చంద్రబాబు
కేరింతల సహవాసం
ఆంధ్రరాష్ట్ర అభివృద్ధికి
అవుతున్నదా పరిహాసం

- వేల్పుల నారాయణ

విషాద సందర్భం

తోకల రాజేశం

"జ్యోతిష్యం లాంటి మార్మికమైన విషయాలన్నీ కూడా చాలా వరకు బలహీన మనస్తత్వానికి చిహ్నాలు. కాబట్టి అవి మన మనసుల్ని ఆక్రమిస్తున్నాయని అనిపించగానే మనం డాక్టరును సంప్రదించటం, మంచి ఆహారం, విశ్రాంతి తీసుకోవటం మంచిది" అని ఒక సందర్భంలో అన్నాడు స్వామి వివేకానంద. జ్యోతిషం, వాస్తు లాంటివి వివేకానందుని దృష్టిలో ప్రబలమైన మానసిక రోగాలు. అందుకే డాక్టరును సంప్రదించాలన్నాడు. ఇవన్నీ ప్రత్యక్షంగానో - పరోక్షంగానో మత విశ్వాసాలతో ముడిపడి వుంటాయి. వాస్తు, జ్యోతిష్యాల లాంటివి మూఢ నమ్మకాల కంటే తక్కువైనవేం కాదు. అనాగరిక మనస్తత్వం వున్న వాళ్ళు తప్పితే ఏ కాస్త విజ్ఞానం వున్న వాళ్ళు కూడా వీటిని నమ్మరు. ఎందుకు నమ్మరంటే వాటికి ఏ విధమైన - సహేతుకమైన ఆధారాలుండవు. వాస్తు పండితులు చెప్పే విషయాలను గుడ్డిగా నమ్మటం తప్ప - వాటిలో ఏ విధమైన కార్యకారణ సంబంధాలను గుర్తించలేం. ముందే చెప్పినట్టు మత విశ్వాసాలతో ముడిపడి వున్న వాస్తు, జ్యోతిష్యం దగ్గర కూడా సహజాతి సహజంగా పురోహిత వర్గం చేరటం - జేబులు నింపు కోవటం మనం నిత్యం గమనిస్తున్నదే. పురోహిత వర్గం తమ కడుపులోని చల్ల కదలకుండా బతకటానికి సృష్టించుకున్న అనేక నీచపుటెత్తుగడల్లో జ్యోతిష్యం, వాస్తు లాంటివి ఇప్పుడు సామాన్యుల జీవితాలతో మిగతా వాటితో పాటే ఒక ఆట ఆడుకుంటున్నాయి. దీన్ని గుర్తించటానికైనా - గుర్తించిన దాన్ని వ్యతిరేకించటానికైనా కావలసింది శాస్త్రీయ దృక్పథం. మన ప్రజల్లో అది లోపించటం వల్లనే రాను రాను మూఢ విశ్వాసాలు పెరిగిపోతున్నాయి.

శాస్త్రీయ దృక్పథం ప్రజల్లో లేకపోతే అర్థం చేసుకోవచ్చు. అది ప్రభుత్వాలలో కూడా లేకపోతే - ప్రభుత్వంలో మేధావులమని డాంబికాలు పలికే పెద్ద పెద్ద హోదాలున్న పెద్ద మనుషుల క్కూడా లేకపోతే ఎలా అర్థం చేసుకోగలం? రాజ్యాంగ బద్ధంగా పరిపాలన సాగించవలసిన ప్రభుత్వాలు తమ ఇష్టానుసారం ప్రవర్తిస్తూ ఆ రాజ్యాంగాన్ని అగౌరవ పరుస్తుంటే చూస్తూ ఎలా ఊరుకోగలం? "ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం, మానవతావాదం, సంస్కరణాభిలాషను పెంపొందించటం. అని రాజ్యాంగ బద్ధం చేసిన విలువకు ప్రభుత్వాలే నిలవనీడ లేకుండా చేయటం బహుశా ప్రపంచ దేశాలలో ఎక్కడా జరిగి వుండకపోవచ్చు - ఒక్క మనదేశంలో తప్ప. ఇట్లా చేసినందుకు చేస్తున్నందుకు ప్రభుత్వాలు సిగ్గుపడిన దాఖలాలు కూడా మన చరిత్ర పుటలలో లేవు. మన ప్రభుత్వాలన్నీ కూడా మతాల కొమ్మల మీద పూస్తున్న పూలే. ఇట్లాంటి మూఢ విశ్వాసాలన్నీ అదే మతానికి పుట్టిన కుక్కమూతి పిందెలు.

ఒకానొక వ్యక్తి స్వభావమైనా, అతని భవిష్యత్తు అయినా వ్యక్తి జన్మించిన ఘడియల్లో సూర్యచంద్రులతోపాటు కొన్ని ఇతర గ్రహాలు ఏయే స్థానాల్లో వున్నాయనే దాని మీద ఆధారపడి వుంటుందన్న విషయాన్నే ప్రధానం చేసుకొని జ్యోతిష్యం నడుస్తుంది. మనం నివసిస్తున్న ఇంటికి కిటికీలు, ద్వారాలు దగ్గరి నుంచి మొదలు పెడితే నీటిస్థలం, నిద్రాస్థలాల దాకా ఏవి ఎక్కడ వుండాలో - ఎన్నేసి సంఖ్యలో వుండాలో - అన్న విషయాలే ఆ ఇంట్లో నివసిస్తున్న వాళ్ళ సుఖదుఃఖాల మీద -మొత్తంగా జీవితం మీద తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తాయని వాస్తు శాస్త్రం (దీనికొక శాస్త్ర ప్రతిపత్తి లేకున్నా తిరోగమన భావజాలం గల మన ప్రభుత్వాలు దీన్ని విశ్వవిద్యాలయాల్లో బలవంతంగా, ప్రవేశపెట్టటం ద్వారా - కృత్రిమంగా దాన్నొక శాస్త్రంగా తయారు చేశారు! ఘోషిస్తుంది. సొంత తెలివితో ఆలోచించే వాళ్ళెవరికైనా వీటిలో ఎంత అసంబద్ధత వుందో అర్థమవుతుంది. ఎక్కడో సుదూర తీరాల్లో వున్న గ్రహాలు మనల్ని నియంత్రిస్తున్నాయంటే మనం నివశిస్తున్న ఇంటిలోని గదుల సంఖ్య దార్వాజాల సంఖ్య, ఆ గదుల దిశ - మన జీవితాల్ని నియంత్రిస్తున్నాయంటే - ఆ చెప్పేవాడు! వినేవాడూ ఎంతటి ఆటవిక మనస్తత్వాలను కలిగివున్నారో అర్థం చేసుకోవచ్చు. మొట్టమొదటగా వాళ్ళ మీద జాలిపడవలసిందే తప్ప చేయగలగిందేమీ లేదు.

జ్యోతిష్య, వాస్తు పండితులు చెబుతున్న దాని ప్రకారం చూస్తే - వ్యక్తి తన ప్రవర్తనకు తానేవిధంగానూ కారకుడు కాదు. రిమోట్ కంట్రోల్ గ్రహాల చేతిలో వుంటుంది కదా! తాను తప్పుచేసినా, ఒప్పు చేసినా, అంతా గ్రహాలు లీలల వల్లనే. మనుషులు చేస్తున్న పనులన్నింటికీ గ్రహలే కారణమైనప్పుడు మనుషులందరూ కేవలం నిమిత్త మాత్రులేనన్న మాట. ఈ లోకంలో జరుగుతున్న అరాచాకాలకు కారణం గ్రహాలే. ప్రభుత్వాలు ఘోరమైన అపరాధానికి పాల్పడుతున్నాయి. పాపం జ్యోతిష్య వాస్తు శాస్త్రాలను ఎంతో బలంగా నమ్మే మన ప్రభుత్వాలకు ఈ విషయమే తట్టకపోవటం ఆశ్చర్యం వేస్తుంది. ఇక నుంచైనా లోకంలో జరుగుతున్న తప్పులకు మనుషులను వదిలిపెట్టి గ్రహాలను నిర్బంధించే పనికి ఈ ప్రభుత్వాలు పూనుకోవాలి. మనిషి చేతుల్లో ఏమీ లేనపుడు - ఆ మనిషి జీవితాన్నే గ్రహాలు ప్రభావితం చేస్తున్నప్పుడు మనిషి చేసిన తప్పులకు తిరిగి ఆ మనిషే బాధ్యుడెలా అవుతాడు?

గ్రహాలు మనిషిని నియంత్రిస్తాయని మోసం చేస్తున్న ఈ జ్యోతిష్య పండితులు ఇప్పటికే ఖగోళ శాస్త్రజ్ఞులు కనిపెట్టిన అనేక గ్రహాలలోంచి కేవలం కొన్నింటినే తీసుకున్నారు.మరి గ్రహాలే ప్రభావం చూపుతాయి కాని మిగతా గ్రహాలు చూపవా? గ్రహాలన్నీ అంతరిక్షంలోనే ఉన్నప్పుడు ఈ నవగ్రహాలకున్న శక్తి మిగిలిన గ్రహాలకెందుకు లేకుండా పోయింది? అసలు జ్యోతిష్య శాస్త్రం పుట్టిన మొదట్లో ఈ ప్రపంచానికి భూమితో పాటు ఆరుగ్రహాలు మాత్రమే తెలుసు. అవి బుధుడు, శుక్రుడు, కుజుడు, బృహస్పతి, శని గ్రహాలు. అసలు కొత్త కొత్త గ్రహాలను ఖగోళ శాస్త్రజ్ఞులు కనిపెట్టే దాకా ఆగటమెందుకు? ఈ జ్యోతిష్య, వాస్తు పండితులే కనిపెట్టి పారేస్తే అయిపోయేది కదా! ఇట్లాంటి ప్రశ్నలు రాకుండా ఈ పండితులు చెప్పే తలకిందుల వాదన ఏమిటో తెలుసా? - ఒక గ్రహాన్ని కనిపెట్టే వరకు దాని ప్రభావం మనుషులపై వుండదని చెప్పటం. నమ్మే వాళ్లుంటే గాలిలో మేడలు కట్టిస్తామంటారు వీళ్ళు. ఇంకా ఘోరమైన విషయమేమిటంటే - తరచూ రాహుకాలమని జనాన్ని ఏ పనులూ చేసుకోకుండా భయపెట్టే ఈ కుహనా పండితులు రాహుగ్రహం అనేది అంతరిక్షంలో లేదని, అది ఊహాత్మక గ్రహమనే విషయం చాలా మందికి తెలియకుండా జాగ్రత్త పడతారు. రాహు కేతువులన్నది కేవలం ఊహాత్మక గ్రహాలు. లేని గ్రహాలను ఊహించుకోవటం, వాటి వల్ల మనకు నష్టాలున్నాయని నమ్మించటం ప్రజలను ఘోరంగా మోసం చేయటమే జ్యోతిష్యం ఇప్పటికే మూఢంగా భూకేంద్రక సిద్ధాంతాన్నే సమర్థిస్తుంది. కోపర్నికస్ వచ్చి ఈ విశ్వానికి కేంద్రం భూమి కాదని, సూర్యుడని నిరూపించిన తరువాత కూడా - అదే భూకేంద్రక సిద్ధాంతాన్ని పట్టుకు వేలాడే జ్యోతిష్య శాస్త్రం - శాస్త్రమెట్లా అవుతుంది? దాన్ని నమ్మే వాళ్ళకు, నమ్మించే వాళ్లకు విజ్ఞాన శాస్త్రానికి సంబంధించినంత వరకు ఓనమాలు కూడా రావని అర్థం అవుతుంది. ఒక దశాబ్ద కాలం కిందట ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో "ఐన్‌స్టీన్ స్మారకంగా" చేసిన ఒక ప్రసంగంలో ప్రసిద్ధ బ్రిటీషు శాస్త్రజ్ఞుడు స్టీఫెన్ హాకింగ్-" భూమి ఈ విశ్వాంతరాళానికి కేంద్రం కాదని తేలిన మరుక్షణం జ్యోతిష్యం అర్థరహితంగా మారిపోయిందన్నాడు.

చాలామంది తేలిగ్గానే తీసుకుంటున్నారు గానీ వాస్తు, జ్యోతిష్యాలనే భయం కరమైన మూఢనమ్మకాలు, వీటి వల్ల సామాన్య ప్రజలు మానసికంగా, ఆర్థికంగా ఎంత దిగజారి పోవాలో అంతగా దిగజారిపోతున్నారు. వీటివల్ల లాభమేదన్నా కన్నా వున్నది అంటే అది కేవలం వాస్తు, జ్యోతిష్య పండితులకు మాత్రమే. బతికేది వాళ్లు చచ్చేది మాత్రం సామాన్యులు. ఈ ఘోరాన్ని ఆపటానికి ప్రభుత్వాలు ముందుకు వస్తాయని ఆశిస్తే - ఆ ప్రభుత్వాలే ఇప్పుడా ఘోరంలో పాలు పంచుకుంటున్న విషాద సందర్భంలో మనమున్నాం!

- సీనియర్ జర్నలిస్టు, సెల్ : 9676761415

అంతర్జాతీయం

వెనిజులాలో అమెరికా సైనిక కుట్ర



బుడ్డిగ జమిందార్

ఫిబ్రవరినెల ప్రారంభంనుండి అమెరికా విదేశాంగ సెక్రెటరీ రెక్స్ టిల్లర్సన్ 5 రోజులపాటు లాటిన్ అమెరికా దేశాలైన మెక్సికో, అర్జంటైనా, పెరూ, కొలంబియా, జమైకా దేశాలను పర్యటించే ముందు యూనివర్శిటీ ఆఫ్ టెక్సాస్‌లో ఉపన్యసిస్తూ వెనిజులాపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసి లాటిన్ అమెరికా దేశాలపై అమెరికా నైజాన్ని రుజువుచేసాడు. వెనిజులాలో ప్రభుత్వ మార్పిడికి అమెరికా సూచించుట లేదని, తనదగ్గర ఆ మార్పుకు సంబంధించిన ఇంటిలిజెన్స్ విభాగ వ్యూహాలు ఏమీలేవని అంటూనే 'చారిత్రాత్మకంగా లాటిన్ అమెరికా దేశాల్లో తీవ్ర సంక్షోభాలు తలెత్తినపుడు మిలిటరీ జోక్యం చేసుకొన్న సందర్భాలు అనేకం ఉన్నాయి' అని తెలిపి పరోక్షంగా వెనిజులాలో సైనిక కుట్రను ప్రోత్సహిస్తూ, ఆ కుట్రపై అమెరికా పథకం రచిస్తున్నట్లు అటువంటి సైనికకుట్రకు ప్రణాళికను తయారైనట్లు ప్రపంచానికి రెక్స్ టిల్లర్సన్ తెలిపారు. ఏప్రిల్ 2018లో వెనిజులాలో జరుగనున్న అధ్యక్ష ఎన్నికలకు మద్దతునీయటంమాని సైనిక తిరుగుబాటును ప్రోత్సహించటం వెనుక అమెరికా సామ్రాజ్యవాద అప్రజాస్వామిక కుటిల రాజకీయ నీతి దాగివుంది. ఇంతటితో ఆగక చైనాపై విరుచుకుపడుతూ లాటిన్ అమెరికా దేశాలు చైనాతో అప్రమత్తంగా ఉండాలని, దక్షిణ అమెరికా దేశాల అభివృద్ధికి చైనా చేసిందేమీలేదని అన్నారు. జనవరి నెలాఖరున చైనా విదేశాంగ మంత్రి చిలీలో 33మంది సభ్యులుగల లాటిన్ అమెరికా కరేబియన్ దేశాల ప్రతినిధులతో మాట్లాడుతూ '2008 నుండి అమెరికాలో తలెత్తిన సంక్షోభ నేపథ్యంలో లాటిన్ అమెరికా దేశాలతో చైనా మంచి వాణిజ్య సంబంధాలను నెలకొల్పుకుందని, 2015 నుండి 2019 వరకూ 25,000 కోట్ల డాలర్లను ప్రత్యక్ష పెట్టుబడులకు, 50,000 కోట్ల డాలర్లను వాణిజ్యంలోనూ ఉంచి అభివృద్ధి చేస్తుందని తెలియజేశారు. అర్జెంటైనా, చిలీ, బ్రెజిల్, పెరూ దేశాలలో తమదేశం అగ్రగామి విదేశీ వాణిజ్యదేశంగా ఉందని చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యి తెలియజేశారు. దీనినిబట్టి లాటిన్ అమెరికాలో చైనా మంచి సంబంధాలను అర్థం చేసుకోవచ్చును.

కార్పొరేట్ల ఆటలు సాగనివ్వలేదు

ప్రపంచ చమురు నిల్వల్లో 24.8% భాగంతో అగ్రగామిగా ఉన్న వెనిజులాలో అమెరికా పప్పులు ఉడకటంలేదు. అందుకనే మొసలికన్నీరు కార్చటం మొదలుపెట్టింది. వెనిజులా విప్లవ అధ్యక్షుడు చావెజ్ తను 14 సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు దేశాభివృద్ధి కోసమై అనేక సంస్కరణల్ని చేశారు. బహుళజాతి ఆయిల్ కంపెనీలను జాతీయం చేశాడనే వెనిజులాపై ఒపెక్ కంపెనీలకు, అమెరికాకు అక్కసు. అప్పటివరకూ కారుచౌకగా తరలిస్తున్న ముడిచమురు కదలికకు కళ్లెంపడింది. 2007లో ఒర్నీకో ప్రాంతంలోని 4 అతిపెద్ద చమురు కంపెనీలను జాతీయం చేశారు. ఈ బెల్ట్ ఖరీదు సుమారు 3000 కోట్ల డాలర్లు. ఎక్సాన్ మొబైల్ కార్పోరేషన్, కొనొక్కో ఫిలిప్స్‌వంటి కంపెనీలు దేశాన్ని వదిలి పారిపోయాయి. అమెరికా విదేశాంగమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టేనాటికి అప్పటి ఎక్సాన్ కంపెనీ సిఓగా రెక్స్ టిల్లర్సన్ ఉండటం గమనార్హం. కనుకనే వెనిజులా అంటే తనకు అంతటి



వెనిజులాను కబళించేందుకు పొంచివున్న అమెరికా "సామ్రాజ్యవాద డేగ"

మొసలికన్నీటితో కూడిన మమకారం, కరుణ, జాలి. 2009 వరకూ వెనిజులాను దోచుకొన్న విలియమ్స్ కంపెనీ ఆస్తులను జప్తుచేసి, 2010లో ఒక్లాహోమాకు చెందిన హెల్మెరిష్ & పేమ్నేకు చెందిన 11 ఆయిల్ రిగ్గింగు కంపెనీలను కూడా సీజ్‌చేసి దోపిడీ నుండి వెనిజులాను విముక్తి చేసిన ఘనత సోషలిస్టు చావెజ్‌కు దక్కింది. విదేశాంగమంత్రి రెక్స్ టిల్లర్సన్ మిలిటరీ తిరుగుబాటు ఆలోచనకు తన మొదటిరోజు పర్యటన మెక్సికోలో బ్రేక్‌పడింది. ఇటువంటి ఆలోచనలకు మెక్సికో దూరంగా ఉంటుందని, మా మద్దతు ఉండదని స్పష్టపర్చింది.

సి.ఐ.ఎ. అరాచకాలు

ప్రపంచవ్యాప్తంగా పదులుకాదు వందలసంఖ్యలో అనేక దురాఘాతాలను, ప్రభుత్వాల మార్పిళ్లను, సైనిక తిరుగుబాట్లను చేసి ప్రోత్సహించిన హేయమైన రాజకీయ చరిత్రకలిగిన అమెరికాకు ట్రంప్, టిల్లర్సన్‌లు వారసులే. 1997లో సిఐఎ అరాచకాలనుద్దేశించి విలియమ్ బ్లూమ్ రాసిన "కిల్లింగ్‌హోప్" పుస్తకంలోని కొన్ని పుటలను గ్లోబల్ రీసర్చ్ న్యూస్ ఈ విధంగా తెలియజేసింది. "సి.ఐ.ఎ. స్క్రిప్టు ఎప్పుడూ ఒకేవిధంగా ఉంటుంది. మొదటిది.. అమెరికా కార్పోరేట్ల వ్యాపార లావాదేవీలను ప్రజాస్వామికంగా ఎన్నికైన దేశాధినేత ఎదిరిస్తాడు. కానీ ప్రజలు దేశాధినేతకు మద్దతు పలుకుతారు. కారణం: తను భూసంస్కరణలు అమలుచేస్తారు. ట్రేడ్ యూనియన్లను పటిష్టపరుస్తారు. సంపదను పునర్విభజన చేస్తారు. విదేశీ కంపెనీలను స్వదేశం కోసం జాతీయం చేస్తారు, వ్యాపార లావాదేవీలను కార్మికులకు అనుకూలంగా మలుస్తారు. ఈ సందర్భంలో అమెరికా కార్పోరేట్లకు అనుకూలంగా సిఐఎ గూడచారి సంస్థ దేశంలోని విపక్షాల్ని చేరదీస్తుంది. మొదటగా మితవాద శక్తుల్ని ఐక్యపరుస్తుంది. మిలిటరీతో సంబంధాలను ఏర్పరచుకొంటుంది. వాళ్లకొక ప్రతిపాదన చేస్తుంది.. "మేము మిమ్మల్ని అధికారం లోకి తీసుకొస్తాం, మీరు మాత్రం మా కార్పోరేట్స్ వ్యాపారాలకు అనుకూల నిర్ణయాలు తీసుకోవాలి." ఈ సంస్థ జనాల్ని సమీకరించి తిరుగుబాటుకు ఉసిగొల్పి ప్రత్యేక శిక్షణనిస్తుంది. ప్రజాస్వామికంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కూలదోస్తుంది. ఈనేపథ్యంలో అన్ని అవకాశాలను ఉపయోగించు కొంటుంది. ప్రోపగాండా, ఎన్నికల్లో అవకతవకలు, ఎన్నికల్లో ఓట్లను కొనటం, దోపిడీ, బెదరగొట్టటం, లైంగిక వేధింపులు, స్థానిక మీడియాలో కార్పొరేట్స్ వ్యతిరేకు లపై తప్పుడు వార్తలు రాయించటం, రాజకీయ పార్టీలను భయపెట్టటం, క్రియాశీల కార్యకర్తలను దాచేయటం, కొట్టటం, హింసించటం, మానసికంగా బెదిరించటం, ఆర్థిక విద్రోహ చర్యలకు పాల్పడటం, ఆత్మాహుతి దళాల ఏర్పాటు, చంపించటం. ఈ విద్రోహ చర్యలతో మిలిటరీ తిరుగుబాటుకు పునాదిని నిర్మిస్తారు, తద్వారా మితవాద నియంత అధికారం లోకి వస్తాడు. వెనువెంటనే సిఐఏ రంగంలోకిదిగి నియంత భద్రతాదళాలకు శిక్షణ ఇస్తుంది. కార్పొరేట్ వ్యతిరేక శక్తులను ఏరివేయటానికి పూనుకొంటుంది. అరెస్టులుచేసి విచారణలు కొనసాగిస్తుంది. నానావిధ చిత్రహింసలకు, జైళ్లకు గురిచేస్తుంది, వ్యతిరేకుల్ని హతమారుస్తుంది. ఈ ముద్దాయి లందరిని కమ్యూనిస్టులుగా ప్రచారం చేస్తుంది. వాస్తవానికి వీరంతా రైతులు, లిబరల్స్, మోడరేటర్లు, ట్రేడ్ యూనియన్ నాయకులు, రాజకీయ వ్యతిరేకులు, లాయర్లు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను మానవహక్కులను కోరుకొనే మానవతావాదులు. ఈ విధంగా మిలిటరీ తిరుగుబాట్ల ద్వారా మానవ హక్కులకు అమెరికా సిఐఎ భంగం కలిగిస్తుంది. ఈ పాఠాలన్నీ సిఐఎ స్కూల్‌లో బోధించబడతాయి. ప్రారంభంలో పనామా దేశంలో స్థాపించి తర్వాత ఈ స్కూలును జార్జియాలోని ఫోర్ట్ బెన్నింగ్‌కు మార్చారు.

(అమెరికా మిలిటరీ కుట్రలు రేపటి వ్యాసంలో)

వ్యాస రచయిత : ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యవర్గ సభ్యులు. సెల్ : 9849491969

భారత్‌లో జమిలి ఎన్నికలు అసాధ్యం

హరిహర్ స్వరూప్

లోక్‌సభకు , రాష్ట్ర అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు జరిగిన 1962, 1967లలో ఎన్నికల కవరేజి అవకాశం నాకు లభించడం గౌరవంగా భావిస్తాను. జమిలి ఎన్నికల కారణంగా ఎన్నికల కమిషన్‌తో పాటు ప్రధాన ఎన్నికల అధికారి పడే కష్టాన్ని, వారిపై ఒత్తిడిని ప్రత్యక్షంగా చూశాను. ప్రతి ఐదేళ్లకొకసారి ఇలా తీవ్ర ఒత్తిడికి లోనవుతూ ఎన్నికలను నిర్వహించడం ఎన్నికల కమిషన్‌కు భారీ విన్యాసంగా పరిణమించేది. నాటి పాలన ఇప్పటికన్నా మెరుగుగా ఉందనడంలో ఎట్టి సందేహం లేదు. ఆనాడు కేంద్రంతో పాటు చాలా రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడంతో పాలక యంత్రాంగానికి అది కలిసివచ్చింది. 1967లో తొలిసారిగా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను విడగొట్టారు. అదే ఏడాది ఉత్తరభారతంలో ముఖ్యంగా హిందీ బెల్ట్‌లో కాంగ్రెస్ పార్టీ పట్టును కోల్పోయింది.

1970లో కేంద్రంలో మధ్యంతర ఎన్నికలు జరిగాయి. ఆ సమయంలో కొత్త రాజకీయ పొత్తులతో రాజకీయ అనిశ్చితి నెలకొంది. సంయుక్త విధాయక దళ్ (ఎస్‌వీడీ) సంకీర్ణం అప్పుడే ఏర్పడింది. కాంగ్రెస్‌ను ఓడించేందుకు జనసంఘ్ పార్టీ, సోషలిస్ట్ పార్టీ, ప్రజా సోషలిస్ట్ పార్టీలు పొత్తును ఏర్పాటు చేసుకున్నాయి. ఎస్‌వీడీ ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌తో సహా ఇతర ఉత్తరాది రాష్ట్రాలను పాలించినప్పటికీ అంతర్గత విభేదాలు కారణంగా ఈ బహుళపార్టీల సంకీర్ణ ప్రభుత్వం ఎక్కువకాలం పనిచేయలేదు. మధ్యంతర ఎన్నికలు తప్పనిసరి అయ్యాయి. కేంద్రంలో అనిశ్చితి నెలకొంది. దాంతో ఏకకాలంలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు బ్రేక్ పడింది. తాజాగా జమిలి ఎన్నికల విధానం మరోసారి తెరపైకొచ్చింది. ఏకకాలంలో లోక్‌సభ, అసెంబ్లీల ఎన్నికలు నిర్వహించాలని ప్రధాని నరేంద్రమోడీ, రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చెబుతున్నారు. దేశంలోని ఏదో ఒక చోట ఎన్నికలు జరుగుతుండడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారన్నది వారి ఆవేదన. అది సరైనదే అయినప్పటికీ ఏకకాలంలో అటు లోక్‌సభకు ఇటు రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు నిర్వహించడం సాధ్యమయ్యే పనేనా? ప్రస్తుత తరుణంలో ఇది ఆచరణసాధ్యం కాదనే చెప్పాలి. కేంద్రంతో పాటు చాలా వరకు రాష్ట్రాల్లోనూ బీజేపీ అధికారంలో ఉన్నట్లయితే ఇది సాధ్యపడుతుంది తప్ప నేడున్న రాజకీయ పరిస్థితుల్లో కాదు. ఈ రెండు ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించే సాధ్యాసాధ్యాలను పలుమార్లు పరిశీలించారు. 1983లో లోక్‌సభతో పాటుగా అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించే విధానాన్ని తేవాలని అప్పటి ఎన్నికల కమిషన్ సిఫార్సు చేసింది. 1999, మేలో లా కమిషన్ చీఫ్‌గా వ్యవహరించిన జస్టిస్ జీవన్ రెడ్డి కూడా జమిలి ఎన్నికల విధానాన్ని సిఫార్సు చేస్తూ నివేదిక ఇచ్చారు. 'గతంలో వలే లోక్‌సభ ఎన్నికలతో పాటు అసెంబ్లీలకు ఎన్నికలు నిర్వహిస్తే సబబుగా ఉంటుంది' అని ఆయన పేర్కొన్నారు.

జమిలి ఎన్నికల నిర్వహణ సాధ్యాసాధ్యాలపై 2015, డిసెంబరు లోనూ సానుకూల నివేదిక వచ్చింది. సిబ్బంది, ప్రజా సాధక బాధకాలు, లా అండ్ జస్టిస్‌పై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తమ నివేదికలో ఏకకాలంలో ఎన్నికల నిర్వహణకు ఆచరణసాధ్యమైన విధానం అవసరమని సిఫార్సు చేసింది. అందులో రెండు దశల్లో ఎన్నికలు నిర్వహించాలని సూచించింది. ప్రస్తుత లోక్‌సభ పదవీకాలం దాదాపు సగానికిపైగా పూర్తి అయింది. 2016, నవంబరు నాటికి కొన్ని అసెంబ్లీల పదవీకాలం పూర్తికాగా మరికొన్నింటి పదవీకాలం 2019, జూన్‌లో ముగియనుంది. ఎంపిక చేసిన ఎన్నికల తేదీ నుంచి ఆరు మాసాలు లేదా ఏడాదిలోగా పదవీకాలాన్ని పూర్తిచేసుకోబోయే అసెంబ్లీలను కలిపి ఎన్నికలు నిర్వహించవచ్చునని కమిటీ సిఫార్సు చేసింది. జమిలి ఎన్నికల విధానానికి అనుగుణంగా ప్రస్తుతమున్న అసెంబ్లీల పదవీకాలాన్ని పొడిగించడమో లేక తగ్గించడమో చేయాలని ప్రతిపాదించింది. అయితే ఈ సిఫార్సులన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి. గతేడాదిలో పార్లమెంటు సంయుక్త సమావేశంలో నాటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ మాట్లాడుతూ దేశంలో తరచూ ఎన్నికలు జరుగుతుండడంపై ఆందోళన వ్యక్తంచేశారు. ఎక్కడో ఒకచోట ఎన్నికలు జరుగుతుండడం వల్ల అభివృద్ధి కార్యక్రమాలకు అడ్డుకట్ట పడుతోందని అన్నారు. అంతేకాకుండా ప్రజాజీవనం స్తంభిస్తోందని, ఎన్నికల విధుల నేపథ్యంలో అత్యవసర సేవలు ఆలస్యమవుతున్నాయని ప్రణబ్ అన్నారు. గతంలో 1951-52, 1957, 1962, 1967లలో జమిలి ఎన్నికలు జరిగాయి. అసెంబ్లీలు అకాలంగా రద్దు కావడంతో ఏకకాలంలో ఎన్నికలకు బ్రేక్ పడింది. 1970లో లోక్‌సభ కూడా పదవీకాలం పూర్తికాకుండానే రద్దు అయింది. అయితే, బీజేపీ మాత్రం ఆదినుంచి కూడా జమిలి ఎన్నికలపైనే మొగ్గు చూపుతోంది. అయితే ఈ విధానం ఆచరణసాధ్యం కాదన్నది కాంగ్రెస్ భావన. అది అప్రజాస్వామికం, రాజ్యాంగ విరుద్ధమని తృణమూల్ కాంగ్రెస్ అభిప్రాయపడింది. ఇది ఏ మాత్రం సాధ్యం కాదని సీపీఐ, ఎన్‌సీపీ పేర్కొన్నాయి. సీపీఎం సైతం ఈ విధానం అమలులో అనేక సమస్యలు వస్తాయని హెచ్చరించింది. ఏజీపీ, ఏఐడీఎంకే పార్టీలు మాత్రం జమిలి ఎన్నికలకు వత్తాసు పలికాయి.

జమిలి ఎన్నికల విధానాన్ని పునరుద్ధరించేందుకు రాజ్యాం గాన్ని సవరించాల్సి ఉంటుంది. అయితే, నేడున్న పరిస్థితుల్లో అది సాధ్యం కాని విషయం. కాంగ్రెస్ నేత పి.చిదంబరం మంచి ప్రశ్నను లేవనెత్తారు. జమిలి ఎన్నికలపై చర్చను జుమ్లాగా... జిమ్మిక్‌గా ఆయన అభివర్ణించారు. ప్రస్తుతమున్న రాజ్యాంగ నిబంధనల క్రింద ఇది ఏ మాత్రం సాధ్యం కాదని వాదించారు. 'రేపు ప్రభుత్వం పడిపోతే పరిస్థితి ఏమిటి? నాలుగేళ్ల పాటు రాష్ట్రపతి పాలన విధిస్తారా?.. అది సాధ్యం కాదు' అని చిదంబరం అన్నారు. మన ఫెడరల్ విధానాల కారణంగా కాలక్రమేణ ఎన్నికలు విభజించబడ్డాయి.

పార్లమెంటు, రాష్ట్ర అసెంబ్లీలు తమదైనా గతిశీలతను పాటించాయి. రాజకీయ పరిస్థితులను బట్టి చట్టసభలు రద్దు అయ్యాయి. ప్రధాని మోడీ వంటి బలమైన నాయకుడి హవా కచ్చితంగా జమిలి ఎన్నికల ఆలోచనకు బలం చేకూర్చుతోంది. అయితే హంగ్ అసెంబ్లీలు, పార్లమెంట్లు సర్వసాధారణం. మధ్యకాలంలో మెజారిటీ కోల్పోయే ప్రమాదం ప్రభుత్వానికి ఎప్పుడూ ఉంటుంది. అప్పుడు రాష్ట్రాల్లో మళ్లీ ఎన్నికలు నిర్వహిస్తారా? సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పాటు చేస్తారా? లేక రాష్ట్రపతి పాలన విధిస్తారా? అన్నవి ప్రధాన ప్రశ్నలు. ఇందులో మొదటిది జమిలి ఎన్నికల ఉద్దేశాన్ని నీరుగారుస్తుంది, రెండవది అస్థిరతకు దారితీస్తుంది.. ఇక చివరిది రాజ్యాంగం ప్రకారం సాధ్యంకానిది. అసలు పార్లమెంటే ముందస్తుగా రద్దు అయితే అప్పుడు పరిస్థితి ఏమిటి? కొత్త ప్రభుత్వాలు ఐదేళ్ల పాటు అధికారంలో ఉంటాయా లేదా అన్న విషయంపై స్పష్టత కీలకంగా మారుతుంది.ప్రస్తుతానికి ఈ సమస్యకు సరైన పరిష్కారం కనిపించడం లేదు. ప్రతి ఏడాది ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికలు నిర్వహిస్తూ , వాటి భారీ వ్యయాన్నిభరిస్తూ, 66 ఏళ్ల పాటు బాగానే పనిచేసిన వ్యవస్థకు టింకరింగ్ చేసే యత్నం ప్రమాదకరమైన పరిణామాలకు దారి తీసే అవకాశం ఉంది.

విశాలాంధ్ర
బతుకు
The Life
బుధవారం
07 ఫిబ్రవరి 2018



హిమ సొగసులు!

యూరప్ దేశం నార్వే రాజధాని ఓస్లోలో రహదారులు, ఇళ్ళు, వృక్షాలను సైతం ముంచెత్తిన మంచు.

జానపదాలతో జనంలోకి...!

పనితోపాటు పాట పుట్టిందని, పని తాలూకూ శ్రమను మరచిపోవడానికి శ్రామికులు పాటను ఆశ్రయించారని, అలవోకగా వారి నోటివెంట వెలువడినదే పాట అని, పూర్వం అలా గ్రామీణులు పాడుకున్నవే జానపద గీతాలని చెబుతారు. అంతటి ప్రాముఖ్యం గల జానపద గీతాలకు తనదైన హాస్యం, వ్యంగం, సందేశం జోడించి, గజ్జెకట్టి ఆడిపాడి ప్రేక్షకుల్ని ఉత్తేజపరచే అరుదైన గాయకుడు దామోదర గణపతిరావు. ఆయన జానపద కళాకారుడే కాదు రంగస్థల నటుడు కూడా. వృత్తిపరంగా ఉపాధ్యాయుడైన గణపతిరావు జానపద కళాకారుడిగా, రంగస్థల నటుడిగా, ఉత్తమ ఉపాధ్యాయుడిగా అమ్మ (తెలుగు) భాషకు బహుళ ప్రాచుర్యం కల్పిస్తున్నారాయన. పల్లెల్లోనూ తెలుగు భాషకు ఆదరణ తగ్గిపోవడం గమనించిన ఆయన "కృష్ణవేణి జానపద కళాబృందం" పేరుతో పలు రకాల ప్రదర్శనలు ఇస్తున్నారు. రైతు కుటుంబంలో జన్మించిన గణపతిరావు 18వ ఏటనే ముఖానికి రంగేసుకుని నాటకాల్లోకి వచ్చారు. జానపద కళాకారుడిగా ఎంత పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్నారో రంగస్థల నటుడిగానూ అంతే కీర్తిని ఆర్జించారు. ఎన్నో అవార్డులు, రివార్డులు, సన్మానాలు అందుకున్నారు.

దామోదర గణపతిరావు స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా గుమ్మలక్ష్మీపురం దగ్గర గల 'వనం' గ్రామం. సన్నకారు రైతు కుటుంబం. అమ్మ, నాన్నలిద్దరూ వ్యవసాయ పనులు చేసేవారు. సొంత ఊళ్ళోనే పదవ తరగతి వరకూ చదువుకున్నారు. బతుకుదెరువు కోసం 1981లో విజయవాడ వచ్చింది వారి కుటుంబం. దీంతో గుంటూరు జిల్లాలోని జిల్లెళ్ళమూడి అమ్మ ఆశ్రమంలో ఉండి ఇంటర్, డిగ్రీ పూర్తిచేశారు. తర్వాత దూరవిద్య ద్వారా ఆంధ్రా యూనివర్సిటీ నుండి ఎంఏ తెలుగు లిటరేచర్ పూర్తి చేశారు. వరంగల్‌లో బిఇడి చదివారు. చదువు పూర్తయ్యాక మొదటగా కృష్ణాజిల్లాలోని వెలగలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉద్యోగం వచ్చింది. తర్వాత కొన్నాళ్ళు కంచికచర్ల, నిడమానూరు, ఉన్నత పాఠశాలల్లోనూ పనిచేశారు.

బాల్యం నుండే....

గణపతిరావుకి జానపదాలపై బాల్యంనుండీ ఆసక్తి ఉండేది. అదెలా ఏర్పడిందంటే...చిన్నప్పుడు ఊరికి దగ్గర్లోనే ఉన్న అడవికి అమ్మతో పాటే కట్టెలు తీసుకురావడానికి వెళ్ళేవారు. ఆ నేపథ్యంలో అడవి జనం భాషకు, ఊరి భాషకు ఉన్న తేడాలు ఆయన్ను ఆకర్షించాయి. అడవిలో ఉండే సవరులు పాడుకునే పాటలను ఆ చిన్నవయస్సులోనే ఆసక్తిగా వినేవారు. ఆ రోజుల్లో విన్న 'అంబాతక్కాడే ! అంబలి జుర్రెయ్య! ఆజామన్నారే! తుంబలి కట్టెయ్యా' లాంటి పాటలు జానపద గీతాల మీద మోజును పెంచాయంటారాయన. రేడియోలు కూడా సరిగ్గా లేని ఆ రోజుల్లో చాలామంది పంచాయతీ ఆఫీసులోని రేడియో చుట్టూ చేరి వినేవాళ్ళు. అలాగే గణపతిరావు కూడా ఊరి పంచాయితీ ఆఫీసులోని రేడియోలో వచ్చే జానపద గీతాలను ఆసక్తిగా విని కొన్ని పాటలు నేర్చుకున్నారు. స్కూలు సెలవు దినాల్లో అమ్మతోపాటు వ్యవసాయ కూలీ పనులకు వెళ్ళినప్పుడు ఆ కూలిజనం పాటలు వింటూ మైమరచిపోవడమే కాకుండా కొన్నింటిని మెదడులో నిక్షిప్తం చేసుకున్నారు.

నట ప్రస్థానం

కాలేజీలో చదువుతున్నప్పుడే గణేష్ పాత్రో రచించిన 'ఆగండి కొంచెం ఆలోచించండి' అనే నాటిక ద్వారా రంగస్థలం మీద అడుగుపెట్టారు. కొండముది సాయిశ్రీహర్ష రచించిన 'కట్నాల కాలనాగు' అనే నృత్య నాటికలో నటించారు. హాస్యబ్రహ్మ జంధ్యాల గారి 'గుండెలు మార్చబడును' నాటికలో హాస్యపాత్రను చేశారు. ప్రజాకవి వంగపండు గారి 'భూమిభాగోతం' నృత్యనాటికలో స్త్రీ పాత్ర పోషించారు. 2007, 2008, 2009లో జరిగిన నంది నాటక పోటీల్లో బంగారు, రజత, కాంస్య నందులు గెలుచుకున్న "1857 ప్రథమ స్వాతంత్ర్య మహా సంగ్రామం", శ్రీఖడ్గ తిక్కన, ఉషాపరిణయం నాటకాల్లోనూ ప్రముఖ పాత్రలు వేశారాయన. జీ తెలుగులో ప్రసారమైన 'షిరిడీ జై సాయిరాం', దూరదర్శన్‌లో ప్రసారమైన 'వజ్రభారతి', శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానెల్‌లో ప్రసారమైన పురాణగాథలు లాంటి సీరియల్స్‌లో నటించారు. ఆకాశవాణి 'బి' గ్రేడ్ కళాకారుడిగా ఇప్పటికీ కొనసాగుతున్నారు.



జానపద కళాకారుడిగా



బాల్యంలో జానపద గీతాలపై ఏర్పరచుకున్న అభిమానం గాన ప్రస్థానం వైపు అడుగులు వేయించాయి. ప్రజా వాగ్గేయకారులు వంగపండు ప్రసాదరావు, గద్దర్, ప్రముఖ కవి గోరేటి వెంకన్న, సహజకవి గంటేద గౌరునాయుడు, రాయలసీమ కవి రత్నంగా పేరొందిన కలిమిశెట్టి మునెయ్య గార్ల ఏకలవ్య శిష్యరికంలో సంపూర్ణ జానపద గాయకుడిగా తయారయ్యారు.

మాతృభాష సేవ కోసం...

నానాటికీ తీసికట్టుగా తయారవుతున్న తెలుగు భాషకు తనకు వచ్చిన జాపపద కళ ద్వారా సేవ చేయాలనుకున్న గణపతిరావు 2009లో కృష్ణవేణి జానపద కళాబృందాన్ని ఏర్పాటు చేశారు. జానపద ప్రధాన ప్రక్రియలైన ఆటపాటల్లో 12 మందికి శిక్షణనిచ్చి 'రేలారేలారే' ప్రోగ్రామ్ ద్వారా అనేక ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇస్తున్నారు. మన రాష్ట్రంలోని ప్రధాన పట్టణాల్లోనే కాకుండా బెంగళూరు, చెన్నై, ఒడిషా, కలకత్తా, లక్నో, పుదుచ్చేరి, బిలాయ్, ఛత్తీస్‌ఘర్, ఢిల్లీలాంటి ప్రాంతాల్లో ప్రదర్శనలిచ్చి భాష తెలియని ప్రజానీకానికి కూడా ఆనందానుభూతులు అందించారు. మలేషియా, కువైట్‌ల్లో కూడా ప్రదర్శనలిచ్చి అక్కడి ప్రజల అభిమానాన్నీ చూరగొన్నారు.

త్వరలో శిక్షణా కేంద్రం

కళ అనంతమైనది. జానపదం నిత్యనూతనంగా, నిరంతరంగా కొనసాగాలి....ఇందుకోసం త్వరలోనే ఓ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నానని చెప్పారు గణపతిరావు. "ఒక ప్రదర్శనలో ప్రపంచ తెలుగు సమాఖ్య అధ్యక్షురాలు మా ఆటపాట చూసి మలేషియాలో జరిగే ఓ కార్యక్రమంలో ప్రదర్శన అవకాశం కల్పించటం, ఓ దూర ప్రాంతానికి ట్రైన్‌లో వెళుతున్నప్పుడు మా గురించి తెలుసుకున్న బొంబాయికి చెందిన చిన్న సినీ నిర్మాత, ఓ పాటను రికార్డింగ్ చేయించుకోవడం" మరపురాని విషయాలుగా చెబుతారు గణపతిరావు.

- పి.ఎం.సుందరరావు

అవార్డులు - రివార్డులు

2010లో జె.కె.రాయగడ్ సంఘం నుంచి జానపద గాయకరత్న బిరుదు. 2012లో పాలకొల్లు కళాలయ సంస్థ వారినుంచి 'కవి గాయక నట చక్రవర్తి, శ్రీశ్రీ శతజయంతి సందర్భంగా విజయవాడ 'ఎక్సరే' సంస్థ వారి పురస్కారం. 2014లో ఎన్టీఆర్ కళాపరిషత్ నుంచి 'భారతీయ కళార్చన' పురస్కారం, కాకినాడ డాక్టర్ రామన్ ఫౌండేషన్ వారి ప్రజ్ఞ పురస్కారం. 2015లో అద్దంకి తెలుగు జానపద కళాకేంద్రం నుంచి జ్యోతి చంద్రమౌళి పురస్కారం. 2016లో విజయవాడ మహానటి సావిత్రి కళాపీఠం నుంచి జానపద కిరీటి బిరుదుతో పాటు 2017లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఉగాది పురస్కారాన్నీ అందుకున్నారు దామోదర గణపతిరావు. ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా 2016లో ఇండోనేషియా యూనివర్శిటీ నుంచి గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు.





సాంబ్రాణి వేస్తున్నారా!



సాంబ్రాణి పూర్వం విరివిగా ఉపయోగించేవారు. ఒకప్పుడు చిన్నపిల్లలు ఉన్న ప్రతి ఇంట్లోనూ రోజూ సాంబ్రాణి ధూపం వేసేవారు. కారణం సాంబ్రాణిలో అనేక అద్భుతమైన వైద్య గుణాలు ఉన్నాయి. ఇంట్లో సాంబ్రాణి పొగ వేస్తే దోమలు పోతాయి. స్నానం తరువాత ముఖ్యంగా తలస్నానం చేసినప్పుడు చిన్నారులకు సాంబ్రాణి పొగ వేసేవారు. ఇప్పుడంటే ఎక్కడా కనిపించడం లేదుగానీ పూర్వం చిన్నారులే కాదు ఇల్లాళ్ళూ తలస్నానం చేసిన తర్వాత సాంబ్రాణి ధూపం వేసుకునేవారు. ఈ పొగ చిన్నారుల శరీరానికి, స్త్రీల కురులకు సువాసన అద్దేది. దీనివల్ల పేలు పోతాయని అనేవారు. తలకు సాంబ్రాణి వేసి పొగ చూపిస్తుంటే వెంట్రుకలు నల్లగా నిగనిగలాడుతూ పొడవుగా పెరుగుతాయి. సాంబ్రాణికి ధూపం అని, గుగ్గిలమని రకరకాల పేర్లు ఉన్నాయి. సాంబ్రాణి పొగ శరీరానికి సువాసనే కాదు కొత్త ఉత్సాహాన్ని అందిస్తుంది. చెమట దుర్వాసనను దూరం చేస్తుంది. దీర్ఘకాలిక దగ్గును తగ్గిస్తుంది. కఫాన్ని పోగొడుతుంది. తలనొప్పి, జలుబు లాంటి వాటిని నివారిస్తుంది. శరీరంపై ఏర్పడే కురుపులను నయం చేస్తుంది. రక్తాన్ని శుద్ధి చేస్తుంది. కంటి జబ్బులను నయం చేస్తుంది. స్త్రీలకు గర్భసంచిలో బాధను. శరీర నొప్పులను కూడా తగ్గిస్తుందని చెబుతారు. సాంబ్రాణి చెట్టు ఆకుల రసాన్ని కంటికి పూస్తే కొన్ని కంటి జబ్బులు తగ్గిపోతాయి. నీటిలో సాంబ్రాణి ఆకులను వేసి నానబెట్టి స్నానం చేస్తే జలుబు, చలి, దగ్గు తగ్గిపోతాయి. సాంబ్రాణి ఆకుల రసాన్ని మాడుపై పూస్తే తలనొప్పి, తలభారం నివారణ కలుగుతుంది. ఇన్ని గుణాలు ఉన్న సాంబ్రాణి వాడకం తగ్గిపోవడం మనకే నష్టం. ఈ విషయంపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం బయట మార్కెట్‌లో దొరికే సాంబ్రాణిలోనూ రసాయనాలు కలుస్తున్నాయి. ఇలాంటి వాటిని ఉపయోగించకపోవడమే మంచిది. వాటికి బదులుగా ప్రకృతి సిద్ధంగా తయారు చేసిన సాంబ్రాణిని మాత్రమే వాడాలి. ప్రకృతి సిద్ధంగా తయారు చేసిన సాంబ్రాణి గట్టిగా ఉంటుంది.

చెట్టు పాల నుంచి తయారీ

సాంబ్రాణి చెట్లు ఎక్కువగా సుమిత్ర, జావ దీవులలో కనిపిస్తుంటాయి. మన భారతదేశంలో గుజరాత్, అస్సాం, రాజస్థాన్, బీహార్, ఒరిస్సా రాష్ట్రాలలో ఎక్కువగా చెట్లను పెంచి సాంబ్రాణిని ఉత్పత్తి చేస్తున్నారు. తమిళనాడులో కూడా సాంబ్రాణి పంట విరివిగా కనిపిస్తుంది. ఈ సాంబ్రాణి చెట్లు 18 మీటర్ల ఎత్తు వరకు పెరుగుతాయి. ఈ చెట్లు చాలా గట్టిగా ఉంటాయి. ఈ చెట్ల పూలు చాలా అందంగా ఉంటాయి. నవంబర్ నుండి జూలై వరకు ఈ చెట్లకు పాలు ఎక్కువగా వస్తాయి. అంటే చెట్టు బెరడును చెక్కితే తెల్లని పాలు వస్తాయి. దాని నుండే సాంబ్రాణి తయారు చేస్తారు.

- కొంపల్లి, ఒంగోలు

వెక్కిళ్ళు ఆగడం లేదా!

మనకి వెక్కిళ్ళు వస్తుంటాయి వాటంతట అవే తగ్గిపోతుంటాయి. ఒక్కోసారి మాత్రం ఎంతకీ తగ్గకుండా విసిగిస్తాయి, భయపెడతాయి. వెక్కిళ్ళు ఆగక ఆసుపత్రులకు వెళ్ళినవాళ్ళూ ఉన్నారు. సాధారణంగా వెక్కిళ్ళు ఏదైనా తినే సందర్భంలోనే ముఖ్యంగా భోజనం చేసే సమయంలోనే వస్తుంటాయి. మిగిలిన సందర్భాల్లో వెక్కిళ్ళు రావడం చాలా అరుదు. దీనికి కారణం మింగిన ముద్ద సజావుగా పొట్టలోకి జారిపోకుండా అవరోధం ఏర్పడడమే. వెక్కిళ్ళు రావడం ప్రారంభమైతే ముందుగా ఈ విషయాన్ని గుర్తించాలి. వెక్కిళ్ళు మొదలవగానే ఏమీ తినకుండా రెండు నిముషాలు అలాగే ఉండండి. వెక్కిళ్ళు అవే తగ్గిపోతాయి. ఇలాకాకుండా చాలామంది మంచినీళ్ళు తాగేయడం, ఒట్టి అన్నం ముద్ద తినడం లాంటివి చేస్తుంటారు అయినా తగ్గడం లేదంటూ నానాహైరానా పడిపోతుంటారు. గొంతుకి, పొట్టకి విరామం లేకుండా శ్రమ పెడుతూనే ఉంటే, కంగారుపడుతూనే ఉంటే ఇంక వెక్కిళ్ళు ఎలా తగ్గుతాయి. ఏం చేసినా వెక్కిళ్ళు తగ్గకపోతే ఉసిరి ఆకుల్ని నమిలి మింగండి. లేదంటే గోరువెచ్చని నీళ్ళల్లో కొంచెం ఇంగువ వేసుకుని తాగితే వెక్కిళ్ళు సర్దుకుంటాయి. వేపాకు పొడి, ఉసిరిపొడి సమాన మోతాదులో తీసుకుని రెండూ కలిపిన ఆ ముద్దను మింగండి. శొంఠిపొడిలో తేనె కలిపి తీసుకున్నా వెక్కిళ్ళు తగ్గిపోతాయి. కప్పు నీళ్ళల్లో చెంచా మెంతులు వేసి మరగకాచి ఆ నీటిని తాగితే అదే పనిగా వచ్చే వెక్కిళ్ళు వెంటనే నిలిచిపోతాయి. కాగితంతో చేసిన సంచిని ముక్కుకు అడ్డు పెట్టుకుని రెండు నిముషాలు గాలి పీల్చడం వదలడం చేసినా వెక్కిళ్ళు ఆగిపోతాయి.



మోకాళ్ళ నలుపు పోయేందుకు...!.

కాలేజీ అమ్మాయిలకు రకరకాల డ్రస్‌లు వేసుకోవడం సరదా! ఇందులో మిడ్డీలు, షార్ట్ డ్రస్‌లూ కూడా ఉంటాయి. ఇలాంటి డ్రస్‌లు వేసేందుకు మోకాళ్ళ మీదా శ్రద్ధ పెడుతుంటారు. సాధారణంగా మోకాళ్ళు నల్లగానే ఉంటాయి. ఇలాంటప్పుడు మిడ్డీలాంటి డ్రస్‌లు వేసుకోవడానికి ఇబ్బంది పడుతుంటారు. మోకాళ్ళ నలుపుని పోగొట్టుకునేందుకూ కొన్ని చిట్కాలున్నాయి. ఎక్కడైనా శరీరం నల్లగా మారిందంటే దానికి ప్రధాన కారణం దుమ్ముధూళి పేరుకుపోవడమే. దీనివల్ల అక్కడ చర్మం గరుకుగానూ మారుతుంది. ఈ నలుపుని పోగొట్టుకునేందుకు, ఇక్కడ చర్మాన్ని మళ్ళీ సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకూ ఇలా చేసి చూడండి.

1. **బియ్యంపిండి :** టీ స్పూన్ బియ్యప్పిండి తీసుకుని అందులో కొద్దిగా రోజ్‌వాటర్ పోసి కలపండి. దీనిని మోకాళ్ళకు రాసి కొన్ని నిముషాలు ఉంచండి. తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయండి. వారంలో నాలుగైదు సార్లు ఇలా చేస్తే మీకు కావలసిన ఫలితం వస్తుంది.

2. **బేకింగ్ సోడా :** ఇందులో కొద్దిగా నీళ్ళు పోసి ఈ పేస్ట్‌ని మోకాళ్ళకు రాయండి. ఐదు నిముషాలు ఉంచి గోరువెచ్చని నీళ్ళతో కడిగేయండి. వారానికి ఒకసారి ఇలా చేస్తే మంచి మార్పు కనిపిస్తుంది.

3. **ఓట్‌మీల్ :** కొద్దిగా ఉడికించిన రెండు టీ స్పూన్‌ల ఓట్స్ తీసుకోండి. ఇందులో రోజ్‌వాటర్ కలిపి మోకాలు అంతా రాయండి. కొద్దిసేపాగి గోరువెచ్చని నీళ్ళతో కడిగేయండి. వారంలో నాలుగైదు సార్లు ఇలా చేస్తే క్రమంగా మోకాలు నలుపు పోతుంది.

4. **విటమిన్ ఈ ఆయిల్ :** విటమిన్ ఈ కాప్స్యూల్స్‌లో ఉండే ఆయిల్‌ని తీసుకుని మోకాళ్ళకు రాసి మసాజ్ చేయండి. రాత్రంతా ఇలాగే ఉంచండి. ఉదయాన్నే గోరువెచ్చని నీళ్ళతో శుభ్రం చేయండి. ఈ చిట్కా రోజూ పాటించవచ్చు.



5. **బంగాళాదుంప :** బంగాళాదుంప ముక్క తీసుకుని మోకాళ్ళ మీద రుద్దండి. కొన్ని నిముషాలు అలాగే ఉంచి గోరువెచ్చని నీళ్ళతో కడిగేయండి. రోజూ ఇలా చేస్తూ ఉంటే మంచి ఫలితం ఉంటుంది.

6. **పాలమీగడ :** తాజా పాల మీగడ తీసుకుని మోకాళ్ళకు రాసి కనీసం పావుగంట అలాగే ఉంచండి. ఆరిపోయిన తర్వాత గోరువెచ్చని నీళ్ళతో శుభ్రం చేసుకోండి. ఈ చిట్కానూ రోజూ పాటించవచ్చు.

7. **కమలా తొక్కల పొడి :** కొద్దిగా రోజ్‌వాటర్ తీసుకుని ఇందులో తగినంత కమలా తొక్కల పొడి కలిపి మోకాళ్ళకు రాయండి. 15, 20 నిముషాలు తర్వాత గోరువెచ్చని నీళ్ళతో కడిగేయండి. వారంలో మూడు, నాలుగు సార్లు ఇలా చేస్తే కావలసిన మార్పు కనిపిస్తుంది.

8. **బాదం :** రోజ్‌వాటర్‌లో బాదం పొడి కలిపి మోకాళ్ళకు రాసి 15, 20 నిముషాలు ఉంచండి. తర్వాత గోరువెచ్చని నీళ్ళతో శుభ్రం చేయండి. ఈ చిట్కానూ రోజూ ఉపయోగించుకోవచ్చు.



అతడు-ఆమె

66

జరిగిన కథ

సూర్యుడుదయించాడు - గంగోత్రి పాదరసపు ధారలా మెరుస్తూంది. నల్లని కొండలు, తెల్లటి శిఖరాల చుట్టూ పట్టుగొడుగుల్లాగు తెల్లని మబ్బులు అంటివున్నాయి.... గంగ సన్నగిల్లింది. కరగబోసిన వెండి సెలయేరు - అదిగో గంగావతరణం! దూరాన కైలాసగిరి కానవస్తూంది. ఇరుప్రక్కల నందాదేవి, కంచనగంగలు. కైలాసగిరి చుట్టూ ఛత్రచమరాల్లాగు తేజరిల్లుతునన మబ్బులు - రూపం మారి కాలసర్పం పడగ పట్టినట్టుంది! అదిగో! రామలక్ష్మణ ఝూలా - వైతరణీమీద వారధిలాగు: ఆ గడ్డి పట్టుకుని దాటితిమా - మానస సరోవరమే! బదరీ నారాయణం, బ్రహ్మకపాలం, అమరనాథం నడచిపోతున్నారు యాత్రికులు, ఈ చలిలో - ఈ మంచులో! శేషునాగం - సతీసరోవరం - మృత్యుంజయం - మహామేరువు!...

(నిన్నటి సంచిక తరువాయి)

"ఆత్మానాం సర్వభూతానాం బ్రహ్మాధిపతి బ్రహ్మణోధిపతి బ్రహ్మ- శివోమే అస్తు సదాశివోమ్... "

ప్రకృతిపూజ - ఊహాగానం - వేదపఠనం - మంత్రోచ్ఛారణ - ఉపనిషద్వాక్యం - అద్వైతం - పరమాణువృత్తి - పరమాత్మశక్తి - పరబ్రహ్మశక్తి...

ఝూవల్‌పూర్ శివారు వరకూ నడిచివచ్చాను. కోసెడు దూరం. తోవ యేమీ బాగులేదు. గతుకులు, గండ్లు, గుంటలు, బండరాళ్ళు. మాఘ శివరాత్రికి లక్షలాది జనం ఈ తోవని రావాలి కదా? ఎంత కష్టం! వీరి ఇబ్బందులు గవర్నమెంటు వారికేల? ఇన్ని కష్టాలకోర్చే మనవాళ్ళు హిమాలయాన్నే కరిగించగలితే - భక్తి క్షమ కలిగినవారు - దరిద్రాన్ని దైన్యాన్ని దాస్యాన్ని ఎందుకు వదిలించుకోలేకుండా వున్నారు చెప్మా?...

చేతి గడియారం చూచుకుందును - ఎనిమిదైంది. పాపాయి, సుభ జ్ఞప్తికి వచ్చారు. తొందరగా నడిచాను. "శివదీక్షా పరురాలను" అనుకుంటూ, నటకురంజిలో పాడుకుంటూ ధర్మశాల చేరుకున్నాను....

నేను మూఢభక్తి భ్రమలోనూ అర్థం లేని అద్వైతం లోనూ, పరమార్థంలేని కృత్రిమ పూజల్లోనూ పడి పోతున్నానేమిటి? ఛీ! ఛీ!

ఆ చలిలోనే ముగ్గురం గంగలో స్నానం చేశాం. ఈవేళ మార్గశిర బహుళ త్రయోదశి. శివరాత్రి. సక్కుబాయమ్మగారూ గోజాబాయమ్మగారూఉపవాసం రేపు వారికీ వేదనిధి దినం. రెండురోజులూ వరుసని యెలా వుపోష్యం చేస్తారో! పొంటిపూట ఉపవాసం చెయ్యడం కష్టం అనిపించేది - రోజుల్లా తలనొప్పే!

మేము ముగ్గురం మహారాజుజీ దుఖాణం అరుగుమీద కూర్చుని వేడివేడి పూరీలు ఆలూదామ్ పాలక్ తిన్నాం. పాపాయి, సుభ రుచిగా తిన్నారు. రాబిడిపాలు త్రాగేం.. ధర్మశాల అరుగుమీద ఎవరో మర్చిపోయారు కాటోలు ఇంగ్లీషు దినపత్రిక పడి వుంటే తరువాత చదువుకుందాం - అని తీశాను. బళ్ళారి కంబళీ పరచి తలగడాలు వేసుకుని ముగ్గురం నడుంవాల్చాం. పాపాయిని జోకొడుతున్నా. గోజాబాయిగారు శివానందలహరిలో శ్లోకాలు చక్కగా చదువుతున్నారు. సక్కూబాయిగారు శ్యామ శాస్త్రుల వారి కీర్తన - "సరోజదళ నేత్రి హిమగిరి పుత్రి" అని శంకరాభరణంలో పాడుతున్నారు. భక్తి శ్రావ్యం - రెండూ వున్నాయి పాటలో... "పరాకు సేయక వరదాయకి - నీవలె దైవము లోకములో గలదా - సురాణి - ముఖవాణి - మధురవేణి సదా శివునికి రాణి" అంటూ ఆదితాళం లయవేస్తూ నిద్రపోయాను.

సాయంత్రం మహారాజుజీ దుఖాణం వద్ద పాలు తాగి గంగవద్దుకు వెళ్ళాం. యాత్రికులందరూ గంగలో స్నానాలు చేస్తున్నారు. సూర్యమండలం క్రుంగిపోతూంది. ఆ నీరెండలో హిమాలయం నెమిలికంఠం రంగు ధరించుంది. తేట నీలిరంగు గంగనీళ్ళు. నీటి అడుగున కోటానుకోట్ల సాలిగ్రామాలు - వాటిపై ప్రవహిస్తూంది గంగ జలజలమంటూ.

నిన్న రాత్రి రైలులో కల జ్ఞాపకం వచ్చింది. నేనింటినుంచి బయలుదేరిన తరువాత - ఇదే మొదటిసారి శాస్త్రి కలలోకి



రావడం.. గ్రీసులో డెల్ఫీ దేవతావాణికోసం ప్రార్థన. రోములో జ్యోతిశ్శాస్త్రజ్ఞులవల్ల భూత భవిష్యత్తులు. మన పల్లెటూరిలో ఎరుకలదానిదగ్గర సోదె. పట్నాలలో ప్రొఫెసర్ల చేత - అమెరికాలో స్వామీజీల చేత సాముద్రికం. యూరపులో ఫ్రాయిడియన్ తర్కం వల్ల 'లిబిడో' రహస్యాలు : ప్రపంచం మారడం లేదు - పోకడలే మారుతున్నాయి.. కలకి తల లేదు తోకలేదు. అయినా - నేకన్న కలకూడా నా వ్యక్తిత్వంలో ఒక భాగమే కదా; కల తల్చుకున్నాను. అవును - నాలో వున్న హేతువాద రహితమైన అయోమయపు ఆలోచనల వంకరటింకర ప్రతిబింబాలే అవి - అంతకంటే వాటికి మరే అర్థమూ లేదు...



డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

అవును. ఇప్పుడు మనసుకి సంతృప్తి కలిగింది. ఒకవిధమైన భరోసా నిబ్బరం కలిగాయి.

ఇంట్లో శాస్త్రి కచేరీ గదిలో లండను సిగరెట్ల కంపెనీవారు అభివందనములతో అచ్చువేసి పంచిపెట్టిన పార్వతీపరమేశ్వరుల రంగులపటం జ్ఞప్తికి వచ్చింది. కైలాసగిరి వంక చూశాను. తంజావూరి నటరాజ విగ్రహం కళ్ళముందు కొచ్చింది. రవీంద్రుడి "కైలాసశివుడు" చిత్రం - నికోలాయి రోరిచ్ హిమాలయ పర్వతపంక్తులు - ఎదుట నిలిచాయి.. నా ఊహకు - త్రిమూర్తులలో - బ్రహ్మ అంటే గోక్లే - విష్ణు అంటే గాంధీగారు - మహేశ్వరుడు అంటే తిలక్కు...

ఉపమానం సరిపోతూంది - కాని.. ముప్ఫై మూడు కోట్లమంది ఏంగాను? త్రిమూర్తుల దయాధర్మభిక్ష మీదే వీళ్ళు బతకాలా ?... ముప్ఫై మూడుకోట్ల దేవతలే ఈ త్రిమూర్తులను నడిపించాలి.. వీళ్లశక్తే త్రిమూర్తుల శక్తి... త్రిమూర్తులు కేవలం నిమిత్తమాత్రులు.. ముప్ఫై మూడుకోట్ల ప్రజారాశి.. వీళ్లచేతుల్లోనే వుంది... మోక్షం.. అమృతం.. అనురత్వం...

ధర్మశాలలో రాత్రి గుడ్డిదీపం వెల్తురుని పత్రిక చదివేను : "ఫెయిజపూరు కాంగ్రెసు- 451 అనుకూలురు -62 ప్రతికూలుర ఓట్లతో వర్కింగు కమిటీ తీర్మానం అంగీకరింపబడుట, రాష్ట్రములో పదవీస్వీకారం గూర్చి అంతిమ నిర్ణయము -ఏ.ఐ.సి.సి.కి వదిలివేయబడుట.. జర్మనీలో హిట్లరు యూదులను చిత్రవధ చేసి చంపుట... ఆస్ట్రియాను కబళించుటకు హిట్లరు రహస్యతంత్రములా?... స్పెయినులో ప్రజా సేనల పరాజయము... చీనా జపాను యుద్ధ సూచనలు..."

84 అతడు

అన్నయ్య నిన్న వెళ్ళిపోయాడు. "రేపు వెళ్ళ కూడదా?" అన్నాను. "బుధే గురౌ పశ్చిమ కార్యసిద్ధిః - అని పెద్దలన్నారు. అంచేత గురువారం తప్పితే వారసూల" అన్నాడు. "ఈవేళ నిర్ధం పెట్టి రేపు వెళ్ళు" అన్నాను. "తోలుపెట్టెలో బట్టలు మీ దొరసాని వదినె సర్దింది. బట్లరు ముందావాడు పరుపు కట్టేడు. అంచత పొత్తిగుడ్డ పట్టుకురావడం పడింది కాదురా!" అన్నాడు. "పోనీ పట్టుసూటు పొరుగువారింట్లో పెడదాం" అన్నా. "వద్దురా నాయనా. ఆ డిన్నరుసూటు వాళ్ళు కాజేస్తే రేపు మోసానిక్ విందుకి దేవతావస్త్రాలతో వెళ్ళాలి!" అన్నాడు.

అన్నయ్య ఇక్కడికొచ్చిన మరునాడే సెసీలీ వదినె దగ్గర నుంచి టెలిగ్రాము : అన్నయ్యకి క్వెట్టాలో జాయింటు సర్జను జనరలు పని అయిందని. ఇక్కడే కనుక వుండిపోయివుంటే యే మూడో సర్జనుగానో, లేకపోతే జిల్లా సర్జనుగానో, యే మారుమూలనో బూజుపట్టి వుండిపోయేవాడు. ఇతర రాష్ట్రాలకి వలస వెళ్ళిపోయాడు కాబట్టి ఆంధ్రుడు రాణించాడు.

అన్నయ్య గౌరవార్థం బ్రిస్టలుగ్రిల్లులో విందు చేశాను. సుబ్రహ్మణ్యం లేడీ అయ్యంగారు- డాక్టరు వెల్లాకూ అతని భార్య - డాక్టరు కనక సుందర వడివేలు అతని పెళ్లాం - నేషనల్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాలు గిరీషు చంద్ర మజుందారు - ఊర్వశీ మిత్ర - హైదరాబాదు ప్రిన్సిపల్ జడ్జి పుందరీ కాక్షుడుగారు - బర్మా హైకోర్టు అటార్నీ జనరల్ వరదన్ అతని పెళ్ళాం - వీళ్ళని పిలిచాను. విందు చాలా సరదాగా జరిగింది. శాంతం లేకపోయిందని అందరూ అనడమే. మరేమీ అనలేక "ఫెయిజువూరు కాంగ్రెసుకి వెళ్ళిందండీ!" అన్నాను.

అన్నయ్య అందరినీ పొట్ట పగిలిపోయేటట్లు వూపేసి నవ్వించి వదిలిపెట్టేశాడు.

ఊర్వశి అంది నవ్వుతూ : "ప్రఖ్యాతులైన మీలాంటి సర్జనుల చేతుల్లో పడితే ముక్క ముక్కల కింద కోసేసి క్రైమా చేసేస్తారేమో అని భయం వేస్తుందండీ!"

అన్నయ్య అన్నాడు : "అక్షరాలా నిజం! నిరుడు మోల్మేను నవాబుగారి పెళ్ళానికి సిజేరియను చేస్తే ఏమైందనుకున్నారు? శస్త్ర అంతా చేసేశాను. కుట్లు కూడా కుట్టేశాను. తీరా ఆర్టరీ ఫోరెప్సు లెక్కపెట్టేసరికి ఒకటి తక్కువ! బీగమ్‌గారి శరీరంలో వుండిపోయింది కదా - ఎక్కడికి పోతుందనుకున్నాను. మొన్న మళ్ళీ ఆవిడ శస్త్రానికి వస్తే - బిడ్డనీ ఫోరెప్సునీ కూడా బైటకు తీసేశాను - గుప్‌చుప్‌గా!" అదరం పొట్టుబ్బిపోయేటట్టు నవ్వేం. "థియేటరు మేట్రన్ని బర్తరపు చేసేలేకపోయారా!" అన్నాడు వెల్లాకు. "అమ్మో! సర్జను. ఖ్యాతి అంతా మేట్రను అరచేతిలో వుంటుంది. వాళ్ళది కాలసర్పం పగ! ఆవిడె నోరు కట్టేయడమే మంచిదని- వెంటనే ఆవిడని స్టోరు అధికారిగా ప్రమోషను చేసేశాను!" అన్నాడు. అందరం నవ్వేం. డాక్టర్లు మాత్రం వొకరి ముఖం వొకరు చూచుకున్నారు.

ఊర్వశి అందీ: "అయితేనేం! మీ ఖాయిదాకింద - కత్తులూ కఠార్లూ అంత పరిశుభ్రంగా స్టెరిలైజు చేసేస్తున్నా రననమాట !"

అన్నయ్య అన్నాడు : "అభ్యంతరమేమి? నేను సంవత్సరానికి అధమం నూరు హెర్నియాలేనా శస్త్రం చేస్తాను - నోటి నుంచి సిగరెట్టు తియ్యకుండానే. వొక్కటికూడా ఇంతవరకు చీము పట్టలేదు."

"పట్టితే?" అంది ఊర్వశి. "పట్టితే ఏముంది? వాడి ఖర్మం. గుండె ఆగిపోయి వూపిరి ఆడక చచ్చిపోయాడని కాగితం వ్రాసి యిస్తాం. అంతేకదండీ వడివేలుగారూ?" అన్నాడు అన్నయ్య - అందరూ ఫక్కున నవ్వు !

ఊర్వశి అంది : "డాక్టరుగారూ! మీరీమధ్య యేదో గొప్ప కపాళశస్త్రం చేశారని పత్రికల్లో చదివేమండి. యేమి అద్భుతం!"

- ఇంకా వుంది.

అందుబాటులో ఆన్‌లైన్ కోర్సులు

సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడంతో విద్యారంగంలో కూడా పెనుమార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఇంటర్నెట్ ద్వారా మీరు కోరుకున్న సబ్జెక్ట్‌లో నాలెడ్జ్ పెంచుకోవచ్చు. కాలేజీలో చేరకుండానే ఇంటినుంచే డిగ్రీ పొందవచ్చు. మనదేశంలో ఐఐటీలు, ఐఐఎంలు, సెంట్రల్ వర్సిటీలు, అమెరికాలోని స్టాన్‌ఫర్డ్, ఎంఐటీ, యూకేలోని యూనివర్సిటీ ఆఫ్ లండన్, బర్మింగ్‌హామ్, గూగుల్, మైక్రోసాఫ్ట్, ఐబీఎం లాంటి అగ్రశ్రేణి కంపెనీలు ఆన్‌లైన్ పద్ధతిలో ఎన్నో కోర్సులను అందిస్తున్నాయి.





చాలా ఆన్‌లైన్ సంస్థలు ఉచితంగా కోర్సు కంటెంట్‌ను అందిస్తున్నాయి. రిజిస్ట్రేషన్ చేసుకొని పాఠాలు వినవచ్చు. బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్, మెక్ ఆర్థర్ ఫౌండేషన్, నేషనల్ సైన్స్ ఫౌండేషన్, అమెరికన్ కౌన్సిల్ ఆన్ ఎడ్యుకేషన్, స్టాన్‌ఫర్డ్, హార్వర్డ్ యూనివర్సిటీలు, ఎంఐటీ, యూని వర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా, కాల్‌టెక్, యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ (ఆస్టిన్), యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా (బెర్క్‌లీ), శాన్‌జోస్ యూనివర్సిటీ, ఖాన్ అకాడమీ తదితర సంస్థలు ఎలాంటి లాభాపేక్ష లేకుండా ఆన్‌లైన్ కోర్సులు అందిస్తున్నాయి. కోర్స్ ఎరా, విజ్ ఐక్యూ, ఉడా సిటీ, ఓపెన్ లెర్నింగ్, ఓపెన్ క్లాస్‌రూమ్స్, షా అకాడమీ తదితర సంస్థలు ఫీజులు వసూలు చేస్తున్నాయి. అయితే ఈ కంపెనీలు కూడా ప్రఖ్యాత యూనివర్సిటీల అధ్యా పకుల ద్వారా వీడియో తరగతులు నిర్వహి స్తున్నాయి.

కోర్సులు ఏ తరహా..

సైకాలజీ, సోషియాలజీ, మేనేజ్‌మెంట్ లాంటి సాంప్రదాయక కోర్సులతోపాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ లాంటి అధునాతన అంశాలను కూడా ఆన్‌లైన్‌లో నేర్చుకోవచ్చు. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ రంగానికి సంబంధించి చాలా అడ్వాన్స్‌డ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఎడ్ ఎక్స్ సంస్థ వెబ్ డెవలప్‌మెంట్, డిజిటల్ ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్, పైథాన్, బిగ్ డేటా అనలిటిక్స్, కంప్యూటర్ నెట్‌వర్క్, ఫొటోగ్రఫీ, కార్పొరేట్ ఫైనాన్స్ లాంటి అధునాతన అంశాల్లో శిక్షణ ఇస్తోంది. వీటిని మైక్రోసాఫ్ట్, వార్టన్ బిజినెస్ స్కూల్, హార్వర్డ్, అడిలైడ్ యూనివర్సిటీ, బోస్టన్ యూనివర్సిటీ, ఐఐటీ బాంబే, ఐఐఎం బెంగళూర్ తదితర సంస్థలు నిర్వహిస్తున్నాయి. అన్ని కోర్సులను అప్లయిడ్ స్వభావంతో సామర్థ్యాలను పెంపొందిం చుకోవడానికి ఉపయోగపడేలా రూపొందించడం విశేషం.

ఆన్‌లైన్ కోర్సుల వేదికలు :

Stanford Online : స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ

Coursera : స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ, ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ, ఆరిజోనా స్టేట్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ మేరీల్యాండ్ కాలేజ్ పార్క్, యూనివర్సిటీ ఆఫ్ ఇలినాయి

Khan Academy WizIQ : ఐఐటీ ఢిల్లీ, డెస్ మోయిన్స్, ఏరియా కమ్యూనిటీ కాలేజ్

Canvas Network : శాంటా క్లారా యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ ఉతా, యూనివర్సిటీ లిలే 1

Peer to Peer University Udacity : జార్జియా యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ, శాన్‌జోస్ స్టేట్ యూనివర్సిటీ, గూగుల్, సేల్స్‌ఫోర్స్ డాట్‌కామ్, ఫేస్‌బుక్, క్లౌడ్ ఎరా, ఎన్‌విడియా, ఆటోడెస్క్, క్యాడెన్స్

Eliademy : ఆల్టో యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్

openHPI : వర్సిటీ ఆఫ్ పోస్ట్‌డామ్, జర్మనీ

FutureLearn : యూనివర్సిటీ ఆఫ్ బర్మింగ్‌హామ్, యూనివర్సిటీ ఆఫ్ ఎడెన్‌బరో, కింగ్స్ కాలేజ్ లండన్, యూనివర్సిటీ ఆఫ్ లీసెస్టర్, యూనివర్సిటీ ఆఫ్ రీడింగ్, ఓపెన్ యూనివర్సిటీ, మోనాష్ వర్సిటీ, ట్రినిటీ కాలేజ్ ఆఫ్ డబ్లిన్, వార్విక్ వర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ బాత్, యూనివర్సిటీ ఆఫ్ సౌథాంప్టన్

OpenClassrooms : గూగుల్, మైక్రోసాఫ్ట్, ఐబీఎం, జెన్‌డెస్క్, ఇకోల్ పాలిటెక్నిక్

OpenLearning : యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్‌వేల్స్, టేలర్స్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ కాన్‌బెర్రా

EdX : ఎంఐటీ, హార్వర్డ్ వర్సిటీ, బోస్టన్ వర్సిటీ, యూసీ బెర్క్‌లీ, క్యోటో వర్సిటీ, ఆస్ట్రేలియన్ నేషనల్ వర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ అడిలైడ్, యూనివర్సిటీ ఆఫ్ క్వీన్స్‌లాండ్, ఐఐటీ బాంబే, ఐఐఎం బెంగళూర్, డార్ట్‌మౌత్ కాలేజ్, కర్టిన్ వర్సిటీ, కార్నెల్ వర్సిటీ

iversity : యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరెన్స్

One Month : స్కూల్ ఆఫ్ విజువల్ ఆర్ట్స్

NovoEd : స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ, వార్టన్ బిజినెస్ స్కూల్, ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ, డార్టెన్, కామ్‌కాస్ట్, కార్నెగీ ఫౌండేషన్

Coursmos : స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ, డ్రాపర్ యూనివర్సిటీ, ఎంఐటీ

Open2study : జేమ్స్ కుక్ యూనివర్సిటీ, గ్రిఫిత్ యూనివర్సిటీ, సిడ్నీ ఇన్‌స్టిట్యూట్, స్విన్‌బర్న్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ, యూనివర్సిటీ ఆఫ్ న్యూక్యాజిల్, జోర్డాన్ వర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, యూనివర్సిటీ ఆఫ్ టాస్మానియా, సౌత్ చైనా వర్సిటీ, కర్టిన్ వర్సిటీ

Kadenze : స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ, ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ,

POLHN : WHO, మినిస్ట్రీస్ ఆఫ్ హెల్త్

ALISONLynda Shaw Academy :

Udemy : స్ట్రేయర్ యూనివర్సిటీ

మన దేశంలో 'స్వయం'

కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ 'స్వయం' (స్టడీ వెబ్స్ ఆఫ్ యాక్టివ్ లెర్నింగ్ ఫర్ యంగ్ యాస్పైరింగ్ మైండ్స్) పేరుతో 900కు పైగా ప్రత్యేక ఆన్‌లైన్ కోర్సులను అందిస్తోంది.

ఇంజినీరింగ్, సోషల్ సైన్సెస్, హ్యూమానిటీస్, సైన్సెస్, మేనేజ్‌మెంట్ తదితర సబ్జెక్టులకు సంబంధించిన కోర్సులు https://swayam.gov.in/ లో ఉన్నాయి. వీడియో లెక్చర్లు, స్టడీ మెటీరియల్, అసైన్‌మెంట్‌లు, క్విజ్‌ల రూపంలో కోర్సులను నిర్వహిస్తున్నారు. ఐఐటీలు, ఐఐఎంలు, సెంట్రల్ యూనివర్సిటీల అధ్యాపకులు బోధిస్తున్నారు. ఈ కోర్సులు పూర్తిచేయడం ద్వారా సాధించే క్రెడిట్‌లను మీ రెగ్యులర్ కోర్సు క్రెడిట్‌లకు కలుపుకోవచ్చు.

ఇంటినుంచే చదివి పట్టభద్రులయ్యే అవకాశం

- ఆర్ట్స్, సైన్స్, కామర్స్, పెర్ఫార్మింగ్ ఆర్ట్స్, సోషల్ సైన్సెస్, హ్యూమానిటీస్‌లే కాకుండా ఇంజినీరింగ్, టెక్నాలజీ, లా, మెడిసిన్, అగ్రికల్చర్, మెడిసిన్‌లకు సంబంధించిన కోర్సులు ఉన్నాయి. వీటిలో మార్కెట్‌లో గిరాకీ ఉన్న ఆధునిక కోర్సులు ఎన్నో ఉన్నాయి.
- అన్ని కోర్సులను ఉచితంగా చేయవచ్చు. సర్టిఫికెట్ కావాలంటే మాత్రం ఫీజు చెల్లించాలి.
- ప్రస్తుతం ఐఐటీలు (బాంబే, మద్రాస్, కాన్పూర్, గువాహటి), ఢిల్లీ యూనివర్సిటీ, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, ఇగ్నో, ఐఐఎం కలకత్తా, ఐఐఎం బెంగళూర్, బెనారస్ హిందూ యూనివర్సిటీ, ఎన్‌సీఈఆర్‌టీ, ఎన్ఐఓఎస్, అనేక విద్యా సంస్థలకు చెందిన అధ్యాపకులు ఈ కోర్సుల నిర్వహణలో పాలుపంచుకుంటున్నారు. వచ్చే రెండు, మూడేళ్లలో కనీసం కోటి మంది విద్యార్థులకు ఈ కోర్సులు అందించాలని ఉద్దేశం.
- **అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు :** ప్రస్తుతం 587 రకాల అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో కొన్ని.. అడ్వర్‌టైజింగ్ అండ్ పబ్లిక్ రిలేషన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, గ్రాఫ్ థియరీ, డిజిటల్ స్పీచ్ ప్రాసెసింగ్, జెనెటిక్స్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, బేసిక్స్ ఆఫ్ ఫొటోగ్రఫీ, ప్రాచీన హిందీ కావ్య, కంప్యూటర్ నెట్‌వర్క్స్, ఫైనాన్షియల్ అకౌంటింగ్ మొదలైనవి.
- **పోస్టు గ్రాడ్యుయేట్ స్థాయి కోర్సులు :** ప్రస్తుతం 307 రకాల కోర్సులు ఉన్నాయి. వాటిలో కొన్ని.. మేనేజ్‌మెంట్ అకౌంటింగ్ ఫర్ డెసిషన్ మేకింగ్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, క్లినికల్ సైకాలజీ, ఆడియో- విజువల్ మీడియా, డిజిటల్ లైబ్రరీ, ఫారెస్ట్ బయోమెట్రీ, సైంటో మెట్రిక్స్, ఇన్ఫర్మేషన్ సోర్సెస్ సిస్టమ్ అండ్ సర్వీసెస్, శాటిలైట్ కమ్యూనికేషన్, పెరిసైక్లిక్ రియాక్షన్స్ అండ్ ఆర్గానిక్ ఫొటో కెమిస్ట్రీ, డిస్ట్రిబ్యూటెడ్ సిస్టమ్స్, ఇంట్రడక్షన్ టు మార్కె టింగ్, కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్, కార్పొరేట్ ఫైనాన్స్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్, స్ట్రాటజీ అండ్ సస్టెయినబుల్ ఎంటర్‌ప్రైజ్, క్రియేటింగ్ కాంపిటేటివ్ అడ్వాంటేజ్, ఫేజ్ డయాగ్రమ్స్ ఇన్ మెటీరియల్ సైన్స్ అండ్ ఇంజి నీరింగ్, ఎక్స్‌పరిమెంటల్ స్ట్రెస్ ఎనాలి సిస్, పీడీఈ ఫర్ ఇంజినీర్స్- సొల్యూషన్ బై సెపరా, ఇంట్రడక్షన్ టు ప్రాసెస్ మోడలింగ్ ఇన్ మెంబ్రేన్ సెపరేషన్ ప్రాసెస్, ప్రొటీన్స్ అండ్ జెల్ బేస్డ్ ప్రొటియోమిక్స్, మాస్ స్పెక్ట్రోమెట్రీ బేస్డ్ ప్రొటియోమిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ - ప్రాబ్లెమ్ సాల్వింగ్, ఎర్రర్ కంట్రోల్ కోడింగ్, కండక్షన్ అండ్ కన్వెక్షన్ హీట్ ట్రాన్స్‌ఫర్, ప్రాబబిలిటీ మెథడ్స్ ఇన్ సివిల్ ఇంజినీరింగ్ మొదలైనవి.

సర్టిఫికెట్ కోర్సులు : ప్రస్తుతం సర్టిఫికెట్ కోర్సులు 17 ఉన్నాయి. ఇన్ఫర్మేషన్ సోర్సెస్ అండ్ లైబ్రరీ సర్వీసెస్, టెక్నాలజీ ఆఫ్ పెర్మెంటెడ్, చీజ్, ఐస్‌క్రీమ్ అండ్ బై ప్రోడక్ట్స్, డాక్యుమెంట్ ప్రాసెసింగ్ అండ్ ఆర్గనైజేషన్, ఇండయన్ అగ్రికల్చరల్ డెవలప్‌మెంట్, సస్టెయినబుల్ మేనేజ్‌మెంట్ ఆఫ్ బయోడైవర్సిటీ, ఇంట్రడక్షన్ టు పౌల్ట్రీ ఫార్మింగ్.

ఆన్‌లైన్ కోర్సుల తీర్మానం

ఇటీవల టైమ్స్ జాబ్స్ 1200 మంది వృత్తినిపుణులైన ఉద్యోగార్థులతో సర్వే చేసింది. దీనిలో పాల్గొన్నవారిలో సగం మంది నూతన సంవత్సర తీర్మానం ఏమిటంటే.. ఆన్‌లైన్ కోర్సులు చేయడం... తమ నైపుణ్యాలను అప్‌గ్రేడ్ చేసుకోవాలనే ఉద్దేశమే ఈ నిర్ణయానికి కారణమని వారు తెలిపారు.



ఐసీఏఆర్‌లో అగ్రికల్చర్ సైంటిస్టులు

న్యూఢిల్లీలోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రిసెర్చ్ (ఐసీఏఆర్) ఆధ్వర్యంలోని అగ్రికల్చరల్ సైంటిస్ట్స్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఏఎస్‌ఆర్‌బీ) సైంటిస్ట్ పోస్టుల భర్తీకి అగ్రికల్చరల్ రిసెర్చ్ సర్వీస్ (ఏఆర్ఎస్) ఎగ్జామినేషన్-2017 (ప్రిలిమినరీ) , వివిధ వ్యవసాయ యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల అర్హతకు నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నెట్-I)-2018 ఉమ్మడి పరీక్ష రాయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు : ప్రిలిమినరీ ఏఆర్ఎస్-2017, నెట్ (I)-2018 కంబైన్డ్ పరీక్షను హైదరాబాద్‌తో సహా దేశవ్యాప్తంగా 23 కేంద్రాల్లో కంప్యూటర్ బేస్డ్‌గా నిర్వహిస్తారు. ఏఆర్ఎస్-2017 మెయిన్ పరీక్షను 12 కేంద్రాల్లో నిర్వహిస్తారు.

- **పోస్టు** : సైంటిస్ట్
- మొత్తం ఖాళీల సంఖ్య -195 (జనరల్-103, ఓబీసీ-48, ఎస్సీ-23, ఎస్టీ-21)
- **విభాగాలవారీగా ఖాళీలు :** అగ్రికల్చరల్ (బయోటెక్నాలజీ-6, ఎంటమాలజీ-1, మైక్రోబయాలజీ-6), జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్-18, ప్లాంట్ బయోకెమిస్ట్రీ-9, ప్లాంట్ పాథాలజీ-8, ప్లాంట్ ఫిజియాలజీ-3, సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ-2, యానిమల్ బయోటెక్నాలజీ-2, యానిమల్ జెనెటిక్స్ అండ్ బ్రీడింగ్-4, యానిమల్ ఫిజియాలజీ-2, లైవ్‌స్టాక్ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్-4, వెటర్నరీ (మెడిసిన్-1, ఫార్మకాలజీ-1, పబ్లిక్ హెల్త్-1), ఫిషరీస్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్-6, అగ్రికల్చరల్ (కెమికల్స్-5, మెటీరియాలజీ-1), ఆగ్రోఫారెస్ట్రీ-4, ఆగ్రానమీ-8, సాయిల్ సైన్సెస్-10, అగ్రికల్చరల్ ఎకనామిక్స్-16, అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్-6, అగ్రికల్చరల్ స్టాటిస్టిక్స్-9, ఫామ్ మెషినరీ అండ్ పవర్-9, కంప్యూటర్ అప్లికేషన్ అండ్ ఐటీ-22, ల్యాండ్ అండ్ వాటర్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్-8, బయోఇన్ఫర్మాటిక్స్-11, అగ్రికల్చరల్ స్ట్రక్చర్ అండ్ ప్రాసెస్ ఇంజినీరింగ్-12
- **అర్హతలు:** అగ్రికల్చర్ రిసెర్చ్ సర్వీస్ (ఏఆర్ఎస్)-2017 కోసం గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత విభాగంలో మాస్టర్ డిగ్రీ/తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత. 2018 జూన్ 24 నాటికి డిగ్రీని పూర్తిచేసి ఉండాలి. నెట్ (I)-2018 కోసం సంబంధిత స్పెషలైజేషన్‌లో మాస్టర్ డిగ్రీని 2018 జూన్ 24లోపు పూర్తిచేయాలి.
- **వయస్సు :** ఏఆర్ఎస్ పరీక్షకు 21 నుంచి 32 ఏళ్ల మధ్య ఉండాలి. నెట్ పరీక్షకు కనిష్ఠంగా 21 ఏళ్లు, గరిష్ఠ వయోపరిమితి లేదు.
- **పే స్కేల్:** రూ. 15,600-39,100 + రిసెర్చ్ గ్రేడ్ పే రూ. 6,000
- **ఎంపిక :** ఆన్‌లైన్ రాతపరీక్ష ద్వారా
- **దరఖాస్తు ఫీజు :** ఏఆర్ఎస్ పరీక్షకు రూ. 500. ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, మహిళలకు ఎటువంటి ఫీజు లేదు. నెట్ 2018 పరీక్షకు జనరల్ అభ్యర్థులు రూ. 1000. ఓబీసీ అభ్యర్థులు రూ. 500, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, మహిళలకు 250, ఏఆర్ఎస్, నెట్‌లకు (రెండింటికి) అప్లయ్ చేసేవారు
  జనరల్ అభ్యర్థులు రూ. 1500, ఓబీసీ అభ్యర్థులు రూ. 1000, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, మహిళలకు రూ. 250.
- **ఎన్నిసార్లు పరీక్ష రాయవచ్చు :** జనరల్ అభ్యర్థులు ఆరుసార్లు, ఓబీసీ అభ్యర్థులు తొమ్మిదిసార్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు (గరిష్ఠ వయోపరిమితి లోపల) ఎన్నిసార్లయిన పరీక్ష రాయవచ్చు. నెట్ పరీక్ష రాయడానికి ఎలాంటి పరిమితులు లేవు.
- **పరీక్ష కేంద్రాలు :** దేశవ్యాప్తంగా మొత్తం 23 సెంటర్లలో పరీక్షను నిర్వహిస్తారు
- **ఎంపిక :** ప్రిలిమినరీ, మెయిన్, వైవా ద్వారా
- ఏఆర్ఎస్-2017 ప్రిలిమినరీ(ఆబ్జెక్టివ్ టైప్)-150 మార్కులు, మెయిన్ (డిస్క్రిప్టివ్ టైప్)-240 మార్కులు, వైవాకు 60 మార్కులు.
- ప్రిలిమినరీ పరీక్షకు 2 గంటలు, మెయిన్ పరీక్షకు 3 గంటలు పరీక్ష సమయాన్ని కేటాయించారు.
- ప్రతి తప్పు సమాధానానికి 1/3 మార్కులను తగ్గిస్తారు.
- ఏఆర్ఎస్-2017 మెయిన్ పరీక్షకు అర్హత సాధించడానికి ప్రిలిమినరీ పరీక్షలో జనరల్ అభ్యర్థులు 45 శాతం, ఓబీసీ అభ్యర్థులు 40 శాతం, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులు 35 శాతం కనీస అర్హత మార్కులను తప్పనిసరిగా సాధించాలి.
- వివిధ యూనివర్సిటీల్లో లెక్చరర్/ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల అర్హతకు నిర్వహించే నెట్ (I)-2018 పరీక్షలో జనరల్ అభ్యర్థులు 75 శాతం, ఓబీసీ అభ్యర్థులు 45 శాతం, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులు 40 శాతం కనీస అర్హత మార్కులను తప్పనిసరిగా సాధించాలి.
- **దరఖాస్తు** : ఆన్‌లైన్‌లో
- **ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్ష** : 2018 ఏప్రిల్ 6 నుంచి 13
- **ఏఆర్ఎస్ మెయిన్ పరీక్ష** : 2018 జూన్ 24
- **చివరితేదీ** : 2018 మార్చి 2
- **వెబ్‌సైట్**: www.asrb.org.in





ఆర్ఏసీలో జేఆర్ఎఫ్ పోస్టులు

ఢిల్లీలోని డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో) పర్సనల్ డిపార్ట్‌మెంటైన రిక్రూట్‌మెంట్ అండ్ అసెస్‌మెంట్ సెంటర్(ఆర్ఏసీ) ఖాళీగా ఉన్న జేఆర్ఎఫ్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- **మొత్తం ఖాళీల సంఖ్య** : 4
- **అర్హత:** కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్/ఐటీ ఇంజినీరింగ్‌లో బీఈ/బీటెక్ లేదా ఎంఈ/ఎంటెక్‌లో ఉత్తీర్ణత, పీజీ (సైకాలజీ)లో ఉత్తీర్ణత. నెట్ పరీక్షలో ఉత్తీర్ణత.సీ, సీ++, జావా, పీహెచ్‌పీ, ఎస్‌క్యూఎల్, డాట్ నెట్‌లో పరిజ్ఞానం ఉండాలి.
- పే స్కేల్ : రూ.25000
- ఎంపిక : పర్సనల్ ఇంటర్వ్యూ
- దరఖాస్తు : ఆన్‌లైన్ లేదా ఈ మెయిల్ ద్వారా
- ఇంటర్వ్యూ తేదీ : ఫిబ్రవరి 15
- వెబ్‌సైట్ : www.rac.gov.in

విశాలాంధ్ర బిజినెస్

-561.22 ▼ సెన్సెక్స్ 34,195.94	-168.30 ▼ నిఫ్టీ 10,498.25	100 ▲ బంగారం (విజయవాడ) 28,900 22 క్యారెట్లు, 10 గ్రాములు	బంగారం (విశాఖపట్నం) 28,900 ప్రొద్దుటూరు 29,250 22 క్యారెట్లు, 10 గ్రాములు	వెండి (విజయవాడ) 39,800 కిలో (రూపాయల్లో)	వెండి (విశాఖపట్నం) 42,600 ప్రొద్దుటూరు 42,529 కిలో (రూపాయల్లో)	డాలరు Vs రూపాయి 64.24

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
టాటా స్టీల్	679.25	-0.06

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
టాటా మోటార్స్	374.45	-5.45
టాటా మోటార్స్ (డి)	208.50	-4.71
టీసీఎస్	2,995.35	-3.58
కోటక్ మహీంద్ర	1,049.10	-2.70
బీహెచ్ఇఎల్	93.30	-2.69

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	64.06	64.24
యూరో	79.77	79.35
పౌండ్	89.94	89.20
ఆస్ట్రేలియా డాలర్	50.77	50.45
సింగపూర్ డాలర్	48.64	48.57

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	28,250	31,283
చెన్నై	29,110	31,133
బెంగళూరు	28,350	30,320
ముంబై	29,790	31,860
విజయవాడ	28,900	31,500
విశాఖపట్నం	28,900	31,527
ప్రొద్దుటూరు	29,250	30,710

ముడి చమురు	69.62

మార్కెట్లకు అ'మంగళం'..!

రూ.5లక్షల కోట్లు ఆవిరి

ముంబై: రెండు నెలలుగా ఆల్‌టైమ్ రికార్డులతో కళకళలాడిన దేశీయ మార్కెట్లు మంగళవారం భారీ నష్టాలతో కుప్పకూలి వెలవెలబోయాయి. కేవలం మంగళవారం రూ.4.95 లక్షల కోట్ల పెట్టుబడి కొన్ని నిముషాల్లోనే ఆవిరైంది. బడ్జెట్ నేపథ్యంలో కిందటి రెండు సెషన్లలో అతలాకుతలమైన స్టాక్ మార్కెట్లకు మంగళవారం అంతర్జాతీయ మార్కెట్ల సెగ తగిలింది. అమెరికా క్రెడిట్ రేటింగ్‌ను తగ్గించడం అక్కడి మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపింది. దీనికి తోడు ఫెడ్ వడ్డీ రేట్లను పెంచే అవకాశాలుండటంతో మార్కెట్ భారీగా పతనమైంది. అటు ఆసియా మార్కెట్లు కూడా నేలచూపులు చూస్తున్నాయి. దీంతో ఆ ప్రభావం భారత మార్కెట్లపై కూడా పడింది. ఆరంభంలోనే కుప్పకూలిన సూచీలు.. మార్కెట్ ప్రీ సెషన్లో భారీ నష్టాలతో ట్రేడ్ అయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 1200 పాయింట్లు.. నిఫ్టీ 350 పాయింట్లకు పైగా నష్టంతో కొనసాగింది. ప్రస్తుతం సెన్సెక్స్ 561 పాయింట్ల నష్టంతో 34,195 వద్ద, నిఫ్టీ 168 పాయింట్లు కోల్పోయి 10,498 వద్ద ట్రేడ్ అయ్యాయి. టాటామోటార్స్ 5.82 శాతం, యాక్సిస్ బ్యాంకు 4.65 శాతం, ఆంధ్రాబ్యాంకు 6.24 శాతం, సెంట్రల్ బ్యాంకు 4.79 శాతం, ఐసీఐసీఐ బ్యాంకు 4.09 శాతం, ఐడీబీఐ 6.56 శాతం...ఇలా అన్ని బ్యాంకుల షేర్లు పడిపోయాయి.



అమెరికా మార్కెట్లు డమాల్...

అమెరికా కాలమానం ప్రకారం.. సోమవారం నాటి ట్రేడింగ్‌లో వాల్ స్ట్రీట్ మార్కెట్లు భారీగా పతనమయ్యాయి. ఎస్ అండ్ పీ 500, డో ఇండస్ట్రియల్స్ సూచీలు రెండూ సోమవారం ట్రేడింగ్‌లో 4.0 శాతానికి పైగా నష్టపోయాయి. డో ఏకంగా తన చరిత్రలోనే అతిపెద్ద ఇంట్రాడే పతనాన్ని నమోదుచేసింది. సుమారు 1600 పాయింట్ల మేర కిందకి జారింది. ఆఖరికి 1175 పాయింట్ల నష్టంలో 25వేల కిందకు వచ్చి చేరింది. ఏడాదంతా ఆర్జించిన లాభాలను వాల్‌స్ట్రీట్ కోల్పోయింది. 2011 ఆగస్టు నుంచి అతిపెద్ద సింగిల్-డే నష్టాన్ని ఎస్ అండ్ పీ 500 ఇండెక్స్, డోజోన్స్ ఇండస్ట్రియల్ యావరేజ్ నమోదు చేశాయి. గత ఆరేళ్ల కాలంలో ఎస్ అండ్ పీ 500కి సోమవారమే అతిచెత్త డే. చివరికి 2648.94 వద్ద క్లోజైంది. 0.5 శాతం పైకి ఎగిసిన నాస్‌డాక్ కాంపోజిట్ కూడా 3.8 శాతం నష్టాలు గడించి 6,967.53 వద్ద స్థిరపడింది. ప్రారంభ లాభాలకు ఆపిల్, అమెజాన్ సహకరించినప్పటికీ.. చివరి వరకు స్టాక్ మార్కెట్లను ఈ షేర్లు కాపాడలేకపోయాయి. అమెరికా క్రెడిట్ రేటింగ్‌ను తగ్గించడంతో మార్కెట్‌లో ఈ పరిస్థితి నెలకొంది. అంతేకాక యూరో జోన్ రుణ సంక్షోభంలోకి కూరుకుపోయింది. గత మూడు నుంచి నాలుగేళ్లుగా మార్కెట్‌లో ట్రేడింగ్ చేస్తున్న చాలా మంది ఇన్వెస్టర్లు అంతకముందు ఎన్నడూ ఇలాంటి పరిస్థితిని చూడలేదని లాస్‌వేగాస్‌లోని బ్రైట్ ట్రేడింగ్ ప్రొప్రైటరీ ట్రేడర్ డెనిస్ డిక్ చెప్పారు. మార్కెట్‌లో తీవ్రంగా అమ్మకాల ఒత్తిడి నెలకొందని విశ్లేషకులు చెప్పారు. అయితే ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ పన్ను కోతలు, బలమైన కార్పొరేట్ ఫలితాలు మార్కెట్ వాల్యుయేషన్‌కు మద్దతు ఇస్తాయని బుల్ విశ్లేషకులు చెబుతున్నారు.

బుల్ విశ్లేషకుల అంచనాలకు భిన్నంగా... ఇటీవల ఏళ్లలో సెంట్రల్ బ్యాంకు తన సరళతరమైన విధానాలను విత్‌డ్రా చేస్తుందని, బాండు దిగుబడి పెరుగుతుందని దీంతో మార్కెట్లు మరింత పతనం కావొచ్చని బేర్ విశ్లేషకులంటున్నారు. సోమవారం మార్కెట్‌లో ఫైనాన్సియల్, హెల్త్‌కేర్, ఇండస్ట్రియల్ సెక్టార్లు ఎక్కువగా నష్టపోయాయి. దిగ్గజ 11 ఎస్ అండ్ పీ రంగాలు కనీసం 1.7 శాతం మేర కిందకి పడిపోయాయి. 30 బ్లూచిప్ డో ఇండస్ట్రియల్ కాంపోనెంట్స్ కూడా నెగిటివ్‌గా ముగిశాయి. వాల్‌స్ట్రీట్ మార్కెట్ల ప్రభావం ఇటు ఆసియన్ మార్కెట్లపైనా పడుతోంది.

రూపాయి విలవిల..!

గ్లోబల్ ఈక్విటీ మార్కెట్లు, దేశీయ స్టాక్‌మార్కెట్లలో నెలకొన్న భారీ పతనం, రూపాయిపైనా ప్రభావం చూపింది. అమెరికా డాలర్‌తో పోలిస్తే.. దేశీయ రూపాయి ఏడు వారాల కనిష్ట స్థాయికి పడిపోయింది. గత ముగింపు 0.46 శాతం నష్టపోయిన దేశీయ కరెన్సీ 64.36 వద్ద ట్రేడైంది. ప్రారంభంలో అత్యంత కనిష్ట స్థాయి 64.40ను కూడా తాకింది. గతేడాది డిసెంబర్ 18 తర్వాత రూపాయి ఈ మేర క్షీణించడం ఇదే మొదటిసారి. ప్రస్తుతం 31 పైసలు బలహీనపడి 64.37 వద్ద ట్రేడవుతోంది. స్టాక్‌మార్కెట్లు భారీగా పతనం కావడంతో, రూపాయి విలువ కూడా దిగజారింది.

బిలియనీర్లకు రూ.7.32లక్షల కోట్లు నష్టం

బఫెట్ సంపద 500 కోట్ల డాలర్లు ఉఫ్



న్యూయార్క్ : అమెరికా స్టాక్ మార్కెట్ల పతనంతో ప్రపంచంలోని 500 మంది బిలియనీర్ల సంపద అంతర్థానమైంది. ఈ సంపన్నులు సుమారు రూ.7 లక్షల 32 వేల కోట్లు నష్టపోయారని బ్లూమ్‌బర్గ్ అంచనా వేసింది. ఇందులో ఒక్క బిలియనీరే అత్యధికంగా సుమారు 500 కోట్ల డాలర్లు (సుమారు రూ.32 వేల కోట్లు) నష్టపోవడం గమనార్హం. ఆ కుబేరుడు ఎవరో కాదు.. బెర్క్‌షైర్ హాథ్‌వే చైర్మన్ వారెన్ బఫెట్. కేవలం 24 గంటల వ్యవధిలో రూ.32 వేల కోట్ల సంపదను కోల్పోయారు. 9.2 శాతం మేర పతనమైన వెల్స్ అండ్ ఫార్గో కంపెనీలో మెజార్టీ వాటా బెర్క్‌షైర్ కంపెనీదే కావడంతో బఫెట్ నష్టం భారీగా ఉంది. బఫెట్ తర్వాత ఫేస్‌బుక్ సీఈవో మార్క్ జుకెర్‌బర్గ్ 360 కోట్ల డాలర్లు (సుమారు రూ.23 వేల కోట్లు) నష్టపోయాడు. అటు ప్రపంచంలోనే అత్యంత ధనికుడు అమెజాన్ సీఈవో జెఫ్ బెజోస్ కూడా సుమారు రూ.21 వేల కోట్ల సంపదను కోల్పోయారు. అల్ఫాబెట్ ఓనర్లు లారీ పేజ్, సెర్గీ బ్రిన్‌లు సుమారు రూ.15 వేల కోట్ల మేర నష్టపోయారు. 2011 ఆగస్ట్ తర్వాత డౌ జోన్స్ 1175 పాయింట్లు కోల్పోవడం ఇదే తొలిసారి.



పవర్‌ఫుల్ ఉమెన్ అచీవర్‌గా షేక్ నౌహెరా

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ప్రముఖ నెక్స్ బ్రాండ్ తాజాగా పవర్‌ఫుల్ ఉమెన్ అచీవర్ అవార్డును ప్రకటించింది. ఈ అవార్డును హీరా గ్రూప్ సీఈవో డాక్టర్ షేక్ నౌహెరా అందుకున్నారు. డాక్టర్ నౌహెరా తన 19 ఏళ్ల ప్రాయంలో విద్యారంగంలో సేవలను ప్రారంభించింది. తరువాత ఆమె హీరా గ్రూప్ అఫ్ కంపెనీస్ ప్రారంభించింది. ఈ గ్రూప్ ద్వారా విద్య బంగారం వ్యాపారం, పెట్టుబడులు, వస్త్ర ఉత్పత్తి, జ్యువెలరీ, మినరల్ వాటర్, గ్రానైట్ టూర్స్ అండ్ ట్రావెల్స్, రియల్ ఎస్టేట్, ఎలక్ట్రానిక్స్ తదితర వ్యాపారాలను నిర్వహిస్తున్నారు. ఈ గ్రూపులో వేల మంది సభ్యులున్నారు. తన తల్లిదండ్రులు ప్రోత్సహంతోనే ఈ స్థాయికి ఎదిగానని డాక్టర్ నౌహెరా తెలిపారు.



ఏడువారాల కనిష్టానికి దిగజారిన రూపాయి

ముంబై : గ్లోబల్ ఈక్విటీ మార్కెట్లు, దేశీయ స్టాక్ మార్కెట్లలో నెలకొన్న భారీ పతనం దేశీయ కరెన్సీ రూపాయిపై తీవ్రపభావం చూపింది. అమెరికా డాలర్‌తో పోలిస్తే.. దేశీయ రూపాయి ఏడు వారాల కనిష్ట స్థాయికి పడిపోయింది. సోమవారం 0.46 శాతం నష్టపోయిన దేశీయ కరెన్సీ 64.36 వద్ద ట్రేడైంది. ప్రారంభంలో అత్యంత కనిష్ట స్థాయి 64.40ను కూడా తాకింది. గతేడాది డిసెంబర్ 18 తర్వాత రూపాయి ఈ మేర క్షీణించడం ఇదే మొదటిసారి. ప్రస్తుతం 31 పైసలు బలహీనపడి 64.37 వద్ద ట్రేడవుతోంది. స్టాక్‌మార్కెట్లు భారీగా పతనం కావడంతో, రూపాయి విలువ కూడా దిగజారింది. అమెరికన్ మార్కెట్ల ప్రభావంతో దేశీయ స్టాక్ మార్కెట్లు సెన్సెక్స్ భారీగా 1250 పాయింట్ల మేర పతనమైంది. నిఫ్టీ సైతం 350 పాయింట్ల మేర క్రాష్ అయింది. అమెరికన్ స్టాక్ మార్కెట్లు కూడా సోమవారం భారీగా పతనమయ్యాయి. డోజోన్స్, ఎస్ అండ్ పీ సూచీలు అతిపెద్ద ఇంట్రాడే పతనాలను నమోదుచేశాయి. డోజోన్స్ ఇండస్ట్రియల్ యావరేజ్ 1100 పాయింట్లు పూడిపోయి ఆరున్నరేళ్లలో మొదటిసారి అతిపెద్ద పతనాన్ని నమోదు చేసింది. అమెరికా వేతన డేటా, క్రెడిట్ రేటింగ్ డౌన్ గ్రేటింగ్ చేసిన ప్రభావంతో అమెరికా స్టాక్ మార్కెట్లు ఈ మేర కిందకి దిగజారాయి. దేశీయంగా బడ్జెట్‌లో ప్రతిపాదించిన పన్ను భయాలు, ఆర్‌బీఐ వడ్డీ రేట్ల పెంపు, క్రూడ్ ఆయిల్ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం, అమెరికా మార్కెట్ల ప్రభావం వంటివి మన మార్కెట్లపై ప్రభావంచూపుతోంది. మన దేశీయ మార్కెట్లు బడ్జెట్ ప్రభావంతో తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నాయి. ఆర్‌బీఐ వడ్డీరేట్లను పెంచనున్నట్లు వార్తలు వెలువడటంతో ట్రేడర్లు కూడా అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. ఈ ఏడాది ప్రారంభం నుండి రూపాయి విలువ 1శాతం దిగజారింది. విదేశీ మదుపరులు స్థానిక ఈక్విటీలనుండి 2.08 బిలియన్ డాలర్ల కొనుగోలు చేసారు.

ఇప్పుడు కాదు.. ఏప్రిల్ 1 తర్వాతే

- అప్పుడు అమ్మిన షేర్లకే ఎల్‌టీసీజీ పన్ను
- స్పష్టతనిచ్చిన కేంద్రం



న్యూఢిల్లీ: దీర్ఘకాలిక మూలధన లాభాల (ఎల్‌టీసీజీ) పన్ను.. ఏప్రిల్ 1 తర్వాత అమ్మే షేర్లపై వచ్చిన లాభాలకే వర్తిస్తుందని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2018-19)గాను పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ ఈ నెల 1న ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో ఎల్‌టీసీజీని ప్రతిపాదించిన విషయం తెలిసిందే. స్టాక్ మార్కెట్‌లో కొనుగోలు చేసిన షేర్లను తిరిగి అమ్మినప్పుడు వచ్చే లాభాలు రూ.లక్ష దాటితే అందులో 10 శాతం ఎల్‌టీసీజీ పన్నుగా చెల్లించాలని జైట్లీ బడ్జెట్‌లో ప్రకటంచారు. ఈక్విటీ నేపథ్యం కలిగిన మ్యూచువల్ ఫండ్స్ నుంచి వచ్చిన ఆదాయంపైనా 10 శాతం పన్ను చెల్లించాల్సిందేనన్నారు. అయితే జనవరి 31 వరకు జరిగిన షేర్ల అమ్మకాలపై వచ్చిన లాభాలకు పన్ను చెల్లించనక్కర్లేదని వెల్లడించారు. ఈ క్రమంలో దేశీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటుండగా, భీకర నష్టాలు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే జనవరి 31న స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో నమోదైన ఆయా షేర్ల గరిష్ఠ విలువల ఆధారంగా లాభాలను గణిస్తామని, ఈ ధరల ప్రామాణికంగానే ఎల్‌టీసీజీ పన్ను ఉంటుందని, ఏప్రిల్ 1 అనంతరం షేర్ల అమ్మకాలకే దీన్ని వర్తింపజేస్తామని కేంద్రం తెలియజేసింది.

ఫిబ్రవరి 1 నుంచి మార్చి 31 మధ్య జరిగే షేర్ల అమ్మకాలకు ఎల్‌టీసీజీలోని సెక్షన్ 10లోగల క్లాజు (38) ప్రకారం పన్ను మినహాయింపునిస్తామని వివరించింది. ఎల్‌టీసీజీ పన్ను దెబ్బతో సెన్సెక్స్ ఏకంగా 1,200 పాయింట్లకుపైగా పతనమైంది. సోమవారం కూడా మార్కెట్లు నష్టాలకే పరిమితం కావడంతో మదుపరుల్లో నెలకొన్న భయాలను పోగొట్టే ప్రయత్నం చేసింది మోదీ సర్కారు. తరచుగా అడిగిన ప్రశ్నల (ఎఫ్ఏక్యూ)పై వివరణ ఇవ్వడంలో భాగంగా ఎల్‌టీసీజీ అమలుపై స్పష్టతనిచ్చింది. కాగా, పన్ను ఎగవేతలను అరికట్టడంలో భాగంగానే ఎల్‌టీసీజీని కేంద్రం.. పద్నాలుగేండ్ల తర్వాత మళ్లీ తీసుకువచ్చింది. కొనుగోలు చేసిన షేర్లను ఏడాదిలోపే తిరిగి అమ్మేస్తే వచ్చే లాభాలపై ప్రస్తుతం 15 శాతం ఎల్‌టీసీజీ పన్ను పడుతున్నది. ఏడాది తర్వాత అమ్మితే మాత్రం ఎల్‌టీసీజీ వర్తించడం లేదు. కానీ తాజా నిర్ణయంతో ఇక ఎప్పుడు అమ్మినా.. లాభం రూ.లక్ష దాటితే అందులో 10 శాతం పన్ను చెల్లించాల్సిందే.

పన్నుల్లో అసమానతలను తొలగిస్తాం

వేతన జీవులు, వ్యాపార వర్గాలు చెల్లిస్తున్న పన్నుల్లో అసమానతలను తొలగిస్తామని ఆర్థిక కార్యదర్శి అధియా అన్నారు. ప్రభుత్వం ఈ దిశగా చర్చలు చేపడుతున్నదని తెలిపారు. 7 లక్షల సంస్థల్లో 50 శాతం సంస్థలు దాఖలు చేస్తున్న ఆదాయం పన్ను (ఐటీ) రిటర్నుల్లో ఆదాయం ఏమీ లేనట్లుగా లేదా ప్రతికూలాత్మక ఆదాయాన్ని చూపిస్తున్నారని చెప్పారు. కాగా, పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ అమలు తర్వాత పన్ను చెల్లింపుదారుల సంఖ్య పెరిగిందన్న అధియా.. జీఎస్టీకి దన్నుగా ప్రభుత్వం ఆదాయాన్ని త్యాగం చేసిందన్నారు.

నష్టాలకు ఎల్‌టీసీజీ కారణం కాదు!: అధియా

ప్రస్తుత స్టాక్ మార్కెట్ నష్టాలకు ఎల్‌టీసీజీ పన్ను కారణం కాదని, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి అందుతున్న బలహీన సంకేతాలేనని ఆర్థిక కార్యదర్శి హస్ముఖ్ అధియా అన్నారు. గ్లోబల్ స్టాక్ మార్కెట్లు నష్టాల్లో కదలాడుతున్నాయని, ఈ ప్రభావంతోనే భారతీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతున్నాయన్న ఆయన ఎల్‌టీసీజీ ప్రకటనప్పుడే ఇలాంటి పరిస్థితులు నెలకొనడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. నిజానికి 10 శాతం ఎల్‌టీసీజీ పన్నును తక్కువగా అభివర్ణించిన అధియా.. స్టాక్ మార్కెట్లలో లేని సంస్థల లావాదేవీలపై. స్థిరాస్తుల అమ్మకంపై ప్రస్తుతం 20 శాతం పన్ను పడుతున్నదని గుర్తుచేశారు. పరిశ్రమల సమాఖ్య సీఐఐ.. సోమవారం నిర్వహించిన బడ్జెట్ తదనంతర సమావేశంలో అధియా పాల్గొన్నారు. భారతీయ స్టాక్ మార్కెట్లకు అంతర్జాతీయ ఒడిదుడుకుల నుంచి మినహాయింపేమీ లేదన్న ఆయన అమెరికాసహా ఐరోపా, ఆసియా మార్కెట్ల నష్టాల ప్రభావమే అధికమని అభిప్రాయపడ్డారు. ఆదివారం పీటీఐకిచ్చిన ఇంటర్వ్యూలో ఎల్‌టీసీజీ పన్ను ద్వారా ఖజానాకు వచ్చే ఆదాయం రెండేండ్లలో రెండింతలు కాగలదన్న విశ్వాసాన్ని అధియా వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.20,000 కోట్లుగా, 2019-20లో రూ.40,000 కోట్లుగా ఉండొచ్చని అంచనా వేశారు. 2017-18 మదింపు సంవత్సరం కోసం దాఖలైన ఐటీ రిటర్నుల ప్రకారం పన్ను మినహాయింపు ఆదాయం రూ.3.76 లక్షల కోట్లుగా ఉందన్న ఆయన ఇది చాలా ఎక్కువని, ఇదంతా కూడా స్టాక్ మార్కెట్ లిస్టింగ్ షేర్ల నుంచి పొందుతున్నదేనని, దీనికి ఎల్‌టీసీజీ కింద మినహాయింపు వస్తున్నదన్నారు.

వడ్డీరేట్లు పెరగవచ్చు: పీఎన్‌బీ

న్యూఢిల్లీ : రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా సమీక్షా సమావేశం బుధవారం జరగనున్న నేపథ్యంలో వడ్డీరేట్లు పెరగ వచ్చునని పంజాబ్ నేషనల్ బ్యాంకు చీఫ్ సునీల్ మెహతా పేర్కొన్నారు. ద్రవ్యోల్బణం తగ్గుతున్నప్పటికీ వడ్డీరేట్లు ఇప్పటివరకు స్థిరంగా ఉన్నాయనీ భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఇది పొదుపుదారులకు శుభవార్తేనని అన్నారు. ఏదేమైనా రుణ గ్రహీతలు మాత్రం వడ్డీరేట్లు పెరిగితే అదనపు రుసుము చెల్లించవలసి వస్తుందన్నారు. ఆర్‌బీఐ బుధవారం ద్వైపాక్షిక సమావేశాన్ని తెరపైకి తేనుంది. 2018-19 యూనియన్ బడ్జెట్ ప్రవేశ పెట్టిన తరువాత మొదటి సమీక్ష సమావేశం కానుంది. గత వారం పిఎన్‌బి వడ్డీరేట్లను 1.35శాతం పెంచింది. 46 నుండి 179 రోజులవరకు ఉన్న డిపాజిట్లపై 1.35శాతం నుండి 6.25 శాతానికి ఫిబ్రవరి 1 నుండి పెంచ నున్నట్లు ప్రకటించింది. 180 రోజుల నుండి ఏడాది లోపు డిపాజిట్లపై 5శాతం నుండి 6.25శాతానికి సవరించింది. గత నెలలో ఎస్‌బీఐ 10 కోట్ల పైనున్న గరిష్ఠ డిపాజిట్లపై వడ్డీరేట్లను 140 బేసిస్ పాయింట్లు పెంచింది. నవంబరులో ఎస్‌బీఐ డిపాజిట్ రేట్లను 1శాతానికి పెంచింది. మూడు బ్యాంకులు గత నెలలో వడ్డీ రేట్లను పెంచినట్లు ప్రకటించాయి.

విద్యుత్ ప్లాంట్లకు బొగ్గు కొరత

కోల్‌కతా: కోల్ ఇండియాలో విద్యుత్తుకు డిమాండ్ పెరగడం, బొగ్గు ఉత్పత్తి తగ్గడంతో భవిష్యత్తులో తీవ్రమైన ఇంధన కొరత ఏర్పడే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బొగ్గు ధరలు ఊపందుకోవడం, ఇంధన ఆధారిత జెన్‌కోస్ ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో వింటర్‌లో పెరగనున్న కోల్ ఇండియా ఉత్పత్తి సంక్షోభంలో పడింది. 2017జులైలో థర్మల్ పవర్ డిమాండ్ ఊహించని పెరుగదల ఇంధన సంక్షోభానికి దారితీసింది. జలవిద్యుత్ ఉత్పాదనలో తగ్గుదల, గ్రామీణ విద్యుదీకరణ పెరగడం డిమాండ్ పెరిగేందుకు కారణమైంది. విద్యుత్ ప్లాంట్లలో డిసెంబర్ చివరినాటికి సరాసరి రోజువారీ నిల్వ ఐదు రోజుల నుండి 9రోజులకు పెరిగింది. నాన్ పవర్ సెక్టార్లు అయిన స్టీల్,సిమెంట్ ప్లాంట్లకు సరఫరా పెరగడం మరో కారణమైంది.

రైతులకు 'క్రాప్ లైఫ్' అవగాహన

గుంటూరు : ఓ వైపు అవగాహన లేమి, మరో వైపు వ్యక్తిగత భద్రత సామాగ్రి సమకూర్చుకునేందుకు వనరులు లేకపోవటంతో చిన్నకారు రైతులు పంటరక్షణ ఉత్పత్తుల నిర్వహణలో అరక్షిత విధానాలను అనుసరించటంతో వీరి భద్రత ఆందోళన కల్గిస్తోందని ఏపీ వ్యవసాయశాఖ కమిషనర్ డాక్టర్ ఎం హరిజవహర్‌లాల్ అన్నారు. వ్యక్తిగత భద్రత సామాగ్రి, పంట రక్షణ ఉత్పత్తుల నిర్వహణపై క్రాప్‌లైఫ్ ఇండియా అనే సంస్థ ఇటీవల గుంటూరులో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి హరిజవహర్‌లాల్ మాట్లాడుతూ, భారత దేశంలో వ్యవసాయం విస్తృత స్థాయిలో జరుగుతోందని, అయితే, ప్రజలు, ప్రైవేటు రంగాల మధ్య పరస్పర సహకారంతో వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ అవగాహన కార్యక్రమంతో ప్రతిఏటా 4.5 లక్షల రైతులపై ప్రభావం చూపుతుందన్నారు. క్రాప్‌లైఫ్ ఇండియా సీఈవో బ్రిజ్ ఉబెరాయ్ మాట్లాడుతూ, కేవలం రైతుల్లో అవగాహన పెంచటమే కాకుండా పంట రక్షణ ఉత్పత్తుల్లో ఎదురయ్యే ప్రమాదాలను నివారిస్తుం దన్నారు. దీంతో రైతులు, రైతు కుంటుంబాలు సురక్షిత విధానాలను అలవ ర్చుకునే అవకాశం పెరుగుతుందన్నారు. పీపీఈ అవసరం, వినియోగంపై భరోసా కల్పించటమే కాకుండా క్రాప్ ప్రొటెక్షన్ ఉత్పత్తులను కొనుగోలు చేసిన ప్రతిసారి రైతులను పీపీఈ వినియోగంలో ప్రోత్సహిస్తామన్నారు. గుంటూరు, ఉభయగోదావరి, కర్నూలు, ప్రకాశం జిల్లాల్లో ఈ ప్రాజెక్టును చేపడుతున్నారు. ప్రతిజిల్లాలోనూ వ్యవసాయశాఖ, రైతు సంఘాలు, కిశాన్ యూనియన్లు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యు లవుతారు. గుంటూరు జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ విజయభారతి, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, స్పైసెస్ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పీఎస్ఎస్ థంపీ, నాబార్డు ఏజీఎం కేఆర్‌డీ కార్తిక్, పట్టిచెరుకూరు ఏవో జీ శ్రీనివాసరావు, క్రాప్‌లైఫ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు డాక్టర్ ఆండ్రూవార్డ్, డాక్టర్ కీత్ జోన్స్ పాల్గొన్నారు.

9శాతం పెరిగిన బంగారం డిమాండ్

ముంబై: 2018లో బంగారం డిమాండ్ 800 టన్నుల వరకు ఉండవచ్చునని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ (డబ్ల్యుజిసి) అంచనావేసింది. 2016లో ఇది 666.1 టన్నులు కాగా 2017లో అంతర్జాతీయంగా బంగారానికి డిమాండ్ 9శాతంతో 4072 టన్నులకు చేరింది. భారత్‌లో 2017లో బంగారం డిమాండ్ 727టన్నులు నమోదైంది.ఏదేమైనా సరాసరిన ఐదేళ్లలో చూసుకుంటే 810 టన్నులుగా ఉంది. అంటే కాస్త తక్కువగానే 727 టన్నులకు పరిమితమై నట్లు డబ్ల్యుజిసి మంగళవారం వెల్లడించింది. ఈ ఏడాది మాత్రం 700-800 టన్నుల మధ్యలో డిమాండ్ ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా నగల కొనుగోళ్లకు అత్యధికంగా మొగ్గు చూపినట్లు చెప్పారు.

అంతేగాక.. యాంటీ మనీ లాండరింగ్ రెగ్యులేషన్స్, మనీ లాండరింగ్ చట్టాల నుంచి బంగారాన్ని మినహాయించడం కూడా డిమాండ్ పెరగడానికి కలిసొచ్చిం దన్నారు. ఇది 10ఏళ్ల సరాసరి నమోదైన 840 టన్నులకంటే తక్కువేనని చెప్పవచ్చు. బంగారు ఆభరణాలపై తాజాగా విధించిన 10శాతం దిగుమతి సుంకం, 3శాతం జీఎస్‌టీతో చూసుకుంటే ఈ ఏడాది డిమాండ్ తగ్గవచ్చునని తెలుస్తోంది. డబ్ల్యుజిసి డైరెక్టర్ సోమ సుందరం మాట్లాడుతూ, ముగిసిన డిసెంబరు త్రైమాసికంలో బంగారం డిమాండ్ 2శాతం పెరిగి 249 టన్నులు నమోదైంది. గత రెండేళ్లతో చూసుకుంటే అత్యధికంగా నమోదైనట్లు తెలుస్తోంఇ. ధనతేరస్‌కు తగ్గిన బంగారం ధరలు, ఆర్థికంగా సానుకూల పవనాలు విని యోగదారు డిమాండ్‌ను పెంచేట్లుచేసాయి. 2017 సగభాగం నుంచి మనీ లాండరింగ్ చట్టం నుండి బంగారాన్ని మినహాయించడంతో బంగారం డిమాండ్ పెరిగింది. సరాసరిన బంగారం ధరలు మన దేశంలో 1శాతం తగ్గి 10 గ్రాములు రూ.28,985లు పలికింది. ముడి బంగారం దిగుమతులు 73శాతం పెరిగి 246 టన్నులు నమోదైంది. గతరెండేళ్లలో చూసుకుంటే ఇదే అత్యధికం.

ఆకట్టుకుంటున్న సిల్క్ కాటన్ వస్త్ర ప్రదర్శన

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: వస్త్ర ప్రపంచం ఒకే వేదికమీదకు వచ్చింది. వివిధ రాష్ట్రాల సంస్కృతిని ప్రతిబింబించే హస్తకళారూపాలు, చేనేతలు కొలువు దీరాయి. టీటీడీ కళ్యాణ మండపంలో వస్త్ర ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ నెల 2న ప్రారంభమైన ప్రదర్శనకు నగరం లోని పలు ప్రాంతాల నుంచి అన్ని వర్గాల ప్రజలు తరలివచ్చి కొనుగోలు చేస్తున్నారు. ఉదయం 10.30 నుంచి రాత్రి 8.30 వరకు కొనసాగే వస్త్ర ప్రదర్శనకు ప్రవేశం ఉచితం. ఈ వస్త్ర ప్రదర్శనలో ఉప్పాడ, కలంకారి, మంగళగిరి, వెంకటగిరి, పోచంపల్లి, చందేరి సిల్క్, రాజస్థాన్ కాటన్ చీరలు, హ్యాండ్ బ్లాక్ ప్రింట్, భాగల్పూర్ సిల్క్, బెంగాల్ కాటన్, కాశ్మీర్ సిల్క్ లక్నోచికన్, బనారస్, కాంతా వర్క్ డిజైన్ సూట్స్, టాప్స్, జైపూర్ బెడ్ షీట్లు, స్టోన్ జువెలరీ, కొండపల్లి బొమ్మల విక్రయాలు జరుగుతున్నాయి. మహిళలు తమకు నచ్చినా, మెచ్చినా చేనేత వస్త్రాలను కొనుగోలు చేస్తున్నారు. వివిధ రకాల వస్త్రాలపై రాయితీలు ఇస్తున్నట్లు నిర్వాహకులు అక్బర్ అలీ తెలిపారు.

అపరాల్లో పురుగులు..
నివారణ పద్ధతులు..






మినుము, పెసర సాగులో పురుగుల నివారణకు పాటించవలసిన యాజమాన్య పద్ధతులను అనుసరిస్తే ఆశించిన రీతిలో దిగుబడులు వస్తాయి. అపరాల్లో పురుగుల యాజమాన్య పద్ధతులపై శాస్త్రవేత్తల సూచనలు ఈ విధంగా ఉన్నాయి.

కాండాన్ని తొలిచే కాండపు ఈగ

దీని పిల్ల పురుగులు కాండం లోపలే ఉండి తొలచడం వలన ఆ ప్రాంతంలో కాండం ఉబ్బి ఉంటుంది. మొక్కల తలలు వాడిపోతాయి. మొక్కలు గిడసబారి ఎండిపోతాయి. దీని నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు లేదా ఎసిఫేట్ 1.0 గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ఆకులను తినే చిత్తపురుగులు

ఈ పురుగులు రాత్రివేళల్లో ఆకులను తిని నష్టపరుస్తాయి. దీనివలన ఆకులపై గుండ్రని రంధ్రాలు ఏర్పడతాయి. పైన తెలిపిన నివారణ మందులే దీనికి సరిపోతాయి.

వైరస్‌ను వ్యాపించే తామర పురుగులు

ఈ పురుగులు ఆకుల నుంచి రసాన్ని పీల్చడమేగాక ఆకుముడత అనే వైరస్ తెగులును వ్యాపింపజేస్తాయి. వీటి నివారణకు ఎసిఫేట్ ఒక గ్రాము లేదా పిప్రోనిల్ 1.0 మిల్లీలీటరు లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

సీతాఫలం తెగులును వ్యాపించే పేనుబంక

ఈ పురుగులు కూడా ఆకులు, కాయల నుంచి రసాన్ని పీల్చడమే గాక సీతాఫలం తెగులు అనే వైరస్ తెగులును వ్యాపింపజేస్తాయి. దీని నివారణకు ఎసిఫేట్ 1.0 గ్రాములు లేదా డైమిథోయేట్ 2.0 మిల్లీలీటర్లను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

దశలవారీగా ఆశించే మచ్చల పురుగు

ఈ పురుగు మొగ్గ, పూత, పిందె దశల్లో ఆశిస్తుంది. పూత, పిందెను గూడుగా చేసి లోపలి పదార్థాలను తింటుంది. పూతకు ముందు 5 శాతం వేపనూనె లేదా వేపగింజల కషాయాన్ని పిచికారీ చేయాలి. దీనివలన తల్లి పురుగులు పైరును ఆశించకుండా ఉంటాయి. గుడ్లు పెట్టకుండా నివారించవచ్చు. మొగ్గ దశలో పురుగును గమనించినట్లయితే ఎసిఫేట్ 1.0 గ్రాములు లేదా క్లోరీపైరిపాస్ 2.5 మిల్లీలీటర్లు లేదా సోరాల్యురాన్ 1.0 మిల్లీలీటర్లను లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. ఒకవేళ పురుగు గూడు కట్టుకున్నట్లయితే పై మందులతోపాటు డైక్లోరోవాన్ 1.0 మిల్లీలీటర్లను కలిపి పిచికారీ చేయాలి. పురుగు ఉధ్రుతి ఎక్కువగా ఉన్నపుడు మైనోసాడ్ 0.3 మిల్లీలీటర్లు లేదా ఎమామెక్టిన్ బెండోయేట్ 0.4 గ్రాములు లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 0.3 మిల్లీలీటర్లు లేదా ఫ్లూబెండి ఎమైడ్ 0.2 మిల్లీలీటర్లను లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.







తొలిదశలోనే పొగాకు లద్దెపురుగు

తొలిదశలో దీని లద్దెపురుగులు ఆకుల్లోని పత్రహరితాన్ని తినటం వలన ఆకులు జల్లెడగా మారతాయి. పెద్ద పురుగులు ఆకులు, పవ్వులు, పిందెలను కూడా పూర్తిగా తింటాయి. ఇవి రాత్రిపూట ఎక్కువగా సంచరిస్తుంటాయి.





సామూహిక నివారణే మార్గం

సామూహికంగా ఎలుకలను నివారించకపోతే పంట దిగుబడులు చేజారిపోతాయి. పంట చేలల్లో పందికొక్కు, చిన పందికొక్కు, పాలమెలుక, ఇంటెలుక, చిట్టెలుక జాజతులు వరిపైరుకు నష్టం కలిగిస్తాయి. చుట్టుప్రక్కలున్న 250 ఎకరాల్లో సామూహికంగా ఎలుకల మందు (బ్రొమోడయొలోన్)ను పొలాల్లో పెట్టాలి. అప్పుడే సామూహిక ఎలుకల నివారణ సాధ్యమవుతుంది. ఏ పొలానికి సంబంధించిన రైతు ఆ పొలంలో మాత్రమే మందును వాడితే పక్కనున్న చేలల్లోకి ఎలుకలు చొరబడే అవకాశాలున్నాయి. 96 పాళ్ల నూకలు, రెండు పాళ్ల నూనె, రెండు పాళ్లను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసే మందును పది గ్రాముల చొప్పున బొరియల్లో పెట్టాలి. రైతులు ఒకేసారి సామూహికంగా ఈ ప్రక్రియను నిర్వహించే విషయం మరచిపోకూడదు. ఈ ప్రక్రియతో ఎలుకలను పూర్తిస్థాయిలో తుదముట్టించవచ్చు. ఎలుకల బొరియల్లో ఊదర యంత్రాన్ని ఉపయోగించి, పొగ పెట్టే రైతులు కూడా ఉన్నారు. ఎలుకలకు సహజ శత్రువులైన పాములు, గుడ్లగూబలను రైతులు కాపాడుకోవలసిన అవసరం ఉంది. విచక్షణారహితంగా క్రిమిసంహారకాలు వాడితే సాగుచేసే చేలల్లో తిరిగే పాములు, గుడ్లగూబలు చనిపోయే అవకాశాలు ఉంటాయి. దీంతో శత్రువులు లేక ఎలుకల సంతతి అధికమైపోతుంది. కాబట్టి అవసరమైనపుడే క్రిమిసంహారకాలను వాడాలి.

రసాన్ని పీల్చే తెల్లదోమ

ఇవి ఆకులనుంచి రసాన్ని పీల్చడమే గాక పల్లాకు తెగులును కూడా వ్యాపింపజేస్తాయి. వీటి నివారణకు విత్తిన 15-20 రోజులకు 5 శాతం వేపనూనె లేదా వేపగింజల కషాయం పిచికారీ చేయాలి. తర్వాత అవసరాన్ని బట్టి మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు లేదా ఎసిఫేట్ 1.0 గ్రాములు లేదా ట్రైడోఫాస్ 1.5 మిల్లీలీటర్లు లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములకు లీటరు నీటిని చొప్పున కలిపి పిచికారీ చేయాలి. పసుపురంగు జిగురు పూసిన అట్టలు లేదా డబ్బాలను ఎకరానికి 4-5 చొప్పున ఏర్పాటు చేసుకుఇన ఈ పురుగుల ఉనికిని గమనించుకోవాలి.

ఎలుకల బెడద.. నివారణ మార్గాలు

వరిసాగులో రైతులు బుట్టలతో ఎలుకలను పట్టించడం, కలుగుల్లో పొగ పెట్టడం వంటి చర్యలను తీసుకున్నారు. అలా నూటికి 80 శాతం ఎలుకలను మాత్రమే నిర్మూలించగలిగారు. కొన్నిచోట్ల సామూహిక ఎలుకల నివారణ జరగక 20 శాతం ఎలుకలు తప్పించుకున్నాయి. ప్రస్తుతం అవి ఈనిక దశలో ఉన్నాయి. దీంతో రబీలో మినుము, పెసలు సాగవుతున్న ప్రాంతాల్లో ఎలుకల దాడి అధికంగా ఉందని ఆయా ప్రాంతాల రైతులు చెబుతున్నారు. ఎలుకల వలన మినుము, పెసరకు వచ్చే నష్టాలు, వాటి నివారణపై శాస్త్రవేత్తలు అందిస్తున్న సూచనలు ఈ విధంగా ఉన్నాయి.

ఎలుక ఒక ఈతకు 5-21 పిల్లలు

ఎలుకల సంతతి అనంతం. ఈతకు 5-21 పిల్లల వరకు ఎలుక ఈనుతుంది. రైతులంతా సామూహిక ఎలుకల నివారణ ప్రక్రియను ఆచరించకపోతే ఎలుకలను నిర్మూలించడం అసాధ్యం. ఎలుకలు 2-3 మాసాలకే యుక్తవయస్సును సంతరించుకుంటాయి. 4-8 రోజులలోపే ఎదకాలం ఉంటుంది. 20-30 రోజుల్లో గర్భధారణ జరుగుతుంది. అసలు ఎలుక ఆయువు 12-18 నెలలు ఉంటుంది. తక్కువ ఆయువు ప్రమాణమైనా ఎలుకలు తమ అసాధారణ పిండోత్పత్తితో గర్భం దాల్చేంతవరకూ తుదముట్టించకుండా ఉంటే దిగుబడులు పూర్తిగా పడిపోతాయి. ఒక జత ఎలుకలు అనుకూల పరిస్థితుల్లో ఉంటే ఏడాదికి 2 వేలు, మూడేళ్లకు 35 కోట్ల సంతతిగా ఆవిర్భవించే అవకాశాలు ఉన్నాయి.

మినుము, పెసరకు నష్టం

ప్రస్తుతం మినుము, పెసర చేలల్లో పైరు పలచగా ఉంటుంది. ఇది గుబురుగాను, దట్టంగా పెరిగే సమయానికి ఎలుకలు స్థావరాలు ఏర్పాటు చేసుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. గింజలు తయారయ్యాక వాటిని నాశనం చేసి, బొరియల్లోకి తీసుకెళ్తాయి. ఎకరాకు అరబస్తా వరకూ నష్టం వాటిల్లుతుంది.

ఇంటిలిజెంట్‌ను అందరూ ఎంజాయ్ చేస్తారు

లావణ్య త్రిపాఠి



సుప్రీం హీరో సాయిధరంతేజ్ హీరోగా సెన్సషనల్ డైరెక్టర్ వి.వి.వినాయక్ దర్శకత్వంలో సి కె ఎంటర్‌టైన్మెంట్స్ ప్రయివేట్ లిమిటెడ్ పతాకంపై సి.కళ్యాణ్ నిర్మించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం ఇంటిలిజెంట్.అందాల తార లావణ్య త్రిపాఠి హీరోయిన్‌గా నటించింది.నటసింహ బాలకృష్ణ రిలీజ్ చేసిన ఈ చిత్రం టీజర్‌కి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది.అలాగే యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ చిత్రంలోని పాటల్ని రిలీజ్ చేయడంతో సినిమాపై భారీ అంచనాలు వున్నాయి.అందరి అంచనాలకు రీచ్ అయ్యే విధంగా ఇంటిలిజెంట్ సినిమా రూపొందిందని టాక్ వినిపిస్తుంది. ఎస్ ఎస్ థమన్ సంగీతాన్ని అందించిన ఈ చిత్రం ఆడియో ఫిబ్రవరి నాలుగున రాజమండ్రి లో అశేష సినీ ప్రేక్షకాభిమానులు మధ్య అట్టహాసంగా జరిగిన సంగతి తెల్సిందే.సెన్సార్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం యుబైఏ సర్టిఫికెట్‌ని సాధించింది.ఫిబ్రవరి తొమ్మిదిన ఈ చిత్రం వరల్డ్ వైడ్‌గా హైయ్యెస్ట్ థియేటర్స్‌లలో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఫిబ్రవరి ఆరున సంస్థ కార్యాలయం లో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో హీరోయిన్ లావణ్య త్రిపాఠితో ఇంటిలిజెంట్ చిత్రవేశాలపై వివరాలు ఇవి.

ఈ చిత్రంలో మీ క్యారెక్టర్ ఎలా ఉంటుంది?

ఈ మూవీలో నేను సంధ్య క్యారెక్టర్‌లో నటించాను. యుఎస్‌లో చదువుకొని ఇండియాకి వచ్చి మా డాడీ బిజినెస్‌లు చూస్తుంటాను. చాలా కోపం ఎక్కువ ఎప్పుడూ అందరికన్నా డామినేట్‌గా ఉంటుంది. అలాంటి అమ్మాయి ప్రేమలో ఎలా పడింది అనేది సస్పెన్స్. క్యూట్ లవ్ స్టోరీ. యూత్ అందరికి బాగా కనెక్ట్ అవుతుంది.

సాయిధరంతేజ్‌తో వర్క్ చేయడం ఎలా అనిపించింది?

తేజ్ చాలా మంచి యాక్టర్‌తో పాటు మంచి డాన్సర్ కూడా. సెట్లో ఎప్పుడూ జోక్స్ వేస్తూ అందరిని నవ్విస్తుంటాడు. చాలా మంచి వ్యక్తి. మస్కట్‌లో షూటింగ్ అప్పుడు ఇద్దరం బాగా ఎంజాయ్ చేశాం. మా ఇద్దరి మధ్య మంచి కెమిస్ట్రీ వర్కవుట్ అయింది. లవ్ సీన్స్ అన్నీ చాలా ఫ్రెష్‌గా ఉంటాయి.

సినిమా మెయిన్ స్టోరీ ఏంటి?

కథ చాలా ఇంటిలిజెంట్‌గా ఉంటుంది. వెరీ టిపికల్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ మూవీ. ఒక సామాన్య వ్యక్తి తన తెలివితేటలతో సమాజానికి, పేద ప్రజలకి ఎలాంటి మేలు చేసాడు అనేది మెయిన్ కాన్సెప్ట్. ఇవే కాకుండా ఇంకా మూవీలో చాలా అంశాలు ఉంటాయి. ధర్మ క్యారెక్టర్‌లో తేజ్ చాలా పవర్‌ఫుల్‌గా కనిపిస్తాడు.

డ్యాన్స్ విషయంలో ఏమైనా ప్రాక్టీస్ చేశారా?

ఫస్ట్ టైం ఈ చిత్రంలో డ్యాన్సులు బాగా ప్రాక్టీస్ చేసి చేశాను. నా ఫేవరెట్ లెజండరీ యాక్టర్ చిరంజీవి గారి "చమక్ చమక్" సాంగ్‌ని తెలుగు ,హిందీలో చూశాను. ఆపాటని రీమిక్స్ చేయడం చాలా కష్టం. అయినా ఈ మూవీలో చేశాం. వెరీ బ్యూటిఫుల్ సాంగ్. సెల్‌ఫోన్, కళ కళ కళామందిర్, పాటలు మాస్ ప్రేక్షకులను బాగా అలరిస్తాయి. తేజ్‌తో డాన్స్ చేయడం బాగా ఎంజాయ్ చేశాను.

వి వి వినాయక్‌తో మీ వర్కింగ్ ఎక్స్‌పీరియన్స్?

వెరీ హంబుల్ అండ్ వెరీ స్వీట్ డైరెక్టర్.పెద్ద డైరెక్టర్ అయినా కూడా డౌన్ టు ఎర్త్‌గా వుంటారు. చాలా కంఫర్టబుల్‌గా సెట్లో వుంటారు. ఆయనకేం కావాలో క్లియర్‌గా తెల్సు. ఏ సీన్ అయినా చాలా ఫాస్ట్‌గా తీస్తారు. నటిగా అయన దగ్గర చాలా విషయాలు నేర్చుకున్నాను.

సినిమా హిట్ ఫ్లాప్‌లను మీరు ఎలా స్వీకరిస్తారు?

హిట్ ఫ్లాప్ అనేది కామన్. సక్సెస్‌ని ఎక్కువ ఎంజాయ్ చేస్తాం.. ఫెయిల్యూర్ వచ్చినప్పుడు తప్పు ఎక్కడ జరిగిందో చూసుకొంటాం. ఫీడ్ బ్యాక్ అనేది కచ్చితంగా తీసుకుంటాను. భలే భలే మగాడివోయ్.. సోగ్గాడే చిన్ని నాయనా సినిమాలు కమర్షియల్‌గా నాకు మంచి పేరు తెచ్చి పెట్టాయి. అలాగే ఇంటిలిజెంట్ కూడా మంచి పేరు తెస్తుందని ఆశిస్తున్నాను.

నెక్స్ట్ ఎలాంటి రోల్స్ చేయాలనుకుంటున్నారు?

డిఫరెంట్ డిఫరెంట్ క్యారెక్టర్స్ చేయాలనుకుంటాను. ఇప్పటి వరకు నేను చేసిన ప్రతి సినిమాలోనూ క్యారెక్టర్‌ని ఎంతో ఇష్టపడి చేశాను.

సి కె ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో చేయడం ఎలా అనిపించింది?

సి కళ్యాణ్ గారు వెరీ ఫ్యాషనేట్ ప్రొడ్యూసర్. ప్రతిరోజూ సెట్‌కి వచ్చి అందరికీ ఏం కావాలో అన్నీ దెగ్గరుండి చూసుకునేవారు. క్వాలిటీ విషయంలో ఎక్కడా కాంప్రమైజ్ అవకుండా ఈ చిత్రాన్ని బ్యూటిఫుల్‌గా నిర్మించారు. పాటలకి మాత్రమే కాకుండా ఫైట్స్‌కి కూడా భారీగా సెట్స్ వేసి తీశారు. అలాగే ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్ సీవీ రావు, పత్సా నాగరాజ్ ఇద్దరూ చాలా కోపరేట్ చేసి సినిమాని వండర్ ఫుల్‌గా చేశారు. సి.కె.లో మళ్ళీమళ్ళీ వర్క్ చేయాలని వుంది.

థమన్ మ్యూజిక్‌కి ఎలాంటి ఫీడ్ బ్యాక్ వస్తుంది..?

చాలా హ్యూజ్ రెస్పాన్స్ వస్తోంది. రాజమండ్రిలో ప్రీ రిలీజ్ ఫంక్షన్ చాలా గ్రాండ్‌గా జరిగింది. దాదాపు యాభై వేలమందికి పైగా హాజరయ్యారు. చాలా సంతోషంగా అన్పించింది. సాంగ్స్ అన్నీ చాలా పెద్ద హిట్ అయ్యాయి. థమన్ మ్యూజిక్ సినిమాకి చాలా ప్లస్ అవుతుంది.

మీ క్యారెక్టరికి డబ్బింగ్ చెప్పే ఆలోచన ఏమైనా ఉందా?

డెఫినెట్‌గా చెప్పాలని వుంది. ఇప్పుడిప్పుడే తెలుగు నేర్చుకుంటున్నాను.ఇంకా ఇంప్రూవ్ అయ్యాక డబ్బింగ్ చెప్తాను.

నెక్స్ట్ కమిట్ అయిన మూవీస్ ఏంటి?

గీత ఆర్ట్స్ విజయ్ దేవర కొండ మూవీ చేస్తున్నాను. పరశు రామ్ డైరెక్టర్. తమిళ్, మలయాళం నుండి కొన్ని ఆఫర్స్ వస్తున్నాయి. ఇంకా ఏది కమిట్ కాలేదు. నా ఫస్ట్ ప్రిఫరెన్స్ తెలుగుకే ఇస్తాను. హైదరాబాద్ అంటే నాకు చాలా ఇష్టం.

స్నేహితులుగా అల్లరి నరేష్, సునీల్



ప్రస్తుతం యువ కథానాయకుల్లో అల్లరి నరేష్‌కు కామెడీ హీరోగా చాలా మంచి పేరుంది. అయితే ఈ మధ్య కాలంలో నరేష్‌కు మంచి హిట్ లేదు. నరేష్ ఎన్ని ప్రయత్నాలు, ప్రయోగాలు చేసినా పెద్దగా వర్కవుట్ కాలేదు. అందుకనే తనకు నచ్చిన కామెడీ జోనర్‌లోనే సినిమా చేయడానికి నరేష్ సిద్ధమైపోయారు. అల్లరి నరేష్, సునీల్ ఇందులో ఫ్రెండ్స్‌గా నటించబోతున్నారు. ఈ సినిమాలో మా అబ్బాయి, రంగులరాట్నం హీరోయిన్ శుక్లను హీరోయిన్‌గా తీసుకున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ సినిమాను ఎ,కె.ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్ నిర్మిస్తుండగా భీమినేని శ్రీనివాసరావు సినిమాను తెరకెక్కిస్తున్నారు.

సాహో రిలీజ్ వచ్చే ఏడాదికే



ప్రభాస్ సినిమాపై ప్రస్తుతం వినిపిస్తున్న హాట్ గాసిప్ ఇది. సెట్స్‌పై ఉన్న ఈ సినిమా లెక్కప్రకారం ఈ ఏడాదిలోనే విడుదల కావాలి. సమ్మర్‌కు ఎలాగూ రాదు. కనీసం దసరా లేదా దీపావళికైనా వస్తుందని ఫ్యాన్స్ ఆశించారు. కానీ వాళ్లందరికీ బ్యాడ్ న్యూస్. సాహో సినిమా రిలీజ్ వచ్చే ఏడాదికి వాయిదాపడినట్టు తెలుస్తోంది. 2019 సంక్రాంతికి ఈ మూవీని విడుదల చేయాలని అనుకుంటున్నారట. షెడ్యూల్స్ ఆలస్యం కావడమే దీనికి కారణమని తెలుస్తోంది. సాహొా సినిమాకు సంబంధించి కీలకమైన దుబాయ్ షెడ్యూల్ ఇంకా పెండింగ్‌లో ఉంది. ఈనెలాఖరుకు అది స్టార్ట్ అవుతుంది. ఆ తర్వాత రొమేనియాలో మరో భారీ షెడ్యూల్ ఉంది. వీటితో పాటు పోస్ట్ ప్రొడక్షన్ వర్క్‌కు చాలా టైం కావాలి. అందుకే సినిమా వాయిదా పడినట్టు తెలుస్తోంది. యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ సినిమాలో శ్రద్ధాకపూర్ హీరోయిన్.

ఎన్వీఆర్ సినిమా అధినేత చేతికి కణం



ఛలో సినిమా హిట్ అవ్వడంతో, నాగశౌర్య నటించిన నెక్స్ట్ మూవీకి డిమాండ్ పెరిగింది. ఇందులో భాగంగా అతడు నటించిన కణం సినిమాకు తెలుగులో ఫ్యాన్సీ రేటు దక్కింది. నాగశౌర్య సాయిపల్లవి హీరోహీరోయిన్లుగా నటించిన సినిమా కణం. ఈ సినిమా తెలుగు థియేట్రికల్ రైట్స్‌ను ఎన్వీఆర్ సినిమా అధినేత ఎన్ వీ ప్రసాద్ దక్కించుకున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించి ఈ సినిమా కంప్లీట్ థియేట్రికల్ రైట్స్‌ను ప్రసాద్ దక్కించుకున్నారు. ఈ మేరకు నిర్మాణ సంస్థ లైకా ప్రకటన జారీచేసింది. ఓ ఫ్యాన్సీ రేటుకు కణం రైట్స్ అమ్మేశామని ప్రకటించిన లైకా, ఆ డీల్ విలువను మాత్రం బయటపెట్టలేదు. తాజాగా అందిన సమాచారం ప్రకారం.. కణం సినిమాకు సంబంధించి ఏపీ, నైజాం రైట్స్ 25 కోట్ల రూపాయలకు అమ్ముడుపోయినట్టు తెలుస్తోంది.

ఈ సినిమా శాటిలైట్ రైట్స్ డీల్ కూడా కంప్లీట్ అయింది. 2 కోట్ల రూపాయలకు జీ తెలుగు సంస్థ ఈ సినిమా శాటిలైట్ రైట్స్ దక్కించుకుంది.

అజిత్ నయనతార జంటగా



తమిళ హీరో అజిత్ ఇప్పుడు తెలుగు మార్కెట్‌పై కన్నేశాడు. వీరం, వేదాళం వివేకం సినిమాల తర్వాత మరోసారి దర్శకుడు శివ డైరెక్షన్‌లో సినిమా చేయబోతున్నారు. సత్యజ్యోతి ఫిలింస్ బ్యానర్ ఈ సినిమాను నిర్మించనుంది. సినిమా తమిళంలో నిర్మితమైనప్పటికీ తమిళం, తెలుగు భాషల్లో ఒకేసారి విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేసుకుంటున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో అజిత్ సరసన నయనతార హీరోయిన్‌గా నటించనుంది. నయనతార అజిత్‌తో కలిసి నటించబోయే నాలుగో సినిమా ఇదవుతుంది. ఈ విషయాన్ని చిత్ర యూనిట్ అధికారకంగా ప్రకటించింది. ఈ సినిమాకు విశ్వాసం అనే టైటిల్‌ను కన్‌ఫర్మ్ చేశారు.

రామ్ చరణ్ అన్నయ్యగా నవీన్ చంద్ర



మాస్ సినిమాల స్పెషలిస్ట్ బోయపాటి శ్రీను తాజాగా చేసిన 'జయ జానకి నాయక' మంచి విజయాన్నే సాధించింది. ఆ ప్రాజెక్ట్ తరువాత ఆయన తన నెక్స్ట్ ప్రాజెక్ట్‌ని రామ్ చరణ్‌తో చేస్తున్న సంగతి తెలిసిందే. మొదటి షెడ్యూల్ పూర్తి చేసుకున్న ఈ సినిమా ఫిబ్రవరి మూడో వారం నుండి కొత్త షెడ్యూల్‌ను ప్రారంభించనుంది. వివేక్ ఒబెరాయ్ ఈ సినిమాలో విలన్‌గా నటించబోతున్నాడు. హీరోయిన్ స్నేహ ఇందులో చరణ్‌కు వదినగా నటిస్తుండగా తమిళ హీరో ప్రశాంత్ చరణ్ అన్న పాత్రలో కనిపించబోతున్నాడు. తాజా సమాచారం మేరకు చరణ్‌కు మరో అన్నయ్య పాత్రలో యంగ్ హీరో నవీన్ చంద్ర నటించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తోన్న ఈ సినిమాలో కైరా అద్వాని హీరోయిన్‌గా నటిస్తోంది. డివివి దానయ్య ఈ మూవీని నిర్మిస్తున్నాడు.

శ్రీనగర్‌లో పోలీసులపై ఉగ్రదాడి



శ్రీనగర్ : లష్కరే తోయిబా తీవ్రవాదులు మంగళవారం శ్రీనగర్ లోని ఆసుపత్రి వద్ద పోలీసులపై కాల్పులకు తెగబడ్డారు. ఈ కాల్పుల్లో ఓ పోలీసు ప్రాణాలు కోల్పోగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారని, అతని పరిస్థితి విషమంగా ఉందని పోలీసు అధికారి ఒకరు తెలిపారు. 2014లో పట్టుబడ్డ ఎల్‌ఈటీ ఉగ్రవాది నవీద్ జట్ నిర్బంధంలో నుంచి తప్పించుకుపోయాడన్నారు. నవీద్ జట్ అలియాస్ అబు హన్జాలాను మంగళవారం నగరంలోని కాకా సరాయిలోని ఆసుపత్రికి తరలించిన సమయంలో ఈ దాడి జరిగినట్టు పోలీసులు వివరించారు. పోలీసు జవాన్ ఒకరు మరణించగా మరొకరు ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతున్నట్టు తెలిపారు. ఉగ్రవాదుల కోసం ఈ ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నట్టు వెల్లడించారు.

పాఠశాల స్వీపర్‌కు సన్మానం

నాగపట్టణం : విద్యార్థులను పెద్ద ప్రమాదం నుంచి తప్పించిన ప్రాథమిక పాఠశాల స్వీపర్ నాగమ్మాల్‌కు మంగళవారం కలెక్టర్ సన్మానం చేశారు. విద్యార్థులు తాగే నీటి ట్యాంకులో పంట తెగుళ్లను నివారించే క్రిమిసంహారక, ఎలుకలను నివారించే మందు కలిసిందని ఆమె పాఠశాల ఉపాధ్యాయులను అప్రమత్తం చేయడంతో పెద్ద ఉపద్రవం తప్పింది. నీళ్లు రంగుమారి, వాసన రావడాన్ని గుర్తించిన ఆమె ప్రధానోపాధ్యాయుడికి విషయం చేరవేయగా ఆయన పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకొని పురుగునివారణకు ఉపయోగించే క్లోరసిటనిలిడ్, ఎలుకల నివారణ మందును వాటర్ ట్యాంకు వద్ద స్వాధీనం చేసుకున్నారు. ఆ రోజు పాఠశాలకు సెలవు ప్రకటించి విద్యార్థులను ఇళ్లకు పంపి పెద్ద ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా విద్యార్థులు- తల్లిదండ్రుల అసోసియేషన్ ఆమెను అభినందించగా, విషయం తెలిసిన జిల్లా కలెక్టర్ సమయానికి ఉపద్రవాన్ని గుర్తించి పిల్లలను కాపాడినందుకు నాగమ్మాల్‌ను సన్మానించారు.

2017లో 822 మత ఘర్షణలు.. 111 మరణాలు

న్యూఢిల్లీ : గతేడాది దేశవ్యాప్తంగా మొత్తం 822 మతఘర్షణలు, హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయని, 111 మంది మృత్యువాత పడ్డారని కేంద్రం మంగళవారం లోక్‌సభకు తెలిపింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ అహిర్ మాట్లాడుతూ మత ఘర్షణలు ఎక్కువగా ఉత్తరప్రదేశ్‌లోనే నమోదైనట్టు తెలిపారు. యూపీలో 195 ఘటనలు చోటు చేసుకోగా 44 మంది చనిపోయారని, 542మంది గాయపడ్డారని చెప్పారు. కర్ణాటకలో 100 ఘటనలు చోటుచేసుకోగా తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారని, 229 మంది గాయపడ్డారని తెలిపారు. రాజస్థాన్‌లో 91 ఘటనల్లో 12 మంది చనిపోగా 175 మంది గాయపడ్డారని అహిర్ చెప్పారు. బీహార్‌లో 85 మతఘర్షణల్లో ముగ్గురు మరణించారని, 321 మందికి గాయాలయ్యాయన్నారు. మధ్యప్రదేశ్‌లో 60 ఘటనలు, తొమ్మిది మరణాలు సంభవించగా 191 మంది గాయపడ్డారని మంత్రి తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో 58 ఘటనలు చోటుచేసుకోగా తొమ్మిది మంది మృతిచెందారని, 230 మందికి గాయాలయ్యాయని చెప్పారు. గుజరాత్‌లో జరిగిన 50 మతఘర్షణల్లో ఎనిమిది మంది చనిపోగా 125 మంది గాయపడ్డారన్నారు. 2016లో మొత్తం 703 ఘటనలు చోటు చేసుకోగా 86 మంది మరణించారని, 2321 మంది గాయ పడ్డారని, 2015లో 751 ఘటనల్లో 97 మరణాలు సంభవించాయని, 2264 మందికి గాయాల య్యాయని అహిర్ వెల్లడించారు.

మా గొంతునొక్కుతున్నారు

రాజ్యసభను బహిష్కరించిన ప్రతిపక్షాలు



న్యూఢిల్లీ : మంద బలంతో ప్రభుత్వం తమ గొంతు నొక్కుతోందని విమర్శిస్తూ రాజ్యసభ కార్యక్రమాలను మంగళవారం మధ్యాహ్నం ప్రతిపక్షాలు బహిష్కరించాయి. సభ మధ్యాహ్నం భోజన విరామం తరువాత ప్రారంభం కాగానే కాంగ్రెస్‌తో సహా ప్రతిపక్షాలన్నీ సభా కార్యకలాపాలను బహిష్కరిస్తున్నట్టు ప్రకటించాయి. సీపీఐ, సీపీఐ(ఎం), టీఎంసీ, ఆప్, ఎన్సీపీ, డీఎంకే, సమాజ్ వాదీపార్టీ సభ్యులు సభాకార్యకలాపాలను బహిష్కరిస్తున్నట్టు తెలిపారు. ఉదయం రెండు సార్లు వాయిదాపడిన అనంతరం సభ మధ్యాహ్నం 3 గంటలకు తిరిగి ప్రారంభమైంది. ఆ వెంటనే పై పేర్కొన్న పార్టీల సభ్యులు సభను బహిష్కరిస్తున్నామని తెలిపారు. "సభ వెలుపల ప్రతిపక్షాల వాణిని నొక్కివేస్తున్నారు. సభలోపల కూడా ఇలా జరగాలని మేము కోరుకోవడం లేదు. అందుకనే ఉదయం నుంచి మేము సమస్యలు లేవనెత్తాలని కోరుకుంటున్నాం. కానీ, అనుమతించలేదు. అందుకని ఈ రోజు మొత్తానికి మేము సభాకార్యకలాపాలను బహిష్కరిస్తున్నాం" అని రాజ్యసభలో ప్రతిపక్ష నాయకులు గులాంనబీ ఆజాద్ విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు. గత రెండు రోజులుగా సభలో వివిధ పరిణామాలు చోటుచేసుకున్నాయని, జీరో అవర్‌లో అనేక సమస్యలు ప్రస్తావించాల్సి వుందని, కానీ అలా చేయలేకపోయామని చెప్పారు. ఎంపీలు ఈ అంశాలను లేవనెత్తేందుకు లేవగానే సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదావేశారని తెలిపారు. "గడిచిన రోజూ ఈ రోజు ఉదయం మధ్య జాతీయ స్థాయిలో ఏదైనా ప్రాముఖ్యత గల అంశం చోటుచేసుకుంటే దానిని సభలో ప్రస్తావించే నిబంధనను గత పాలకులు కల్పించారు. ఆ అంశాన్నే ప్రస్తావించాలని మేము అనుకున్నాం" అని ఆజాద్ తెలిపారు. "మేమేమీ ప్రశ్నోత్తరాల సమయం లేదా ప్రభుత్వ సమయంలో చొరబడాలని కోరుకోవడంలేదు. నిబంధనలు పాటించమనే మేము కోరుతున్నాం. దురదృష్టవశాత్, గడిచిన వారం రోజులుగా నిబంధనలను వినియోగించుకునేందుకు మమ్మల్ని అనుమతించడంలేదు" అని అన్నారు.

పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి సంబంధించిన అంశాలను ప్రస్తావించేందుకు తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) సభ్యులు ప్రయత్నించడంతో సభను మధ్యాహ్నం 2గంటల వరకు వాయిదావేశారు. సోమవారం కూడా ఇలానే జరిగింది. ఉత్తరప్రదేశ్‌లో పోలీసులు ఎన్‌కౌంటర్లకు పాల్పడుతున్నారని పేర్కొంటూ సమాజ్‌వాదీ పార్టీ సభ్యులు వెల్‌లోకి ప్రవేశించి నినాదాలు చేయడంతో సభను మధ్యాహ్నం 2గంటల వరకు వాయిదావేశారు. ఢిల్లీలో వాణిజ్య సంస్థలకు పరిమితి అంశాన్ని ప్రస్తావించేందుకు ఆప్ సభ్యులు కూడా వెల్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించారు.

మలయాళ కవి శ్రీకుమార్‌కు బెదిరింపులు

15 మంది ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ కార్యకర్తలపై కేసు
ఆరుగురి అరెస్టు : దర్యాప్తుకు సీఎం ఆదేశం



కొల్లాం : కేరళలోని కొల్లాం జిల్లాలో ప్రముఖ మలయాళ కవి కురీపూజ శ్రీకుమార్‌ని బెదిరించిన ఆర్‌ఎస్ఎస్ కార్యకర్తలు ఆరుగురిని అరెస్టు చేశారు. ఈ ఘటనపై క్షుణ్ణంగా దర్యాప్తు రిపించాలని ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) ఆదేశించింది. మళయాల కవి శ్రీకుమార్ సోమవారం రాత్రి కొట్టుక్కల్‌లో ఒక కార్యక్రమంలో ప్రసంగించి తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకున్నదని పోలీసులు తెలిపారు. ఆర్‌ఎస్ఎస్ కార్యకర్తలు ఆయనను అడ్డుకున్నారు. కారు నుంచి ఆయనను బయటకు దించి బెదిరించారని పోలీసులు చెప్పారు. కార్యక్రమంలో శ్రీకుమార్ ప్రసంగిస్తున్నప్పుడు కూడా హిందూత్వ శక్తులు ఆయనపై దాడికి దిగారు. కొచి సమీపంలోని వదయంపాడి వద్ద 'కుల గోడ' నిర్మాణానికి సంబంధించి ఆయన వైఖరి నచ్చని హిందూత్వ శక్తులు ఈ దాడికి పాల్పడ్డాయి. శ్రీకుమార్ చేసిన ఫిర్యాదు ఆధారంగా ఆర్‌ఎస్ఎస్ కార్యకర్తలపై పోలీసులు కేసునమోదు చేశారు. బెదిరింపునకు పాల్పడిన 15 మంది ఆర్‌ఎస్ఎస్ కార్యకర్తలపై కేసు నమోదు చేశామని, వారిలో ఆరుగురిని అరెస్టు చేశామని కొల్లాం రూరల్ పోలీసు సూపరింటెండెంట్ బి. అశోకన్ పీటీఐకి తెలిపారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కార్యాలయం పోలీసులను ఆదేశించింది. ఈ ఘటనపై సవివరమైన దర్యాప్తు ప్రారంభించారు. ఈ అంశం నేడు కేరళ అసెంబ్లీలో కూడా ప్రస్తావనకు వచ్చింది. సీపీఐ సభ్యులు ములకర రత్నాకరన్ ఈ అంశాన్ని లేవనెత్తారు. ముఖ్యమంత్రి పినరాయి విజయన్ సమాధానం ఇస్తూ, ఈ ఘటన వెనుక పంచాయితీ సభ్యులు దీపూ నేతృత్వంలోని 15 మంది ఆర్‌ఎస్ఎస్/బీజేపీ కార్యకర్తలు ఉన్నారని చెప్పారు. భారత నేరశిక్షాస్మృతి (ఐపీసీ)లోని వివిధ సెక్షన్ల క్రింద 15 మందిపై కేసు నమోదు చేశామని, ఇప్పటి వరకు ఆరుగురిని అరెస్టు చేశామని తెలిపారు.

చెత్తఏరుకునే వాళ్లం కాదు

కేంద్రంపై సుప్రీం ఆగ్రహం

ఘన వ్యర్థాల నిర్వహణపై అఫిడవిట్ తిరస్కరణ



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వంపై మంగళవారం అత్యున్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశవ్యాప్తంగా ఘన వ్యర్థాల నిర్వహణపై 845 పేజీల అఫిడవిట్‌ను సమర్పించినందుకు కేంద్రానికి సుప్రీంకోర్టు అక్షింతలు వేసింది. అరకొర సమాచారంతో భారీ అఫిడవిట్ దాఖలు చేయడాన్ని ప్రస్తావిస్తూ తాము చెత్త సేకరించేవారం కాదని తీవ్రస్థాయిలో మండిపడింది. కేంద్రం తమ ముందు చెత్త పడేసి చేతులు దులుపు కోవడాన్ని అంగీకరించబోమని, అఫిడవిట్‌ను స్వీకరించేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. ప్రభుత్వం చెత్తను మా ముందు పోయలేదు అని ఆగ్రహం వ్యక్తం చేసింది. "మీరు ఏం చేయాలని చూస్తున్నారు? మీరు మమ్మల్ని ప్రభావితం చేయాలని ప్రయత్నిస్తున్నారా..? మేం ప్రభావితం కాబోం.. మీరు ప్రతిదానిని మా ముందు పడేసేందుకు చూస్తున్నారు. ఆ అఫిడవిట్‌ను మేము స్వీకరించేది లేదు" అని జస్టిస్ మదన్ బీ లోకూర్, జస్టిస్ దీపక్ గుప్తాతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. మీ దగ్గరున్న చెత్తంతా ఇక్కడ పడేయడానికి మేం చెత్తను సేకరించేవారం కాదని మీకు కచ్చితంగా తేల్చి చెపుతున్నాం" అని ధర్మాసనం పేర్కొం ది. ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు 2016 నిబంధనల ప్రకారం రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఘనవ్యర్థాల నిర్వహణకు అనుగుణంగా రాష్ట్ర స్థాయి సలహా బోర్డులను ఏర్పాటు చేశాయా, లేదా అనే వివరాలు తెలుపుతూ మూడు వారాల్లోగా ఓ చార్ట్‌ను సమర్పించాలని కేంద్రాన్ని ధర్మాసనం ఆదేశించింది. వ్యర్థాల నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో డెంగ్యూ, చికున్‌గున్యా వంటి విషజ్వరాలు ప్రబలి పెద్దసంఖ్యలో మరణాలు సంభవిస్తున్నాయని గతంలో సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో సలహా బోర్డులను ఏ తేదీన ఏర్పాటు చేశారు, సభ్యుల పేర్లు, బోర్డు సమావేశమైనదా? అన్న వివరాలను కూడా తెలపాలని ధర్మాసనం పేర్కొంది. 22 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి బోర్డులను ఏర్పాటు చేసినట్టు తమకు సమాచారం వచ్చిందని ధర్మాసనం ముందు హాజరైన ప్రభుత్వ న్యాయవాది తెలిపారు.

విజయం ఖాయం : మాణిక్ సర్కార్

బీజేపీ బూటకపు ప్రచారాలను త్రిపుర ఓటర్లు పట్టించుకోరు ...



అగర్తల: త్రిపురలో పాగా వేసేందుకు బీజేపీ సంకుచిత రాజకీయాలు చేస్తోందని, డబ్బు మూటలతో గెలుపు దక్కించుకోవాలని ప్రయత్నిస్తోందని త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ ఆరోపించారు. ఫిబ్రవరి 18న జరిగే రాష్ట్ర శాసన సభ ఎన్నికల ప్రచారాలను బీజేపీ తరపున కేంద్ర హోమ్ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ రెండు రోజులుగా ఉధృతంగా సాగిస్తున్నారు. ఈ సందర్భంలో ఆయన అవాస్తవాలు చెప్పి త్రిపుర ఓటర్లను ప్రభావితం చేస్తున్నట్టు మాణిక్ సర్కార్ ఒక పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆరోపించారు.

బీజేపీ ఎన్ని ఎత్తుగడలు వేసినా వామపక్ష ప్రభుత్వం గెలవడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తంచేసారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో ఎలాంటి అసంతృప్తి లేదని ఆయన గుర్తుచేసారు. అందువల్ల తమ గెలుపు ఖాయమన్నారు. బీజేపీ సవాలు గురించి ప్రశ్నించగా - మా ఓటు బ్యాంకు బలంగా ఉంది, ఇంతవరకు కాంగ్రెస్‌కు ఉన్న స్థానాన్ని మాత్రమే బీజేపీ దక్కించుకోగలుగుతోంది, అందుకు కాంగ్రెస్‌లోని అవకాశవాదులే కారణం. వారు గోడ దూకేందుకు, ఆ రకంగా తమ పార్టీకి నష్టం కలిగించేందుకు సిద్ధపడుతున్నారు - అని సర్కార్ విశ్లేషించారు. ఇక తమ పార్టీకి, ఆర్‌ఎస్‌ఎస్-బీజేపీకి మధ్య ఉన్న పోటీ వ్యక్తిగత పోరు కాదని, రెండు పార్టీల సిద్ధాంతాల మధ్య పోరాటమని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ ప్రచారాలపై స్పందిస్తూ ... అగర్తలలో అవాస్తవాలు వల్లె వేశారని ఆరోపించారు. నాయకులు అబద్ధాలు చెప్పకూడదని హితవు చెబుతూ, అవినీతి పాలన అంటున్నారు,

మా అకౌంట్లను తనిఖీ చేస్తున్నారు, అయినా భయం లేదు. ఎందుకంటే మా అకౌంట్లు పారదర్శకం, నిజాయితీకి ప్రతిరూపం, మాకు కేంద్రం నుంచి దయాదాక్షిణ్యంగా నిధులు రావటం లేదు అని సర్కార్ సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో పాదం పెట్టడానికి బీజేపీ ఇండిజినస్ పీపుల్స్ ఫ్రంట్‌తో చేతులు కలిపింది. ఈ అంశంపై మాట్లాడుతూ, వాళ్లు త్రిపురను ముక్కలు చేయాలను కుంటున్నారు, ఆ విషయం బీజేపీ గుర్తించటం లేదా అని ఎదురు ప్రశ్నించారు. రాష్ట్రంలో అశాంతి రగిలించడమే వాళ్ల ఉద్దేశంలా కనిపిస్తున్నది అని ఆయన విమర్శించారు. త్రిపురలో రాజకీయ హత్యలు పెరుగుతున్నాయన్న ఆరోపణ పూర్తిగా అసత్యం అని సర్కార్ తెలిపారు. జాతీయ క్రైం రికార్డ్స్ బ్యూరో నివేదిక చూస్తే ఈ విషయంలో నిజానిజాలు తెలుస్తాయని ఆయన అన్నారు. తీవ్రవాదాన్ని నియంత్రించగలిగాం, నేరాలు తగ్గు ముఖం పట్టాయి అని ఆయన చెప్పారు. గెలుపు కోసం బీజేపీ కోట్లలో డబ్బు కుమ్మరిస్తోంది. 2014 సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీ దాదాపు రూ. 15వేల కోట్లు ఖర్చుచేసిందని పత్రికల్లోనే వచ్చింది కదా! ఆ వార్తలను కాదనలేదు. అంటే అంగీకరించినట్టే అని వ్యాఖ్యానించారు. పేదల కోసం వాళ్లు చేసిందేమీ లేదు. కార్పొరేట్లకు దోచిపెట్టడమే వారి విధానం అని ఆయన విమర్శించారు. 69 ఏండ్ల వయసులో కూడా ఉత్సాహంగా ఉండటానికి కారణం అడిగినప్పుడు రోజూ యోగా చేయడం ఇంకా ఇతర వ్యాయామాలు చేయడమేనని ఆయన అన్నారు.




వివాదంలో 'మణికర్ణిక'

షూటింగ్ నిలిపివేయాలి : సర్వ బ్రాహ్మిణ్ మహాసభ డిమాండు
చరిత్ర వక్రీకరణ ఆరోపణలు అవాస్తవం : నిర్మాత జైన్
వివాదాస్పద అంశాలు లేవు : చిత్రబృందం

జైపూర్ : చరిత్రను ఆధారంగా తెరకెక్కే మరో బాలివుడ్ చిత్రం వివాదాల్లో చిక్కుకుంది. పీరియాడిక్ చిత్రాలను రాజస్థాన్‌లో వివాదాలు చుట్టుముడుతున్నాయి. నిన్న పద్మావత్‌పై నేడు మణికర్ణికపై రభస మొదలైంది. ప్రముఖ నటి కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'మణికర్ణిక : ది క్వీన్ ఆఫ్ ఝాన్సీ' చిత్రంపై సర్వ బ్రాహ్మిణ్ మహాసభ అభ్యంతరం వ్యక్తంచేస్తోంది. షూటింగ్‌ను వెంటనే నిలిపివేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండు చేస్తోంది. ఈ చిత్రంలో రాణి లక్ష్మిబాయి ఈస్ట్ ఇండియా కంపెనీ నేపథ్య బ్రిటిష్ ఏజెంట్‌తో ప్రేమాయణం సాగించిన పాటను చిత్రీకరించినట్టు అభియోగిస్తోంది. 'రాణిలక్ష్మిబాయికి బ్రిటిష్ ఏజెంటుకు మధ్య ప్రేమగీతాన్ని చిత్రీకరిస్తున్నట్టు తెలిసింది. ఈ చిత్రాన్ని జయశ్రీ మిశ్రా రచించిన వివాదాస్పద పుస్తకం 'రాణి' ఆధారంగా తెరకెక్కిస్తున్నట్టు అనుమానిస్తున్నాం' అని మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ మిశ్రా అన్నారు. చరిత్రను వక్రీకరించినట్టు రుజువైనా, దీనిపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైనా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అయితే ఈ చిత్రంలో ఎలాంటి వివాదాస్పద సన్నివేశాలుగానీ గీతాలుగానీ లేవనిచిత్రనిర్మాతలు భరోసా ఇస్తేనే షూటింగ్ జరగనిస్తామన్నారు. ఈ విషయంలో గవర్నర్, హోంమంత్రిని కలుస్తామని, తమ డిమాండ్లపై మూడ్రోజుల్లోగా ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలను తీవ్రతరం చేస్తామన్నారు. ఈ చిత్రానికి సంబంధించి ఏయే రచయితలు, చరిత్రకారులను సంప్రదించినది వెల్లడించాలని కోరుతూ చిత్ర దర్శకనిర్మాతలకు జనవరి 9న లేఖ రాసినట్టు తెలిపారు. దీనిపై నిర్మాత జైన్ స్పందిస్తూ ఈ చిత్రంలో వివాదాస్పద సన్నివేశాలుగానీ, ప్రేమగీతాలుగానీ లేవని చెప్పారు. దేశం కోసం పోరాడిన వీరనారి గురించి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం చాలా బాధను కలిగిస్తున్నాయని, రాణిలక్ష్మిబాయి వీరగాథను తెరకెక్కిస్తు న్నామని అన్నారు. తమకు మహాసభ నుంచి ఎలాంటి లేఖ అందలేదని చెప్పారు. ఈ చిత్రంలో ఏం చూపిస్తున్నామో మాకు తెలుసు కాబట్టి ఎలాంటి భయం లేదు' అని జైన్ అన్నారు. పలు వివాదాల్లో చిక్కుకున్న పద్మావత్ చిత్రం ఇటీవల విడుదలైన విషయం విదితమే.

ఆధార్ లేనందున పరీక్షలకు అనుమతించని ప్రభుత్వం

వెయ్యిమంది నేపాల్ విద్యార్థుల భవితవ్యం ప్రశ్నార్థకం



లక్నో : మదరసాలో చదువుతున్న నేపాలీ విద్యార్థులకు ఆధార్ లేనందున ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం పరీక్షలు రాసేందుకు నిరాకరించింది. దీంతో 1,000 మంది విద్యార్థులు తమ భవితవ్యంపై ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఆధార్‌ను తప్పనిసరి చేస్తూ నిర్ణయం తీసుకుందని మదరసా ఉపాధ్యాయ సంఘం మంగళవారం వెల్లడించింది. ఈ విషయంపై , మదరసా శిక్షా బోర్డుకు లేఖ రాశామని సంఘం వెల్లడించింది. ఈ పరీక్ష దరఖాస్తులో ఆధార్‌నెంబరును పూరించక పోవడంతో మున్షి, మౌల్వీ, ఆలిమ్, కామిల్, ఫాజిల్ పరీక్షలను రాసేందుకు విద్యార్థులకు అవకాశం లేకుండా పోతోందని అరేబియా టీచర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దివాన్ సాహబ్ జమన్ ఖాన్ వెల్లడించారు. నేపాలీ విద్యార్థులు వారి జనన, పౌర ధృవపత్రాలను పొందుపరచడంతో ఇక్కడ సీట్లు లభించాయని, ఫిబ్రవరి 10లోగా పరీక్షా దరఖాస్తులు నింపాల్సి ఉందన్నారు. దీనిపై స్పందించిన ఉప ముఖ్యమంత్రి దినేష్ శర్మ మాట్లాడుతూ ఈ విషయం తమ వద్దకు రాలేదని, ఇలాంటి పరిస్థితులు తలెత్తితే ఆశాఖతో చర్చించి చట్టప్రకారం నిర్ణయం వెలువరిస్తామన్నారు. ఉత్తరప్రదేశ్ మదరసా ఎడ్యుకేషన్ బోర్డు (యూపీఎంఈబీ) రిజిస్ట్రార్ రాహుల్‌గుప్తా ఈ విషయంపై మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వ ఉత్తర్వుల కోసం ఎదురు చూస్తున్నామన్నారు.

రాష్ట్రపతిని కలసిన చిలీ ప్రతినిధులు

న్యూఢిల్లీ : రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను చిలీ పార్లమెంటు ప్రతినిధులు మంగళవారం కలిశారు. ప్రతినిధుల బృందానికి చిలీ చాంబర్ ఆఫ్ డిప్యూటీస్ ఫిడేల్ ఎస్పీనోజా నేతృత్వం వహించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చిలీ ఇస్తున్న మద్దతును కోవింద్ శ్లాఘించారు. ఈ రెండు దేశాల పార్లమెంటు సభ్యులు తరచూ చర్చలు జరుపుతూ ద్వైపాక్షిక సంబంధాలు బలపడటానికి దోహదపడుతున్నారన్నారు. అంతర్జాతీయ సోలార్ కూటమిలో చిలీ సంతకం చేయడంపై కోవింద్ ఆనందం వ్యక్తం చేశారు.

ఎంసీఐ తొలగింపునకు వ్యతిరేకించిన డాక్టర్లు

న్యూఢిల్లీ : మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ)కు బదులుగా కేంద్రప్రభుత్వం నేషనల్ మెడికల్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయటాన్ని దేశవ్యాప్తంగా డాక్టర్లు వ్యతిరేకి స్తున్నారు. ఈ క్రమంలో ఢిల్లీ ఎయిమ్స్, సఫ్దర్‌జంగ్ హాస్పిటల్, చండీఘర్, అలీఘర్ ముస్లిం వర్సిటీలతో సహా అనేక వైద్య విద్యా సంస్థలు నిరసన ధర్నాలు చేపట్టాయి. ఎయిమ్స్ నుంచి పార్లమెంట్ హవుస్ వరకు చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో 10 వేల మంది డాక్టర్లు పాల్గొన్నారు. ఈ బిల్లుతో వైద్య వృత్తి బ్యూరాక్రసీల చేతుల్లోకి వెళుతుందన్నారు.

తల్లీ ,కూతురు సజీవ దహనం

అమృతసర్ : మధ్య వయస్సుగల తల్లి పాతికేళ్ల కూతురు వారి ఇంట్లోనే అను మానాస్పద పరిస్థితుల్లో సజీవ దహనమయ్యారు. అగంతకులు వీరిని తగుల బెట్టి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. వేర్వేరు గదుల్లో దహనమైన వారిద్దరి మృతదేహాలు నగ్నంగా పడి ఉన్నాయన్నారు. బాధితుల ఇరుగు పొరుగువారు చెప్పినదాని ప్రకారం వారింట్లో నుంచి మంటలు వెలరేగడంతో పోలీసులకు ఫోన్ చేశామన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వెల్లడించారు.

చత్తీస్‌ఘడ్‌లో పేలుడు

రాయ్‌పూర్ : మావోయిస్టులు ఐఈడీని పేల్చడంతో ముగ్గురు చత్తీస్‌ఘడ్ జవాన్లు గాయాలపాలైయ్యారు. నక్సలైట్ల కోసం గాలింపు చర్యలు చేపట్టి తిరిగి వెళుతుండగా ఈ ఘటన జరిగిందని బీజాపూర్ పోలీసులు వెల్లడించారు. జవాన్లు పెట్రోలింగ్ జరిపి అడవి నుంచి కొద్దిమీటర్ల దూరం వెళ్లగానే ఈ పేలుడు పదార్థాలను పేల్చారని, గాయపడిన జవాన్లంతా 9వ బెటాలియన్‌కు చెందిన వారన్నారు. స్థానిక ఆసుపత్రిలో వారికి ప్రథమ చికిత్స జరిపారని, వారి పరిస్థితి నిలకడగా ఉందని డాక్టర్లు తెలిపారు.

యూపీలో భారీగా మద్యం బాక్సులు స్వాధీనం

ముజఫర్‌నగర్ : ఉత్తరప్రదేశ్‌లోని షామ్లీ జిల్లా కైరానా రోడ్డులో 402కు పైగా మద్యం బాక్సులను స్వాధీనం చేసుకున్నట్టు సీనియర్ అధికారి మంగళ వారం తెలిపారు. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు చెప్పారు. సోమవారం సాయంత్రం తనిఖీలో హర్యానా నుంచి మద్యం డబ్బాలను తరలిస్తుండగా పట్టుబడినట్టు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

జమ్మూలో 515 చొరబాటు కేసులు

న్యూఢిల్లీ : జమ్మూ, కాశ్మీర్‌లోని సరిహద్దుల్లో 2017లో మొత్తం 515 చొరబాటు కేసులు నమోదయ్యాయని, 75 మంది ఉగ్రవాదులు హతమైనట్టు లోక్‌సభలో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిరణ్‌రిజ్జూ మంగళవారం వెల్లడించారు. వీటి వివరాలపై అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ, 2016లో 454 కేసులు నమోదవ్వగా, 45 మంది ఉగ్రవాదులు హతమైనట్టు చెప్పారు.2015లో మొత్తం 223 చొరబాటు కేసులు నమోదవ్వగా 64 మంది ఉగ్రవాదులు హతమైనట్టు తెలిపారు.

బస్సు చార్జీల పెంపుపై అఖిలపక్ష సమావేశం

న్యూఢిల్లీ : తమిళనాడులో బస్సు చార్జీల పెంపుపై ప్రతిపక్ష డీఎంకే మంగళవారం అఖిలపక్ష సమావేశం ఏర్పాటుచేసింది. ఈ సమావేశంలో ఈ నెల 13న రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు జరపాలని పిలుపునిచ్చింది. చార్జీల పెంపు నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండు చేసింది. డీఎంకే వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంకే స్టాలిన్ ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. కాంగ్రెస్, ఐయూఎంఎల్, ఎండీఎంకే, వామపక్ష పార్టీలు సమావేశంలో పాల్గొన్నాయి.

ఏడుగురు దోషులు, 10 మంది నిర్దోషులు

న్యూఢిల్లీ : ఉత్తరాఖండ్ పోలీసులు జరిపిన నకిలీ ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు పోలీసులను ఢిల్లీ హైకోర్టు దోషులుగా ప్రకటిస్తూ మరో 10 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. 2009 జూలై 3న జరిగిన ఎంబీఏ విద్యార్థిని రణబీర్ సింగ్ (22)నకిలీ ఎన్‌కౌంటర్‌లో జస్టిస్ ఎస్ మురళీధర్, ఐఎస్ మెహతాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఏడుగురిని దోషులుగా పేర్కొంటూ తీర్పు వెలువరిస్తూ జీవితకాల శిక్ష విధించింది. అప్పటి రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ డెహ్రాడూన్ సందర్శిస్తున్న నేపథ్యంలో పోలీసులు భద్రతా విధులు నిర్వహిస్తుండగా, ఘజియాబాద్‌కు చెందిన రణబీర్ సింగ్ మరో ఇద్దరితో డెహ్రాడూన్ వెళ్లి, దోపిడీకి పాల్పడి, పోలీసు నుంచి సర్వీస్ రివాల్వర్ లాక్కున్నాడని అందుకే అతన్ని ఎన్‌కౌంటర్ చేయవలసి వచ్చిందని పోలీసులు కోర్టుకు తెలిపారు.

సమస్య పరిష్కరిస్తారా..లేదంటే మతం మారుతా..!

ముజఫర్‌నగర్ : కబ్జాదారుల నుంచి తన భూమిని అధికారులు విడిపించలేకపోతే తాను ముస్లిం మతంలో చేరిపోతానని బెదిరిస్తూ ఓ దళితుడు ఉత్తర్‌ప్రదేశ్‌లోని జిల్లా మెజిస్ట్రేట్ కార్యాలయం ముందు బైఠాయించాడని పోలీసులు మంగళ వారం తెలిపారు. కడక గ్రామానికి చెందిన సురేష్‌కుమార్ తన భూమిని కొంతమంది ఆక్రమించుకున్నారని వాపోయాడు. ఆయన తన సమస్యను వివరిస్తూ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు కూడా మెమొరాండం సమర్పించాడని తెలిపారు.

జర్మనీ వర్సిటీతో ఎస్ఆర్ఎంసీ ఒప్పందం

న్యూఢిల్లీ : విద్య, పరిశోధనలను సంయుక్తంగా నిర్వహించేందుకు జర్మనీ యూనివర్సిటీ హాన్నోవర్‌తో చెన్నైలోని శ్రీ రామచంద్ర మెడికల్ కళాశాల, పరిశోధనా విద్యాసంస్థ (ఎస్ఆర్ఎంసీ) ఒప్పందం చేసుకుంది. హాన్నోవర్ వర్సిటీ ప్రతినిధి డాక్టర్ గెర్హెర్ట్ ఫోర్ట్‌వెంగల్, తమ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ డా.పీపీ విజయరాఘవన్‌లు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి పత్రాలను ఇరువురూ మార్చుకున్నట్టు ఎస్ఆర్ఎంసీ ఒక ప్రకటన విడుదల చేసింది.

జమ్మూ శాసనమండలిలో రభస

న్యూఢిల్లీ : జమ్మూ, కాశ్మీర్‌లోని వివిధ ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగుల నియామకాల్లో పారదర్శకత కొరవడిదంటూ ప్రతిపక్ష నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ), కాంగ్రెస్‌లు మంగళవారం శాసనమండలి నుంచి వాకౌట్ చేశాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశాయి. బీజేపీ ఎమ్మెల్సీ విబోధ్ గుప్తా కూడా ప్రతిపక్షంతో చేరి నిరసన తెలిపారు. ఉద్యోగాల భర్తీల్లో వివక్షపై బదులివ్వాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

ఆర్ఎస్ఎస్ గుప్పెట్లో అసోం చీఫ్ సెక్రటరీ, డీజీపీ

గువహతి : అసోం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీకే పైపర్సేనియా, డీజీపీ ముఖేష్ సహాయ్ పూర్తిగా ఆర్ఎస్ఎస్ ఆధీనంలో ఉన్నారని ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి తరుణ్ గొగోయ్ ఆరోపించారు. మంగళవారం ఆయన శాసనసభ ఆవరణలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, పైపర్సేనియా, డీజీపీ, మరికొందరు ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారని, వీరిద్దరూ పూర్తిగా ఆర్ఎస్ఎస్ గుప్పెట్లో ఉన్నారని అన్నారు. ఇది వాస్తవం కాకపోతే పైపర్సేనియా ఎందుకు ఆర్ఎస్ఎస్ వాళ్లను కలుస్తుంటారని ప్రశ్నించారు.

శరణార్థుల కోసం మెరుగైన ఒప్పందం చేసుకోవాలి

న్యూఢిల్లీ : త్రిపురలో శరణార్థ శిబిరాల్లో ఆశ్రయం పొందుతున్న వారి సమస్యల పరిష్కారానికి కేంద్రం మెరుగైన ఒప్పందం చేసుకోవాలని మిజోరాం బ్రూ డిస్‌ప్లేస్డ్ పీపుల్స్ ఫోరం (ఎంబీడీపీఎఫ్) ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు మెమొరాండం సమర్పించింది. శనివారం జిల్లా మెజిస్ట్రేట్ సరదిన్సూ ద్వారా మెమొరాండం సమర్పించినట్టు ఎంబీడీపీఎఫ్ జనరల్ సెక్రటరీ బ్రూనో మషా విలేకరులకు తెలిపారు. 1997లో మిజోరాం నుంచి వచ్చిన బ్రూ తెగకు చెందిన వేలాదిమంది శరణార్థ శిబిరాల్లో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నట్టు పేర్కొన్నారు.



తేనె పూసిన కత్తిలాంటిది కేంద్ర బడ్జెట్

విశాలాంధ్ర-గుంటూరు సిటీ : కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ తేనె పూసిన కత్తిలాంటిదని అఖిలభారత విప్లవ రైతు సంఘం (ఏఐకేకేఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌సింగ్‌ఠాకూర్ అన్నారు. ఏఐకేకేఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో పాల్గొనేందుకు గుంటూరు విచ్చేసిన ఆయన మంగళవారం ఓ హోటల్‌లో విలేకరులతో మాట్లాడారు. బడ్జెట్‌లో ఆంధ్రాకు జరిగిన అన్యాయంపై చంద్రబాబునాయుడు వైఖరి చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా ఉందన్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు ఉత్పత్తి ఖర్చుపై 50 శాతం కలిపి కనీస ధరలు నిర్ణయం చేస్తామని బడ్జెట్‌లో కేవలం ప్రకటన చేయడం ఎన్నికల ఎత్తుగడ మాత్రమేనన్నారు. శ్రామిక ప్రజానీకమంతా ఏకమై ఈ దళారీల రాజ్యాన్ని కూలదోసి కార్మిక, కర్షక రాజ్య స్థాపనకు దీక్ష బూనాలన్నారు. అందుకు రైతాంగాన్ని సమాయత్తం చేస్తున్నట్లు వెల్లడించారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ, ఏపీలో చంద్రబాబునాయుడు, బెంగాల్లో మమతా బెనర్జీ ప్రభుత్వాలు విదేశీ బడా పెట్టుబడి సేవక విధానాలు అనుసరిస్తూ రైతాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారన్నారు. కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్‌లో మార్చి 12, 13 తేదీల్లో జరగబోయే ఏఐకేకేఎస్ 4వ అఖిల భారత మహాసభలో ప్రజలకు ముప్పు తెచ్చిపెడుతున్న అన్ని అంశాలను సమగ్రంగా చర్చించి ఐక్య రైతాంగ ఉద్యమ నిర్మాణ విధివిధానాలను రూపకల్పన చేస్తామన్నారు. ఈ మహాసభకు అనేక ఉద్యమశీల రైతాంగ సంఘాల ప్రతినిధులను ఆహ్వానించామని, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో ప్రతినిధులు హాజరవుతున్నట్టు చెప్పారు. సమావేశంలో ఏఐకేకేఎస్ ఉపాధ్యక్షుడు పూజారావు, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధనేకుల రంగనాథ్, మన్నవ సోమయ్య, మన్నవ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కోసం

12న కలెక్టరేట్ల వద్ద సామూహిక దీక్షలు



విశాలాంధ్ర-గుంటూరు రూరల్ : దేశ జనాభాలో 55 శాతం, రాష్ట్ర జనాభాలో 58 శాతంపైగా ఉన్న వెనుకబడ్డ తరగతులకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ కోసం ఈ నెల 12వ తేదీ సోమవారం రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద సామూహిక దీక్షలు, ధర్నాలు చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కేశన శంకరరావు తెలిపారు. నేటికీ చట్టసభల్లో బీసీల ప్రాతినిధ్యం 14 శాతం దాటకపోవడం దారుణమన్నారు. గుంటూరు రైలుపేటలోని బీసీ సంక్షేమ సంఘ నగర కార్యాలయంలో మంగళవారం బీసీ కులాల సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు దాటిపోతున్నా మెజార్టీ జనాభా అయిన బీసీలకు రాజ్యాధికారం దక్కకపోవడం, కేవలం మూడు నుంచి 10 శాతం లోపు ఉన్న అగ్రవర్ణాలు మాత్రమే పాలన చేయడం అన్యాయమన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీల ప్రాతినిధ్యం తొమ్మిది శాతం, ఉన్నత న్యాయస్థానాల్లో ఆరు శాతం దాటలేదన్నారు. బీసీల పార్టీ అని చెప్పుకుంటున్న తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రధాని మోడీని కలిసి పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టేలా చొరవ చూపాలన్నారు. పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టి చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్, పంచాయితీరాజ్ సంస్థల్లో 34 నుంచి 50 శాతానికి రిజర్వేషన్ పెంపు తదితర సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర సెక్రటరీ జనరల్ అంగిరేకుల ఆదిశేషు, రాష్ట్ర యువజన సంక్షేమ సంఘం అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్, జిల్లా ఉపాధ్యక్షులు పిన్నెబోయిన సుబ్బారావు, నగర అధ్యక్షులు విన్నకోట వెంకటేశ్వర్లు, క్రిష్ణ బలిజ సంఘం జాతీయ అధ్యక్షులు శివరాఘవయ్య, భట్రాజుల సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ కాసుల కృష్ణంరాజు పాల్గొన్నారు.

బూట్ పాలిష్ చేస్తూ గిరిజన నేతల నిరసన

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చాలనే పోరాటానికి తాను మద్దతు తెలుపుతున్నట్టు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పేర్కొనడం దారుణమని ఆంధ్రప్రదేశ్ గిరిజన హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు మాదిగాని గుర్నాథం అన్నారు. పవన్ వ్యాఖ్యలకు నిరసనగా గుర్నాథం నేతృత్వంలో మంగళవారం విజయవాడ రైల్వేస్టేషన్ వద్ద ప్రయాణికులకు, బౌద్ధమత ప్రచారకులకు బూట్ పాలిష్ చేశారు. ఈ సందర్భంగా గుర్నాథం మాట్లాడుతూ కులంలేని రాజకీయాలు కావాలన్న పవన్ రిజర్వేషన్లలో ఎందుకు తల దూర్చుతున్నారన్నారు. అటవీ ప్రాంతాల్లో నాగరికతకు దూరంగా జీవిస్తున్న గిరిజన తెగలకు అన్యాయం చేయాలని కుట్రలు చేయడం అన్యాయమన్నారు. అధికార పార్టీకి బినామీగా ప్యాకేజీల పవన్‌గా ఇప్పటికే పేరును సార్థకం చేసుకున్నావని ఎద్దేవా చేశారు. రాజకీయ స్వార్థం కోసం తమకు అన్యాయం చేస్తే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. తన వ్యాఖ్యలు ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. నిరసనలో రాష్ట్ర గిరిజన హక్కుల పరిరక్షణ సమితి ఉపాధ్యక్షులు మేడా రమేష్, పేరం సత్యం, కో-ఆర్డినేటర్ కుంభా రవివర్మ, కుంభా ఉదయ్, గిరిజన సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు పాలకీర్తి రవి తదితరులు పాల్గొన్నారు.



'పోలవరం' కూలీల ఆకలి కేకలు

- 4 నెలలుగా జీతాలు చెల్లించని ట్రాన్స్‌ట్రాయ్
- ఆందోళనలో ఆరు రాష్ట్రాల కూలీలు
- కూలి డబ్బు ఇవ్వకపోగా కక్షసాధింపు చర్యలు
- స్వగ్రామాలకు వెళ్లిపోయిన 1200 మంది
- పనులు నిలిపివేసి నిరసన తెలిపిన కూలీలు



విశాలాంధ్ర - పోలవరం : పోలవరం ప్రాజెక్టు పనుల కోసం వచ్చిన ఇతర రాష్ట్రాల కూలీల ఆకలికేకలు మిన్నంటుతున్నాయి. వందలాది కిలో మీటర్ల నుంచి పొట్ట చేత్తో పట్టుకుని కనీస భాష కూడా తెలియని ప్రాంతానికి వచ్చిన కార్మికుల జీవితాలతో గుత్తేదారులు ఆటలాడుకుంటున్నారని గగ్గోలు పెడుతున్నారు. ట్రాన్స్‌ట్రాయ్ కంపెనీ నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో రెండు వేల మందిలో సగానికి పైగా కూలీలు వెనక్కి వెళ్లిపోయారని వాపోతున్నారు. మిగిలిన 600 మంది కూలీలు తమకు జీతం బకాయిలు ఇవ్వకపోయినా రవాణా చార్జీలు ఇస్తే స్వగ్రామాలకు వెళ్లిపోతామంటూ మంగళవారం ప్రాజెక్టు పనులను నిలిపివేసి నిరసన తెలిపారు. పోలవరం ప్రాజెక్టులో ప్రధాన నిర్మాణ సంస్థ ట్రాన్స్‌ట్రాయ్ కంపెనీలో పనుల కోసం ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, బీహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి రెండు వేల మంది వరకు వచ్చినట్టు సమాచారం. ప్రాజెక్టులో కాంక్రీట్, రాడ్ బెండింగ్, క్లీనింగ్ పనుల కోసం తీసుకొచ్చారు. గత నాలుగు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో వీరిలో సుమారు 1200 మంది స్వస్థలాలకు వెళ్లిపోయారు. మిగిలిన 600 మంది చార్జీ డబ్బులు కూడా లేక ఉండిపోయినట్టు తెలుస్తోంది. రోజువారీ ఖర్చులకు డబ్బు లేక ఆకలితో అలమటిస్తున్నట్టు సమాచారం. చేతిలో చిల్లిగవ్వ కూడా లేకపోవడంతో చంటి పిల్లలతో అష్టకష్టాలు పడుతున్నామని కుమిలిపోతున్నారు. జీతాలు అడిగినందుకు మాపై కక్షపూరితంగా తమ తాత్కాలిక నివాస షెడ్‌లకు విద్యుత్, తాగునీటి సరఫరా నిలిపివేశారని వాపోతున్నారు. పస్తులతో కటిక చీకట్లో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని కాలం వెళ్లదీస్తున్నామంటున్నారు. జీతాల కోసం నిరసనలకు దిగితే అక్రమ కేసులు బనాయిస్తామని గుత్తేదారులు బెదిరింపులకు దిగుతున్నారని ఆందోళన చెందుతున్నారు. మంగళవారం నిరసన తెలుపుతున్న కార్మికుల వద్దకు వచ్చిన పోలవరం ఎస్‌ఐ కె. శ్రీహరిరావు ప్రాజెక్టు ప్రాంతంలో ధర్నాలు, నిరసన చేయకూడదని, అలా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. జీతాల సమస్యను యాజమాన్యంతో చర్చించి పరిష్కరించుకోవాలని సర్దిచెప్పడంతో కార్మికులు నిరసన విరమించారు.



ప్రతి బీసీ విద్యార్థికీ హాస్టల్ సీటు

విశాలాంధ్ర - చిత్తూరు : రాష్ట్రంలో బీసీ వసతి గృహాల్లో చేరేందుకు వచ్చే ప్రతి విద్యార్థికి సీటు మంజూరు చేయాలని ఏపీ శాసనసభ బీసీ సంక్షేమ కమిటీ ఛైర్మన్ జి.తిప్పేస్వామి అన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన కమిటీ సభ్యులు మంగళవారం చిత్తూరు కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో బీసీ ప్రతినిధులు, సంఘాల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. తొలుత జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తిప్పేస్వామి మాట్లాడుతూ గత మూడేళ్ళలో బీసీ సంక్షేమానికి సబ్‌ప్లాన్ ద్వారా పెద్దఎత్తున నిధులు మంజూరు అయ్యాయన్నారు. రూ.వెయ్యికోట్లతో త్వరలో ఆదరణ పథకం-2 ద్వారా కులవృత్తుల వారికి నాణ్యమైన పనిముట్లు పంపిణీ చేస్తామన్నారు. కమిటీ సభ్యులు రాజసింహులు, గోవిందసత్యనారాయణ, జయరాం, విశ్వేశ్వరరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏజేసీ చంద్రమౌళి, బీసీ సంక్షేమశాఖ డీడీ శ్రీధర్‌రెడ్డి, కార్పొరేషన్ ఈడీ మురళీధరమూర్తి పాల్గొన్నారు. అనంతరం నగరంలోని పీవీకేఎన్ కళాశాల ఆవరణలో 96 సెంట్లలో రూ.5 కోట్ల ఖర్చుతో నిర్మించనున్న బీసీ భవన్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు.

పోరాటాలతోనే హైకోర్టు సాధించుకుందాం

రాయలసీమ హైకోర్టు సాధన సమితి రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల పిలుపు



విశాలాంధ్ర- అనంతపురం అర్బన్ : రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు, ప్రజా ప్రతినిధులు, నేతలు, న్యాయవాదులు బలమైన పోరాటాలతో రాయలసీమకు హైకోర్టును సాధించుకుందామని వక్తలు పిలుపునిచ్చారు. రాయలసీమ హైకోర్టు సాధన సమితి ఆధ్వర్యంలో మంగళవారం అనంతపురం ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు డి.జగదీష్, వి. రాంభూపాల్, వైఎస్ ఆర్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నదీమ్ అహ్మద్, మాజీ మేయర్ రాగే పరశురామ్, కదలిక ఎడిటర్ ఇమామ్, కాంగ్రెస్ నాయకులు కేవీ రమణ, రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జయరాం, ఆర్పీఎస్‌ఎస్ నాయకులు నాగరాజు, ఇతర ప్రజా సంఘాల నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు. రాజధాని అమరా వతి అభివృద్ధిపైనే కేంద్రీకరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన రాయలసీమకు తీవ్ర అన్యాయం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇలాగే హైదరాబాద్‌ను మాత్రమే అభివృద్ధి చేయడంతో రాష్ట్ర విభజనతో ఏపీ ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్నారు. మళ్లీ ఇప్పుడు కూడా అదే తరహాలో అభివృద్ధి అంతా అమరావతికే పరిమితం చేస్తుంటే రాయలసీమ ప్రజాప్రతినిధులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. సీమ అత్యంత వెనుకబడిన ప్రాంతమని, నిత్యం కరవు కాటకాలతో అల్లాడుతున్న ప్రజల ఉపాధిపై దృష్టి పెట్టాల్సిన తక్షణ అవసరం ఉందన్నారు. రాష్ట్రం లో అభివృద్ధి వికేంద్రీకరణ జరిగేలా పాలకులపై సమష్టి పోరాటాలతో ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించారు. రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు సీమవాసుల దీర్ఘకాలిక ఆకాంక్ష అన్నారు. హైకోర్టు నెలకొల్పే వరకు ఉద్యమాన్ని కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో హైకోర్టు సాధన సమితి సభ్యులు రామ్‌కుమార్, ఐదుకల్లు రవీంద్రనాథ్, అబ్దుల్ రసూల్, వేణు, జె.రాజారెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అమీన, పద్మావతి, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు మీసాల రంగన్న, శివారెడ్డి, కాంగ్రెస్ నాయకులు దాదాగాంధీ, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు నరేష్, జాన్సన్, మనోహర్, ఏఐటీయూసీ నాయకులు రాజేష్‌గౌడ్, వి.క్రిష్టుడు, సామాజిక కార్యకర్త జాకీర్ హుసేన్, ఐద్వా నాయకురాలు సావిత్రి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.



ప్రధానికి మానవత్వం లేదు

విశాలాంధ్ర - తిరుపతి : ప్రధాని మోడీకి అసలు మానవత్వం లేదని, కొన్ని రాష్ట్రాలకు అధికంగా నిధులు కేటాయించి మరికొన్ని రాష్ట్రాలను గాలికొదిలేయడం దారుణమని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్మన్ నన్నపనేని రాజకుమారి అన్నారు. ఇప్పటికైనా ప్రధాని తన తప్పు తెలుసుకుని ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే మరోసారి ఆంధ్రప్రదేశ్‌కు అవసరమైన నిధులు కేటాయించేలా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో మంగళవారం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి తీరని అన్యాయం జరిగిందన్నారు. మహిళా అభ్యున్నతికి నిధులు కేటాయించమని కేంద్రాన్ని కోరినా ఫలితం లేకుండా పోయిందన్నారు. చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరుకు చెందిన రాజేష్ - శైలజ వ్యవహారంపై విలేకరుల అడిగిన ప్రశ్నలకు ఆమె స్పందిస్తూ తప్పంతా రాజేష్‌దేనని గతంలో తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానన్నారు. రాజేష్ నపుంసకుడు కాదని రిపోర్ట్ రావడం, బెయిల్ కూడా వచ్చిందంటూ మీడియా ప్రతినిధులు లేవనెత్తగా తీవ్ర ఆగ్రహంతో రాజేష్‌కు బెయిల్ లభించినా కఠిన శిక్ష పడుతుందన్నారు. తన భార్య పట్ల అత్యంత హేయంగా ప్రవర్తిస్తూ దారుణంగా కొట్టిన రాజేష్‌ను నడిరోడ్డుపైనే శిక్ష విధించాలన్నారు. మహిళలు, యువతులు బయటకు వెళ్ళేటప్పుడు ఆయుధాలు వెంట తీసుకుని వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

మూడు టన్నుల ఎర్రచందనం పట్టివేత

విశాలాంధ్ర - గంట్యాడ : విజయనగరం జిల్లా గంట్యాడ మండలం రామవరం గ్రామంలో మూడు టన్నుల ఎర్రచందనాన్ని అటవీశాఖ సిబ్బంది పట్టుకున్నారు. గోడౌన్‌లో ఎర్రచందనం నిల్వ చేసినట్టు సమాచారం టాస్క్‌ఫోర్స్‌కు తెలియడంతో సోమవారం అర్ధరాత్రి విజయనగరం అటవీశాఖ సిబ్బంది గ్రామంలోని రామకృష్ణరాజు ఇంట్లో ఆకస్మిక తనిఖీ చేశారు. మూడు టన్నుల ఎర్రచందనాన్ని గుర్తించారు. దీని విలువ రూ.30 లక్షలకు పైగా ఉంటుందని డీఎఫ్‌వో లక్ష్మణరావు తెలిపారు. రామకృష్ణరాజు అందుబాటులో లేకపోవడంతో తమ్ముడు సత్యరాజవర్మ నుంచి వివరాలు తెలుసుకున్నారు. గోడౌన్‌ను బుద్ధరాజు నన్యాసి సునీల్ వర్మరాజుకు అద్దెకు ఇచ్చినట్టు సత్యరాజ్‌వర్మ పేర్కొన్నారు. దాడుల్లో రేంజర్ రాజుబాబు, డిప్యూటీ రేంజర్ కారు రామారావు పాల్గొన్నారు.

సుద్దగనిలో కార్మికుడు దుర్మరణం

విశాలాంధ్ర - ద్వారకాతిరుమల : పశ్చిమ గోదావరి జిల్లా ద్వారకాతిరుమల బాల్‌క్లే మైన్ (సుద్దగని)లో మంగళవారం కార్మికుడు జేసీబీ కిందపడి ప్రాణాలు కోల్పోయాడు. ద్వారకాతిరుమలలోని ఈస్ట్‌కోస్ట్ మినరల్స్‌లో కొన్నేళ్లుగా మృతుడు తాడేపల్లి వెంకటేశ్వరరావు (50) పనిచేస్తున్నాడు. మంగళవారం సాయంకాలం సుద్దగనిలో జేసీబీ వద్ద పనిచేస్తుండగా ముందుభాగంలోని బకెట్ అతివేగంగా ఢీకొనడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందారు. బాల్‌క్లేమైన్లలో కార్మికుల రక్షణకు కనీస నిబంధనలు పాటించడం లేదని ఆందోళన వ్యక్తమవుతున్నా అధికారులు స్పందించడం లేదనే విమర్శ ఉంది. ద్వారకాతిరుమల ఎస్సై వీర్రాజు ఘటనాస్థలిని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టానికి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఎస్సీ కార్పొరేషన్ సమీక్షలో గందరగోళం

- దూసుకొచ్చిన ఎంఆర్పీఎస్ నేతలు
- రాష్ట్ర మంత్రి ఆనంద్‌బాబుతో వాగ్వాదం
- ఉలిక్కిపడ్డ అధికారయంత్రాంగం




విశాలాంధ్రబ్యూరో-గుంటూరు : గుంటూరులోని ఓ హోటల్‌లో మంగళవారం రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల సమావేశంలో గందరగోళం నెలకొంది. పదమూడు జిల్లాల అధికారులతోపాటు డైరెక్టర్లు పాల్గొన్న సమావేశ హాలులోకి ఒక్కసారిగా నవ్యాంధ్ర మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు పరిశపోగు శ్రీనివాసరావు కార్యకర్తలతో కలిసి చొచ్చుకురావడంతో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. ఎస్సీ కార్పొరేషన్ పథకాల కేటాయింపులలో మాదిగలకు అన్యాయం తీరని అన్యాయం చేస్తున్నారంటూ నినాదాలు చేశారు. కేవలం మాల కులస్తులకు మాత్రమే పథకాలను పంపిణీ చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని మాదిగలకు జనాభా ప్రాతిపదికన పథకాలు కేటాయించాలని నేతలు డిమాండ్ చేయడంతో సమావేశం రసాభాసగా మారింది. ఈ సమయంలో మంత్రి నక్కా ఆనంద్ బాబు, పరిశపోగు శ్రీనివాసరావుకు మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. ప్రభుత్వం నుంచి ఎలాంటి వివక్షత లేకుండా మాల, మాదిగలకు పథకాలు మంజూరు చేస్తున్నామని మంత్రి ఆనంద్ బాబు వివరణ ఇచ్చారు. ఎస్సీ కార్పొరేషన్ ఇన్నోవా కార్లను ఎక్కువ మాలలకే కేటాయించారని, భూపంపిణీలోనూ మాదిగలను పక్కన పెట్టేలా కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. కొద్దిసేపటికి ఆందోళన విరమించడంతో సమావేశం కొనసాగించారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ ప్రిన్సిపల్ కార్య దర్శి ఎస్.ఎస్.రావత్ మాట్లాడుతూ ఎస్సీల అభి వృద్ధికి అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో సద్వినియోగం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత మూడు సంవత్స రాల్లో పథకాల పంపిణీలో పురోగతిపై 13 జిల్లాల ఈడీలతో సమీక్ష నిర్వహించారు. ఎస్సీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ విజయకుమార్ పాల్గొన్నారు.

ప్రతి జిల్లాలో అంబేద్కర్ స్కిల్ అండ్ ట్రైనింగ్ అకాడమీ

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అంబేద్కర్ స్కిల్ అండ్ ట్రైనింగ్ అకాడమీ ఏర్పాటు చేయనున్నట్టు మంత్రి ఆనంద్‌బాబు అన్నారు. సమీక్ష సమావేశం అనంతరం ఎస్సీ లబ్ధిదారులకు రూ.50.23 కోట్ల విలువైన యూనిట్లను పంపిణీ చేశారు. ఆనంద్‌బాబు మాట్లాడుతూ ప్రతి దళిత కుటుంబం నెలకు రూ.10 వేలు సంపాదించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తుం దన్నారు. ఈ ఏడాది రూ.2,034 కోట్ల మేర రుణాలు ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందించామన్నారు.

దళారులు దోచేస్తున్నారు

- నెల్లూరు జిల్లాలో ధాన్యం ధరలు ఢమాల్
- 75 కేజీల బస్తా రూ.900, రూ.950 మధ్యే
- జాడలేని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు
- ఆదుకోవాలంటూ అన్నదాతల విన్నపాలు



విశాలాంధ్రబ్యూరో-నెల్లూరు : కరవు వెంటాడుతున్న నెల్లూరు జిల్లాలో అన్నదాతలు నిలువుదోపిడీకి గురవుతున్నారు. కరవు తీవ్రతను ఎదురీది నాలుగు గింజలు పండించిన రైతుకు చుక్కలు చూపెడుతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల జాడ లేకపోవడంతో దళారుల ఇష్టారాజ్యంగా మారింది. సోమశిల జలాశయం ఆయకట్టు మినహా మిగిలిన ప్రాంతాల్లో బోర్లు, బావుల ఆధారంగా పంటలు సాగుచేశారు. అధిక పెట్టుబడులతో వరి సాగు చేశారు. తీరా దిగుబడి చేతికొచ్చి విక్రయించే సమయానికి దళారుల రంగప్రవేశంతో ధాన్యం ధరను అమాంతంగా తగ్గించడంతో రైతులు కుమిలిపోతున్నారు. జిల్లాలో దొరవారిసత్రం, సూళ్లూరుపేట, వెంకటగిరి, ఆత్మకూరు, దక్కిలి, నెల్లూరు రూరల్ ప్రాంతాల్లో వరి కోతలు మొదలైనా ఈ ఏడాది నేటికీ జిల్లాలో ఎక్కడా ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు. సాగు సమయంలో బ్యాంకుల్లో రుణాలు మంజూరు కాకపోవడంతో రైతులు వడ్డీ వ్యాపారస్తులను ఆశ్రయించారు. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పెట్టుబడులతో ధాన్యం పండించారు. ప్రస్తుతం ధాన్యం అమ్ముకునేందుకు సిద్ధం కావడంతో నాణ్యత లోపం, మొగ్గుకాటా, పచ్చలు అంటూ అంత గిట్టుబాటు ధర లేదని తగ్గించేస్తున్నారు. ప్రస్తుతం 75 కిలోల బస్తా ధర రూ.900 పలుకుతోంది. ఏటా సీజన్‌లో బస్తా రూ. 1500 వరకు ధర ఉండేది. ఈ ఏడాది ఆ ధర ఉన్నప్పటికీ రైతులకు పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదనే చర్చ కొనసాగుతోంది. నాణ్యత లేదంటూ దళారులు బస్తా ధర రూ. 900 నుంచి రూ. 950 చెబుతున్నప్పటికీ చేసేదేమీ లేక తెగనమ్ముకుంటున్నారు. నెల్లూరు మసూరి ధాన్యం బస్తా ధర మాత్రం రూ.1200 పలుకుతోంది. తక్షణం ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడంతోపాటు మద్దతు ధరకు కొనుగోలుచేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రకృతే పెద్ద డాక్టర్... : వీరమాచనేని రామకృష్ణ

విశాలాంధ్ర అమరావతి : ప్రకృతే మనకు పెద్ద డాక్టర్ చాలా వ్యాధులను అది నయం చేస్తుందని వీరమాచినేని రామకృష్ణ తెలిపారు. ఇటీవల నూతన ఆహార విధానాలతో అనేక దీర్ఘకాలిక వ్యాధులను తగ్గిస్తున్న ఆయన సచివాలయ ఉద్యోగుల కోసం మంగళవారం ఉచిత ఆరోగ్య అవగాహనా సదస్సు నిర్వహించారు. పిండి పదార్థాలు, రిఫైన్డ్ ఆయిల్ ఆరోగ్యానికి చాలా హాని చేస్తా యని, వంటలకు కొబ్బరి నూనె, నెయ్యి, ఆలివ్ ఆయిల్, పెరుగుమీద మీగడ, వెన్న, ఛీజ్, సముద్రపు ఉప్పు వాడాలని చెప్పారు. ఈ మెనూతో లక్షల మంది ప్రయోజనం పొందారని, వారిలో డాక్టర్లు కూడా ఉన్నారన్నారు. సొంత ఖర్చులతో తిరుగుతూ అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఉచితంగా ప్రచారం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ విధానం ద్వారా ప్రకృతికి దగ్గరవుతామని, రోగా లకు దూరమవుతామన్నారు. యూట్యూబ్‌లో త్వరలో సొంత ఛానల్ ద్వారా ఈ విధానాన్ని తెలియజేస్తానని, అందరి అనుమానాలను నివృత్తి చేస్తానని వివరించారు. ఈ విధానంలో శాఖాహారులు, మాంసాహారులు ఇద్దరికీ అనుకూలమైన రీతిలో నాలుగు పిల్లర్స్‌గా ఈ ప్రోగ్రామ్‌ని రూపొందించినట్లు రామకృష్ణ వివరించారు. ఆహారంలో మార్పుల ద్వారా మధుమేహం, బీపీ, ఊబకాయం వంటి వ్యాధులను నయం చేయవచ్చని రామకృష్ణ చెప్పారు. ఆహారంలోనే మందులు ఉన్నాయని, మనం తినే ఆహారంలో మార్పు ద్వారా వీటిని నయం చేసుకోవచ్చని సూచించారు. 3 నెలల ఈ కార్యక్రమంలో అనేక వ్యాధులు నయమవుతాయని నిరూపణ అయిందన్నారు. ఊబకాయం ఉన్న వ్యక్తి శరీర బరువును బట్టి 10 నుంచి 40 రోజులల్లో బరువు తగ్గుతారని చెప్పారు. శరీర బరువు తగ్గగానే ఈ కార్యక్రమాన్ని నిలిపివేయచ్చని, ఆ తరువాత పిండిపదార్థాలు తగ్గించి సాధారణ ఆహారం తీసుకోవచ్చని తెలిపారు. మధుమేహం ఉన్నవారు మాత్రం మూడు నెలలు ఈ విధానాన్ని అనుసరించవలసి ఉంటుందని వివరించారు. ఉద్యోగులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధా నాలు చెప్పారు. ఇప్పటికే ఈ విధానాన్ని అనుసరిస్తున్నవారు తమకు ఒక్క రోజులోనే మధుమేహం తగ్గినట్లు రీడింగ్ వివరాలతో సహా తెలియచేస్తూ మూడు నెలల వరకు కొనసా గిస్తామని తెలుపగా, మరి కొందరు ఊబకాయం పది రోజుల్లో తగ్గినట్లు తెలిపారు. సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్య క్షుడు ఉప్పుటూరి మురళీ కృష్ణ, ఎస్బీఐ బ్రాంచ్ మేనేజర్ ఏసురత్నం పాల్గొన్నారు.

మరో 5 లక్షల ఇళ్లు

- పీపీపీ విధానంలో ఇళ్ల నిర్మాణం
- మూడు దశలు, మూడు కేటగిరీలు
- పీఎంఏవై - ఎన్‌టీఆర్ నగర్‌లుగా పేరు



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాలకు మరో ఐదు లక్షల ఇళ్లు మంజూరయ్యాయి. రూ.38,265.88 కోట్ల అంచనా వ్యయంతో 2019నాటికి ఐదు లక్షల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని కేంద్రం సూచించింది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) విధానంలో మూడు దశలలో మూడు కేటగిరీ ఇళ్లను నిర్మించేందుకు రాష్ట్రానికి కేంద్రం ఈ ప్రాజెక్టును మంజూరు చేసింది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) పథకంలో అందరికీ ఇళ్లు (హెచ్ఎఫ్ఏ) అనే పథకాన్ని కేంద్రం నాలుగేళ్ల క్రితం ప్రకటించింది. అందులో భాగంగానే పలు దశలలో రాష్ట్రానికి ఇళ్లను మంజూరు చేసింది. లబ్ధిదారుల వాటాతో పీఎంఏవై - ఎన్‌టీఆర్ నగర్ పేరుతో రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాలలో చేపట్టే ఈ ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతను ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ టౌన్‌షిప్ అండ్ మౌలిక వసదుల కల్పన సంస్థ (ఏపీటిడ్కో)కు అప్పగించింది. ఈ మేరకు మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి కరికాల వలవన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కేంద్ర, రాష్ట్రాల వాటా నిధులతోపాటు లబ్ధిదారులు తమ వంతు వాటాను భరించాల్సి ఉంటుంది. వర్టికల్ (నిలువుగా) నిర్మించే గృహ సముదాయంలో ఒక్కో లబ్ధిదారునికి ప్రభుత్వం రూ.1.50 లక్షల సబ్సిడీ ఇవ్వనుంది. మూడు దశలలో చేపట్టే ఈ ప్రాజెక్టులో 300 చదరపు అడుగులు, 365, 430 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇళ్లను నిర్మిస్తారు. ఇందుకోసం కేంద్రం రూ.7 వేల కోట్లను కేటాయిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.13, 035 కోట్లు ఇస్తుండగా లబ్ధిదారులు రూ.17,730 కోట్లను తమ వంతు వాటాను భరించాలని కేంద్రం విధి విధానాలను రూపొందించింది. రాష్ట్ర ప్రభుత్వ షేర్‌లో సబ్సిడీ కింద రూ.7,500 వేల కోట్లు, ఎన్‌టీఆర్ నగర్‌లలో మౌలిక సదుపాయల కల్పనకు రూ.4,500 కోట్లను, భూ సేకరణకు రూ.1,035 కోట్లను ఖర్చు చేయనుంది. గతంలో 69 పట్టణ స్థానిక సంస్థలకు కేంద్రం 2,43,162 ఇళ్లను మంజూరు చేసింది. జీ ప్లస్ 3, జీ ప్లస్ 5 విధానంలో ఇళ్లు నిర్మిందుకు కేంద్రం రూ.15,295.64 కేటాయించింది. తాజాగా సరసమైన గృహనిర్మాణ పథకం (ఏహెచ్‌పీ) కింద ఐదు లక్షల ఇళ్లను కేంద్రం మంజూరు చేసింది. 2014లో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చినపుడు ఈ పథకాన్ని ప్రకటించింది.

ఇళ్ల రకాలు, నిర్మాణ విస్తీర్ణం

కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఐదు లక్షల ఇళ్లను మూడు దశలలో మూడు విధానాలలో నిర్మించనున్నారు. మూడు రకాల ఇళ్లకు ప్రభుత్వం రూ.1.50 లక్షలను సబ్సిడీగా ఇస్తుంది. మొదటి దశలో 300 చదరపు అడుగుల విస్తీర్ణంలో లక్ష ఇళ్లను నిర్మిస్తారు. ఈ ఇళ్లకు లబ్ధిదారుడు తన వాటాగా రూ.2.65 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే రెండో దశలో 365 చదరపు అడుగుల విస్తీర్ణంలో 3.50 లక్షల ఇళ్లను నిర్మించనుండగా, లబ్ధిదారులు రూ.3.65 లక్షలు భరించాలి. అలాగే 430 చదరపు అడుగుల విస్తీర్ణంలో 50 వేల ఇళ్ల నిర్మాణాలను చేపట్టనున్నారు. ఇందుకు ప్రభుత్వ సబ్సిడీ రూ.1.50 లక్షలతోపాటు లబ్ధిదారుడు రూ.4.65 లక్షల వాటాని చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వమే భూమిని సేకరించి ఏజెన్సీకి అప్పగిస్తుంది. ఎక్కడైతే ఇళ్ల నిర్మాణం జరుగుతుందో దానికి పీఎంఏవై - ఎన్‌టీఆర్ నగర్‌లుగా నామకరణం చేయాలని కేంద్రం స్పష్టం చేసింది. లబ్ధిదారుని వాటాగా నిర్ణయించిన దానికంటే అదనంగా ఒక్క పైసాను కూడా చెల్లించాల్సిన అవసరంలేదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

786.18 ఎకరాల భూమి అవసరం

పీఎంఏవై - ఎన్‌టీఆర్ నగర్‌ల నిర్మాణానికి 786.18 ఎకరాల భూమి అవసరం ఉంటుందని ప్రభుత్వం అంచనా వేసింది. ఇళ్ల నిర్మాణానికి అనువైన భూమిని గుర్తించిన తర్వాత వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను సిద్ధం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎక్కడైనా ప్రభుత్వ భూమి అందుబాటులో లేకపోతే ప్రైవేటు భూములను కొనుగోలు చేయాలని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. అయితే రాష్ట్రంలో పేదల ఇళ్ల నిర్మాణాలకు భూమి అందుబాటులో లేకపోవటంతో ప్రైవేటు భూములను కొనుగోలు చేయాలని భావించిన ప్రభుత్వం, ప్రాజెక్టు వ్యయంలో రూ.1,035 కోట్లను భూ సేకరణకు కేటాయిం చింది. భూ సేకరణ విధానంలోగానీ, కొనుగోలు విధానంలోగానీ భూమిని సేకరించే వీలును ప్రభుత్వం కలెక్టర్లకే అప్పగించింది.

హామీల అమలుపై జైట్లీ హామీ

ఢిల్లీ : రాజ్యసభలో తెలుగుదేశం పార్టీ ఎంపీల ఆందోళనపై కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీ స్పందించారు. ఏపీ విభజన హామీల అమలుకు తాము కట్టుబడి ఉన్నామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు ఇప్పటికే ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించామన్నారు. ప్రత్యేక హోదాతో రావాల్సిన నిధులను ప్రత్యేక ప్యాకేజీ రూపంలో ఎలా ఇవ్వాలన్న దానిపై చర్చిస్తున్నామని తెలిపారు. విదేశీ ఆర్థిక సాయంతో చేపట్టే ప్రాజెక్ట్ (ఈఏపీ) నిధుల రూపంలో ఆ లోటును భర్తీ చేస్తామని చెప్పారు. ఈ నిధులకు సంబంధించి జనవరి 3న సీఎం చంద్రబాబు తమకు లేఖ రాశారని చెప్పారు. నాబార్డు ద్వారా ఆ నిధులు కేటాయించాలని సీఎం ఆ లేఖలో కోరారని జైట్లీ చెప్పారు. అయితే, ఈఏపీకి నాబార్డు ద్వారా నిధులు ఇవ్వాలంటే సమస్య ఎదురవుతోందని జైట్లీ అన్నారు. అలా ఇస్తే రాష్ట్ర రుణ సామర్థ్యం తగ్గుతుందని చెప్పారు. ప్రత్యామ్నాయ మార్గాల్లో ఆ నిధుల మంజూరు చేసే అంశంపై చర్చిస్తున్నామని వివరించారు. ఈ విషయమై చర్చించేందుకు ఏపీ ఆర్థిక శాఖ కార్యదర్శిని ఢిల్లీకి రావాలని పిలిచామని చెప్పారు. ఇప్పటికే ఏపీ రెవెన్యూ లోటు భర్తీకి రూ.3,900 కోట్లు చెల్లించామన్నారు. ఇక రైల్వే జోన్ విషయంలో అన్ని రాష్ట్రాలతో సంప్రదింపులు జరుపుతున్నామని రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్ చెప్పారు. జోన్ విషయంలో సానుకూల పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నామని వివరించారు. మరోవైపు లోక్‌సభలో ఏపీ ఎంపీల ఆందోళన కొనసాగుతోంది. తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేస్తున్నారు.



పోస్టల్ సమస్యలు పరిష్కరించాలి

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఓబులేసు డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : పోస్టల్ సిబ్బంది సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఎఐటీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి.ఓబులేసు డిమాండ్ చేశారు. గ్రామీణ పోస్టమాస్టర్‌లను టార్గెట్స్ పేరుతో సాగిస్తున్న వేధింపులను నిరసిస్తూ ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ ఆధ్వర్యాన మంగళవారం స్థానిక కృష్ణలంకలోని చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కార్యాలయం ఎదుట ఒకరోజు నిరాహారదీక్ష నిర్వహించారు. వీరి ఆందోళనకు ఓబులేసు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అతి తక్కువ వేతనాలతో అవినీతికి ఆస్కారం లేకుండా ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్న గ్రామీణ తపాలా ఉద్యోగులను టార్గెట్ల పేరుతో వేధించడం సరికాదన్నారు. అలాగే వీరి సమస్యల పరిష్కారంలో నెలల తరబడి తాత్సారం చేయడం తగదని, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో వారి ఆందోళనకు మద్దతుగా తాము కూడా ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బి.వి.రావు మాట్లాడుతూ ఈపీఎంలకు, సీఎస్సీల్లో పనిచేసిన జీడీఎస్‌లకు 2015 నుండి రావల్సిన ఎన్ఆర్ఈజీఎస్ ఇన్సెంటివ్స్‌ను వెంటనే చెల్లించాలని, పీఎల్ఐ, ఆర్‌పీఎల్ఐ ఇన్సెంటివ్ 2012 డీజీ ఆర్డర్స్ ప్రకారం ఆన్‌లైన్‌లో చెల్లించాలని, టార్గెట్స్ పేరుతో వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన ఛీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ యూనియన్ నేతలతో సంప్రదింపులు జరిపి, వారి డిమాండ్స్‌ను 15 రోజుల్లోగా పరిష్కరిస్తామని లిఖితపూర్వక హామీ ఇచ్చారు. ఈ ఆందోళన కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డి.రఘుబాబు, కోశాధికారి వి.వి.రామకృష్ణ, క్లాస్-3 యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌కే లాల్ వజీర్, విజయవాడ డివిజన్ నాయకులు బి.వెంకటేశ్వరరావు తదితరులు నాయకత్వం వహించారు. సీఐటీయూ నాయకులు శ్రీనివాసరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లాది విష్ణు తదితరులు వీరి ఆందోళనకు సంఘీభావం తెలిపారు.



వైఎస్సారే ఉంటే సస్యశ్యామలం అయ్యేది

ప్రజా సంకల్పయాత్రలో జగన్

విశాలాంధ్ర-నెల్లూరుబ్యూరో: కీర్తిశేషులు వైఎస్సారే ఉండి ఉంటే ఈపాటికి సోమశిల ప్రాజెక్టు పూర్తయి ఉండేదని .ఉదయగిరిలో మరో రిజర్వాయర్‌తో కలుపుకుంటే మొత్తం ఐదు రిజర్వాయర్లతో మెట్ట ప్రాంతమంతా సస్యశ్యామలంగా మారిపోయేదని జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. వైసీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్ర మంగళవారం సంగం మండలంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన తండ్రి పోయిన తర్వాత, ప్రాజెక్టు మిగిలిన పనులు పట్టించుకునే నాథుడే కరువయ్యారని అన్నారు. ఆత్మకూరు, వింజమూరు, కనిగిరి, తదితర మండలాల్లో తాగునీరు, సాగునీరుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెన్నా డెల్టా ఆధునీకరణలో భాగంగా 80 శాతం పనులు పూర్తయ్యాయని, ఇప్పటికే నాలుగేళ్లు అయిపోయిందన్నారు. మిగిలిన 20శాతం పనులు ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఉండిపోయాయన్నారు. ఆర్టీసీ చార్జీలు వరుసగా మూడుసార్లు పెంచేశారని, పండుగలు వస్తే బస్సు ఎక్కాలంటే భయపడే పరిస్థితి తెచ్చారన్నారు. ఇంజనీరింగ్ చదివించాలంటే తల్లిదండ్రులు అప్పులు చేస్తే తప్ప పూర్తికాని పరిస్థితి ఉందని, చదువుకున్న పిల్లలు ఉద్యోగాల కోసం ఎక్కడకు పోవాలో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మేకపాటి గౌతమ్‌రెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాదయాత్రలో పాల్గొన్నారు.

8న బంద్‌కు ఏపీజేఎఫ్, రాజకీయ పార్టీల మద్దతు



విశాలాంధ్ర - విశాఖపట్నం : విభజన హామీలు, రైల్వేజోన్, ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ వంటి హామీలు అమలుచేయాలని రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 8న జరగనున్న బంద్‌కు మద్దతు తెలియజేస్తున్నట్టు మంగళవారం విశాఖలో ఏపీజేఎఫ్, రాజకీయ పార్టీలు ప్రకటించాయి. దాబాగార్డెన్స్ అంబేద్కర్ విగ్రహం నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించాయి. ఈ ర్యాలీలో ఏపీజేఎఫ్ రాష్ట్ర నాయకులతోపాటు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి ఎర్నం నరసింగ రావు, వైసీపీ నేత కొయ్య ప్రసాదరెడ్డి, ఉత్తరాంధ్ర రక్షణ వేదిక నాయకుడు శివశంకర్, సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీల నేతలు, జర్నలిస్టులు అధికసంఖ్యలో పాల్గొని భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జేవీ సత్యనారాయణమూర్తి మాట్లా డుతూ, విశాఖకు రైల్వే జోన్ ఇస్తామని చెప్పిన బీజేపీ నాలుగేళ్లుగా ప్రజలను మోసం చేసిందన్నారు. రైల్వే జోన్ కోసం 15 ఏళ్లుగా ఉత్తరాంధ్రవాసులు అలుపెరుగని పోరాటం చేస్తున్నారన్నారు. ఉత్తరాంధ్ర రక్షణ వేదిక నాయకులు శివశంకర్ మాట్లాడుతూ, విశాఖలో ఎన్నికల హామీ సభలో ప్రధాని విభజన హామీతో పాటు రైల్వేజోన్ తప్పక ఇస్తామని చెప్పి గత నాలుగేళ్లుగా మొండిచేయి చూపారన్నారు. ఏపీజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వంశీకృష్ణ మాట్లాడుతూ, రాష్ట్రానికి కేంద్రం నాలుగేళ్లుగా తీవ్ర అన్యాయం చేస్తుంటే తెలుగుదేశం ప్రభుత్వం ఇంకా ఎన్‌డీఏ ప్రభుత్వంలో కొనసాగడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రాన్ని తీవ్ర నిరాశ పరచిన కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా ఈ నెల 8న వామపక్షాలు తలపెట్టిన బంద్‌కు తమ జర్నలిస్టు సంఘం తరపున పూర్తి మద్దతు తెలియజేస్తున్నామని ఈ సందర్భంగా ప్రకటించారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఉమామహేశ్వరరావు, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొయ్య ప్రసాదరెడ్డి, ఏపీజెఎఫ్ నాయకులు ఈశ్వర్ చౌదరి, శ్రీరామరెడ్డి, రవికాంత్, సీపీఐ నగర కార్యదర్శి మరు పిళ్ల పైడిరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు దేవరకొండ మార్కండేయులు విద్యార్థి, యువజన సంఘాల నేతలు పాల్గొన్నారు.

8న రాష్ట్రబంద్‌కు విద్యార్థి, యువజన సంఘాల మద్దతు

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేయడంకు నిరసనగా వామపక్షపార్టీలు ఇచ్చిన బంద్‌కు ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, బిసి, ఎస్టీఎస్సీమైనారిటీ విద్యార్థిసంఘం, పిడిఎస్‌యూలు సంపూర్ణ మద్దతు తెలిపాయి. మంగళవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఎఐవైఎఫ్ రాష్ట్రప్రధాన కార్యదర్శి ఎస్.లెనిన్‌బాబు, ఎఐఎస్ఎఫ్ రాష్ట్రప్రధాన కార్యదర్శి జి.రంగన్న, బిసి,ఎస్టీ ఎస్సీమైనారిటీ విద్యార్థిసంఘం రాష్ట్ర అధ్యక్షులు నరసింహ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆనంద్, పిడిఎస్‌యూ జిల్లా కార్యదర్శి రమణ, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీరాములుగౌడ్, ఎఐవైఎఫ్ జిల్లాప్రధాన కార్యదర్శి కారుమంచి, డివైఎఫ్ఐ నాయకులు రాఘవేంద్రలతో కలసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లెనిన్‌బాబు, రంగన్న, నరసింహ, ఆనంద్, రమణలు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం బడ్జెట్‌లో రాష్ట్రాని తీవ్ర అన్యాయం చేసిందన్నారు. విభజన హామీలు అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. బంద్ సందర్భంగా గురువారం ఆర్టీసి బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు సోమన్న, ప్రతాప్, ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, భరత్, బదేసాహెబ్ ఉన్నారు.



పాత నేరస్తులపై పటిష్ట నిఘా పెట్టండి

- అత్యుత్తమ టెక్నాలజీని ఉపయోగించాలి
- విదేశాల్లోని నేరస్తులకు రెడ్ కార్నర్ నోటీసు
- ఏ, బీ, సీ, డీ అవార్డుల ప్రదానోత్సవంలో డీజీపీ మాలకొండయ్య

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : పలు కేసులలోని పాత నేరస్తులపై పోలీసులు పటిష్ట నిఘా పెట్టాలని డీజీపీ డాక్టర్ ఎం మాలకొండయ్య సూచించారు. బెయిల్‌పై బయటకు వచ్చిన వారిపైనా, న్యాయస్థానంలో వీగిపోయిన కేసులలోని నేరస్తులు, రెండు లేదా అంతకంటే ఎక్కువ నేరాలు చేసిన వారి కదలికలను ఎప్పటికపుడు సూక్ష్మ నిఘా ఉంచాలన్నారు. ఇందుకోసం ఉత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో పలు కీలక కేసులను సమయస్ఫూర్తిగా ఛేధించిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఏబీసీడీ, ఐపీఎస్ అవార్డుల ప్రదానోత్సవం మంగళవారం జరిగింది. డీజీపీ మాల కొండయ్య మాట్లాడుతూ, పాత నేరస్తులు తిరిగి నేరాలు చేయకుండా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. రాజమహేంద్రరంలోని ముస్లిం మత పెద్ద హత్య కేసులో పోలీసులు ఉత్తమ ప్రతిభ కనబరచటంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. నేరస్తులకు జియో ట్యాగింగ్‌ను మరింత పటిష్టంగా అమలు చేయాలని ఆయన ఆదేశించారు. నేరస్తులను పట్టుకోవటమే కాకుండా కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు, సాక్ష్యాలను సేకరించి కోర్టులో ప్రవేశపెట్టటం ఎంతో ముఖ్యమన్నారు. విచారణ అధికారులు అన్ని విధాల సాక్ష్యాధారాలతో విచారణ చేపట్టాలన్నారు. పలు నేరాల సామాజిక కోణం గురించి ముందే అంచనా వేయాలని, సామాన్య ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇదిలావుండగా, కొన్ని కీలక కేసుల విచారణలో న్యాయ నిపుణుల సలహా తీసుకోవాలని మాల కొండయ్య సూచించారు. రాష్ట్రంలో అపరిష్కృతంగా ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, లేనిపక్షంలో నేరాలు మరిన్ని పెరిగే ప్రమాదం ఉందన్నారు. నేరస్తుల బెయిల్‌ను గట్టిగా వ్యతిరేకించాలని, అలాగే జామీనుదారులపై ప్రత్యే కంగా నిఘా ఉంచాలన్నారు. విదేశాలలో ఉన్న నేరస్తులను చట్టం ముందు నిల బెట్టేందుకు రెడ్ కార్నర్ నోటీసు ఇవ్వాలని, అంతేగాకుండా ఆ కేసుల వివరాలను సీబీఐకి నివేదించాలని చెప్పారు. ఇతర రాష్ట్రాలు, దేశాలకు చెందిన నేరస్తులు ఉన్న కేసులను సీఐడీ విభాగం విచారణ చేయాలని ఆయన తెలియజేశారు. అనంతరం పలు కేసులలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి నేరస్తులను పట్టుకున్న అధికారులు, సిబ్బందికి డీజీపీ అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీజీపీ హరీష్ కుమార్‌గుప్తా, సీఐడీ అదనపు డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు, రైల్వే డీజీపీ కెఆర్ఎం కిశోర్ కుమార్, వెల్ఫేర్ ఏడీజీపీ అంజనా సిన్హా, బెటాలియన్స్ ఐజీ రాజీవ్ కుమార్ మీనా, సీఐడీ ఐజీ అమిత్ గార్గ్, పర్సనల్ ఐజీ ఎన్ శ్రీధర్‌రావు, కుమార్ విశ్వజిత్ తదితరులు పాల్గొన్నారు.



అమరావతిలో బౌద్ధాలయం

సీఎం చంద్రబాబుని కల్సిన థాయ్‌ల్యాండ్ బృందం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఒకనాడు బౌద్ధమతానికి ఆలంబనగా, ముఖ్య కేంద్రంగా విరాజిల్లిన అమరావతి ప్రాంతంలో బౌద్ధ ఆలయ నిర్మాణానికి థాయ్‌ల్యాండ్ బృందం ముందుకొచ్చింది. వెలగపూడి సచివాల యంలో వున్న ముఖ్యమంత్రి చంద్రబాబుని మంగళవారం థాయ్‌ల్యాండ్ కౌన్సిల్ జనరల్ కాంగ్ కనీత్ రక్సోరియన్ కలిశారు.

నాగార్జున విశ్వవిద్యాలయంలోని బుద్దిస్ట లెర్నింగ్ సెంటర్‌కు అనుసంధానంగా ఉంటూ బౌద్ధ ధర్మం, విశిష్టతలను మరింత ప్రాచుర్యంలోకి తీసుకు రావాలని భావిస్తున్నట్టు ఈసందర్భంగా తెలిపారు. అమరావతిలో పది ఎకరాల స్థలం కేటాయిస్తామని, ఆలయ నిర్మాణానికి అవసర మైన ప్రణాళికలు, ఆకృతులతో రావాలని సీఎం సూచించారు. అలాగే ఏపీ నుంచి థాయ్ ఎయిర్‌వేస్ సేవలు నడిపేందుకు సంసిద్ధతను తెలియజేశారు. విశాఖ లేదా విజయవాడ నుంచి త్వరలో సేవలు ప్రారంభించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలిపారు.

మావోయిస్టు కదలికలు...!

- 'నిఘా' హెచ్చరికతో రంగంలోకి గ్రేహౌండ్స్
- ఒడిశా, చత్తీస్‌గడ్, తెలంగాణ బోర్డర్‌లో కూంబింగ్
- గిరిజన గ్రామాల్లో భయాందోళనలు
- కొత్త రిక్రూట్‌మెంట్ దిశగా దళాల అడుగులు
- పొరుగు రాష్ట్ర పోలీసులతో ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికకు వ్యూహం



విశాలాంధ్రబ్యూరో - అమరావతి : రాష్ట్ర సరిహద్దుల్లో మావోయిస్టుల కదలికలు మళ్లీ పెరుగుతున్నాయి. పొరుగు రాష్ట్రాల్లోని దండకారణ్యాల్లో ఉన్న పలు దళాలు రాష్ట్ర భూభాగంలోకి చొచ్చుకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నాయి. దీంతో సరిహద్దు గ్రామాల్లో టెన్షన్ వాతావరణం నెలకొంది. ఇటీవల సరిహద్దుల్లో చోటు చేసుకున్న ఘటనలతో తెలంగాణ, చత్తీస్‌గడ్, ఒడిశా బోర్డర్‌లోని గిరిజన గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కొద్దికాలం క్రితం ఒడిషా, చత్తీస్‌గడ్‌లో జరిగిన మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌తో కాస్త వెనక్కి తగ్గిన దళాలు మళ్లీ పుంజుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. అందులో భాగంగానే గిరిజన గ్రామాల్లోని యువతను దళ సభ్యులుగా రిక్రూట్ చేసుకుంటున్నట్లు నిఘా వర్గాలకు సమాచారం అందింది. దీంతో గ్రేహౌండ్స్ బలగాలు సరిహద్దు రాష్ట్రాల్లోని అటవీ ప్రాంతాల్లో భారీగా కూంబింగ్ చర్యలు చేపడుతోంది. చత్తీస్‌గడ్, తెలంగాణ, ఏపీ సరిహద్దులో కొద్ది రోజుల క్రితం మావోయిస్టులు పలు హింసాత్మక చర్యలకు పాల్పడ్డారు. దీంతో కేంద్ర బలగాలు రంగంలోకి దిగి సరిహద్దు గ్రామాల్లో తనిఖీలు చేపడుతున్నాయి. ఈ నేపథ్యంలో దండకారణ్య ప్రాంతంలోకి పోలీసు బలగాలను రానీయకుండా అడ్డుకునేందుకు మావోయిస్టు గ్రూపులు కూడా ప్రణాళికలను తయారు చేసుకుంటున్నాయి. రాష్ట్ర విభజన తర్వాత మావోయిస్టు కార్యక్రమాలు రాష్ట్రంలో దాదాపు తగ్గిపోయాయి. ఈ విషయాన్ని పోలీసు డైరెక్టర్ జనరల్ (డీజీపీ)గా పని చేసి ఇటీవల పదవీ విరమణ చేసిన ఎన్ సాంబశివరావు పలుమార్లు చెప్పారు. ముందస్తుగా పోలీసు గ్రేహౌండ్స్ బలగాలను పొరుగు రాష్ట్రాల ప్రాంతాల్లోకి పంపించి మరీ కూంబింగ్ నిర్వహించిన సందర్భాలు ఉన్నాయి. దీంతో రాష్ట్రంలోకి మావోయిస్టుల ప్రవేశం దాదాపు ఆగిపోయింది. కాని రాష్ట్రంలో విలీనమైన తెలంగాణాకు చెందిన చింతూరు ప్రాంతంలో, చత్తీస్‌గడ్ వైపు నుంచి మావోయిస్టుల కార్యకలాపాలు రాష్ట్రంలోకి విస్తరించే ప్రమాదం ఉందని నిఘా విభాగం హెచ్చరించింది. దీంతో రాష్ట్ర పోలీసులు అప్రమత్తమయ్యారు. మరోవైపు ఆంధ్రా ఒడిశా బోర్డర్ (ఏఓబీ)లోనూ మావోయిస్టు గ్రూపులు రాష్ట్రంలోకి చొరబడేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం ప్రకారం గిరిజన ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని రాష్ట్రంలోనూ మావోయిస్టులు ప్రవేశించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని అటవీ ప్రాంతాల్లో ఇప్పటికీ మావోయిస్టుల సమస్య తరచూ ఉత్పన్నం అవుతూనే ఉంది. మావోయిస్టుల ఆచూకీ చెప్పాలంటూ ఒకవైపు పోలీసులు గిరిజనులను వేధిస్తుండగా, పోలీసులకు సమాచారం ఇచ్చే వారిపై దాడి చేసేందుకు మావోయిస్టులు ఏమాత్రం వెనుకాడని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల్లోని గిరిజనులు రోజూ భయాందోళనలకు గురవుతున్నాయి. ముఖ్యంగా కోరాపుట్, రాయగడ, జీకే వీధి, చింతపల్లి, దంతేవాడ ప్రాంతాల నుంచి మావోయిస్టులు రాష్ట్ర భూభాగంలోకి ప్రవేశించేందుకు అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

కొనసాగుతున్న గ్రేహౌండ్స్ కూంబింగ్

రాష్ట్రంలోనూ తమ పట్టును పెంచుకోవాలనే ఉద్దేశంతో పలు మావోయిస్టు గ్రూపులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. అందులో భాగంగానే గిరిజన యువతను టార్గెట్ చేస్తున్నట్లు తెలిసింది. తమ భావాజాలానికి అనువుగా ఉన్న వారిని దళాల్లోకి రిక్రూట్ చేసుకుని శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని పసిగట్టిన గ్రేహౌండ్స్ దళాలు రేయింబవళ్లు అటవీ ప్రాంతాల్లో కూంబింగ్ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. ఇదిలావుండగా, రాష్ట్రంలో మావోయిస్టు కార్యక్రమాలు పెద్దగా లేకపోయినప్పటికీ ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు. అంతేగాకుండా చత్తీస్‌గడ్, ఒడిషా, తెలంగాణా రాష్ట్రాల్లోని పోలీసు ఉన్నతాధికారులతో చర్చించి ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికను రూపొందించే యోచనలో పోలీసులు ఉన్నారు.

తీవ్రవాద ప్రభావిత జిల్లాల్లో విశాఖ

మావోయిస్టు ప్రభావం వల్ల సరిహద్దు గ్రామాల్లో ప్రజలకు పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు అందని పరిస్థితి నెలకొంది. కేంద్ర హోంమంత్రిత్వశాఖ సర్వే ప్రకారం దేశంలోనే 35 జిల్లాల్లో మావోయిస్టులు, తీవ్రవాదుల ప్రభావం అత్యంత ఎక్కువ. ఆ జాబితాలో రాష్ట్రంలోని విశాఖపట్నం జిల్లా ఉండటం గమనార్హం. పోలీసులు అటవీ ప్రాంతాల్లోకి రాకుండా అడ్డుకునేందుకు మావోయిస్టులు రోడ్లు, బ్రిడ్జిలను ధ్వంసం చేస్తున్నారు. దీంతో ఇటీవల కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్ జైట్లీ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మావోయిస్టు ప్రభావం ఉన్న జిల్లాల్లో రోడ్లు, పాఠశాలల భవనాలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు రూ.వెయ్యి కోట్లను కేటాయించారు. అందులో విశాఖ జిల్లాకు రూ.28.87 కోట్లను కేటాయించారు. దీనినిబట్టే విశాఖ ప్రాంతంలో మావోయిస్టుల అలజడి మళ్లీ పుంజుకుంటుందని చెప్పవచ్చని పోలీసు అధికారులే వ్యాఖ్యానిస్తున్నారు. తెలంగాణా సరిహద్దులో ఇటీవల జరిగిన ఒక ఘటనతో తూర్పు గోదావరిలోని చింతూరు ప్రాంతం కూడా ఆ జాబితాలో చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఎస్సీ జాబితాలో చేర్చండి : అంజిబాబు


విశాలాంధ్ర అమరావతి : రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని రాష్ట్ర సంఘ అధ్యక్షుడు పాతపాటి అంజిబాబు, మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. రాష్ట్ర జనాభాలో 9 శాతం ఉన్న రజకులకు,రాజకీయ పార్టీలు ఏనాడూ గుర్తించలేదని వాపోయారు. 343 జీవో ప్రకారం చెరువులపై ఉన్న లీజులను రద్దుచేసి ,యాజమాన్య హక్కులు కల్పించాలని, 50సంవత్సరాలు పైబడిన రజకులందరికి పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. రాజధాని ప్రాం తంలో రజక భవన్‌కు భూమి కేటాయించడంతోపాటు, 13 జిల్లా కేంద్రాలల్లో రజక భవనాలకు స్థలాలు మంజూరు చేయాలన్నారు.టీటీడీతో సహా రాష్ట్రంలోని అన్ని దేవాలయాలు, ఆసుపత్రుల్లో దోబీ ఉద్యోగాలను పునర్దురించి, ఉపాధి కల్పించాలని ఆయన కోరారు.



నెలసరి సహజం..

'ప్యాడ్‌మేన్'ను కలవండి

- స్టార్ షట్లర్ పీవీ సింధు
- ప్యాడ్‌మేన్ సవాలు స్వీకరించిన మొట్టమొదటి అథ్లెట్
- క్యాంపెయిన్‌ను ప్రారంభించిన పారిశ్రామికవేత్త అరుణాచలమ్ మురుగనాథమ్
- ఇటీవల న్యూఢిల్లీలో కలుసుకున్న పీవీ సింధు, దీపికా పదుకొణె



న్యూఢిల్లీ : తెలుగు తేజం, స్టార్ షట్లర్ పీవీ సింధు ప్యాడ్‌మ్యాన్ సవాల్‌తో చేతులు కలిపింది. 'నెలసరి అనేది సహజం. మరో రోజు మాత్రమే ఉంటుంది' అంటూ సోమవారం ఒక శానిటరీ ప్యాడ్‌తో ఫొటోలకు ఫోజిచ్చింది. ఈ ప్యాడ్‌మేన్ చిత్ర కథను ప్రముఖ పారిశ్రామిక వేత్త అరుణాచలమ్ మురుగునాథమ్ జీవిత చరిత్ర ఆధారంగా నిర్మించారు. ఇప్పటికే ఈ ప్యాడ్‌మేన్ చాలెంజ్‌ను పలువురు సెలబ్రిటీలు స్వీకరించారు. మురునాథమ్ తన ట్వీట్‌లో ట్వింకిల్ ఖాన్నాను ట్యాగ్ చేశారు. ఆమె సవాలును స్వీకరించి బాలీవుడ్‌లోని అమిర్‌ఖాన్, షబ్నా ఆజ్మీవంటి ప్రముఖులకు ట్వీట్ చేసింది. వీరిద్దరూ నెలసరి, పరిశుభ్రతపై పలువురికి అవగాహన కల్పిస్తున్నారు. ప్రముఖ నటుడు అక్షయ్ కుమార్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'ప్యాడ్‌మేన్'. ఈనెల 9న విడుదలయ్యేందుకు సిద్ధంగా ఉంది. దీంతో ఈ చిత్ర యూనిట్ రుతుక్రమంపై అవగాహన కల్పించడమే ధ్యేయంగా పెట్టుకున్నారు. ఈ చిత్రం దీని ఆధారంగానే నిర్మించారు. ప్యాడ్‌మేన్ సవాలును స్వీకరించిన మొట్టమొదటి అథ్లెట్ పీవీ సింధునే కావడం గమనార్హం. ఇటీవల ప్రకాష్ పదుకొణెకు సన్మానం జరిగిన సందర్భంగా న్యూఢిల్లీలో సింధు, దీపికా పదుకొణె కలుసుకున్నారు. దీపిక కూడా తన తండ్రిలానే బ్యాడ్మింటన్ ప్లేయర్. మోడలింగ్‌లోకి రాకముందు ఆమె పలు ఈవెంట్లలో పాల్గొంది. 2014లో ఎన్‌డీటీవీ ఇండియన్ ఆఫ్ ది ఇయర్ అవార్డ్స్‌లో పీవీ సింధుకు దీపికా పదుకొణె అవార్డును ప్రదానం చేసింది. అలాగే త్వరలో రాబోయే పీవి సింధు బయోపిక్‌లో కూడా దీపికా పదుకొణెనే నటించే అవకాశాలున్నాయని పలువురు చెబుతున్నారు.

జులన్ రికార్డ్



కింబర్లే: భారత మహిళా క్రికెటర్ జులన్ గోస్వామి మరో అరుదైన ఘనతను అందుకుంది. దక్షిణాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్ కోసం ప్రస్తుతం మిథాలీ రాజ్ నాయకత్వంలోని భారత మహిళల జట్టు సఫారీ గడ్డపై పర్యటిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇరు జట్ల మధ్య సోమవారం తొలి వన్డే జరిగింది. లక్ష్యఛేదనలో జులన్ గోస్వామి (4/24), శిఖా పాండే (3/23), పూనమ్ యాదవ్ (2/22) ధాటికి దక్షిణాఫ్రికా 43.2ఓవర్లలో 125 పరుగులకే కుప్ప కూలింది. దీంతో 88 పరుగుల తేడాతో భారత్ ఘన విజయం సాధించింది. అంతకుముందు 8 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన జులన్ గోస్వామి వెయ్యి పరుగుల మైలు రాయిని అందుకుంది. దీంతో అంతర్జాతీయ మహిళల వన్డే క్రికెట్‌లో వెయ్యికి పైగా పరుగులతో పాటు 150కి పైగా వికెట్లు తీసిన ఏకైక క్రికెటర్‌గా జులన్ గోస్వామి రికార్డు సృష్టించింది. ఇప్పటి వరకు 165 వన్డేలాడిన జులన్ 97 ఇన్నింగ్స్‌ల ద్వారా 1003 పరుగులు సాధించింది. అలాగే 164 ఇన్నింగ్స్‌ల ద్వారా 199 వికెట్లను తన ఖాతాలో వేసుకుంది. మహిళల వన్డే క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన క్రీడాకారిణిగా 35 ఏళ్ల జులన్ అగ్రస్థానంలో ఉన్న సంగతి తెలిసిందే.



పాక్ డ్రస్సింగ్ రూమ్‌లోకి వెళ్లలేదు : ద్రవిడ్

ముంబై : తాను పాక్ ఆటగాళ్ల డ్రస్సింగ్ రూమ్‌కి వెళ్లినట్లు వస్తున్న వార్తలను అండర్-19 భారత క్రికెట్ జట్టు కోచ్ రాహుల్ ద్రవిడ్ కొట్టి పారేశాడు. న్యూజిలాండ్‌లో అండర్-19 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టు సోమవారం ముంబై చేరుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాహుల్ ద్రవిడ్, జట్టు సారథి పృథ్వీ షా మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఓ విలేకరి టోర్నీలో భాగంగా పాకిస్థాన్‌తో సెమీఫైనల్ అనంతరం మీరు ఆ జట్టు డ్రస్సింగ్ రూమ్‌లోకి వెళ్లి ఆటగాళ్లు, టీమ్ మేనేజర్‌తో మాట్లాడినట్లు వార్తలు వస్తున్నాయి. ఎందుకు వెళ్లారు? అని అడగ్గా.. 'నేను పాక్ డ్రస్సింగ్ రూమ్‌లోకి వెళ్లలేదు. ఆ జట్టులో ఒక ఎడమచేతి వాటం బౌలర్ టోర్నీలో బాగా రాణించాడు. అతన్ని అభినందించడానికి డ్రస్సింగ్ రూమ్ వద్దకు వెళ్లాను. కానీ, రూమ్‌లోకి వెళ్లలేదు' అని ద్రవిడ్ క్లారిటీ ఇచ్చాడు. టోర్నీలో భాగంగా భారత్-పాక్ మధ్య రెండో సెమీఫైనల్ జరిగింది. ఈ మ్యాచ్‌లో భారత్ ఘన విజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లిన సంగతి తెలిసిందే. ఫైనల్లో ఆసీస్‌ను చిత్తు చేసిన పృథ్వీ షా సేన ప్రపంచకప్ ట్రోఫీని సొంతం చేసుకుంది. నాలుగుసార్లు అండర్-19 ప్రపంచకప్ గెలిచిన మొదటి జట్టుగా భారత్ రికార్డులకెక్కిన సంగతి తెలిసిందే.

బీసీసీఐ హెడ్‌క్వార్టర్స్ తరలింపు..?



ముంబై: భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు(బీసీసీఐ) ప్రధాన కార్యాలయం ముంబై నుంచి బెంగళూరుకు తరలిపోయే అవకాశాలున్నాయి. బీసీసీఐకి బెంగళూరులో 40 ఎకరాల భూమి ఉంది. అక్కడ అంతర్జాతీయ ప్రమాణాలతో జాతీయ క్రికెట్ అకాడమీ నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దానిలో భాగంగానే బీసీసీఐ హెడ్‌క్వార్టర్స్‌ను కూడా బెంగళూరుకు మార్చాలనే యోచన చేస్తున్నారు. ప్రస్తుతం ముంబైలోని వాంఖేడ్ స్టేడియంలో బీసీసీఐ ప్రధాన కార్యాలయం ఉంది. అయితే ఫైవ్ స్టార్ సౌకర్యాల కోసం బీసీసీఐ కొన్ని కోట్ల రూపాయల్ని ఖర్చుపెట్టాల్సి వస్తోంది. ఆ నేపథ్యంలో బెంగళూరులో క్రికెట్ అడ్మినిస్ట్రేటర్స్, గెస్ట్‌లు ఉండేందుకు వీలుగా ప్రధాన కార్యాలయం నిర్మించాలని బీసీసీఐ భావిస్తోంది. బీసీసీఐ సమావేశాలు ముంబై, ఢిల్లీ, బెంగళూరు నగరాల్లో జరిగిన సమయాల్లో ఖర్చు భారీగా అవుతోంది. దాంతోనే బెంగళూరులో ఉన్న సొంత స్థలంలో నేషనల్ క్రికెట్ అకాడమీతో పాటు అత్యాధునిక సౌకర్యాలతో బీసీసీఐ కార్యాలయాన్ని నిర్మించేందుకు రంగం సిద్ధమవుతోంది. ఈ మేరకు బీసీసీఐ తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నా.. బోర్డు సభ్యుల అనుమతి కోరుతూ వారందరికీ లేఖలు రాశారు. ఒకవేళ దీనికి ఆమోద ముద్ర పడితే బీసీసీఐ కార్యకలాపాలు రెండు-మూడేళ్లలో ముంబై నుంచి బెంగళూరుకు మారే అవకాశం ఉంది.

లోథా సిఫార్సులు అమలు చేయాల్సిందే..!

హైదరాబాద్ : జస్టిస్ లోథా కమిటీ సిఫార్సులు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో అమలు కావడం లేదని ఉమ్మడి హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ సిఫార్సులు పూర్తిస్థాయిలో అమలు చేయాల్సిన అవసరముందని పేర్కొంది. హెచ్‌సీఏ పనితీరుపై గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అనిల్ రమేశ్ దవే, హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ సీతాపతితో కూడిన అడ్మినిస్ట్రేట్ కమిటీ సోమవారం నివేదిక సమర్పించింది. ఈ నివేదికను పరిశీలించిన ధర్మాసనం..లోథా సిఫార్సులు పూర్తిగా అమలవడం లేదని వ్యాఖ్యానించింది. కమిటీ నివేదికపై పిటిషనర్‌తోపాటు ప్రతివాదులు తమ అభిప్రాయాలను తెలియజేయాలని ఆదేశిస్తూ విచారణను మూడు వారాలపాటు వాయిదా వేసింది.

'మూడు' గెలిస్తే.. చరిత్రే..!

- నేడు మూడో వన్డే
- భారత్ జోరు... ప్రొటీస్ బేజారు
- మొదటి రెండు వన్డేల్లో పూర్తిగా బ్యాటింగ్ చేయని టీమిండియా
- దక్షిణాఫ్రికాకు గాయాల బెడద

కేప్‌టౌన్ : దక్షిణాఫ్రికాతో ఆరు వన్డేల ద్వైపాక్షిక సిరీస్‌లో టీమిండియా మరో విజయంపై కన్నేసింది. ఇప్పటికే రెండు వరుస వన్డేల్లో గెలిచి 2-0 ఆధిక్యం సాధించిన భారత జట్టు.. మూడో వన్డేలో కూడా విజయం సాధించి మరింత ముందుకు దూసుకుపోవాలని భావిస్తోంది. బుధవారం కేప్‌టౌన్‌లో ఇరు జట్ల మధ్య సాయంత్రం గం. 4.30ని.లకు మూడో వన్డే ఆరంభం కానుంది. డర్బన్‌లో జరిగిన తొలి వన్డేలో ఆరు వికెట్ల తేడాతో గెలిచిన టీమిండియా.. సెంచూరియన్‌లో జరిగిన రెండో వన్డేలో తొమ్మిది వికెట్లతో ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ రెండు వన్డేల్లో దక్షిణాఫ్రికాకు ఏ మాత్రం అవకాశం ఇవ్వని కోహ్లిసేన మూడో వన్డేలో కూడా ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. ఇప్పటికే గాయాలతో ఏబీ డివిలియర్స్, డుప్లెసిస్ దూరం కాగా మరో కీలక ఆటగాడు డీకాక్ సైతం మణికట్టు గాయంతో మొత్తం భారత్‌తో సిరీస్‌కు దూరమయ్యాడు. దాంతో సఫారీ జట్టును గాయాల బెడద ఆందోళన పరుస్తోంది. మరొకవైపు భారత్ జట్టు వరుసగా మూడు విజయాలు (టెస్టు మ్యాచ్‌లో విజయంతో కలుపుకుని) సాధించి తదుపరి పోరుకు రెట్టించిన ఉత్సాహంతో సిద్ధమవుతోంది.

కొత్త అధ్యాయం..?

దక్షిణాఫ్రికాలో ఇప్పటివరకూ ఏ ద్వైపాక్షిక సిరీస్‌లోనూ భారత జట్టు మూడు విజయాలు సాధించలేదు. ఒకవేళ రేపటి మ్యాచ్‌లో భారత జట్టు విజయం సాధిస్తే మాత్రం కొత్త అధ్యాయాన్ని లిఖిస్తుంది. గతంలో దక్షిణాఫ్రికాలో ఒక ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లో భారత జట్టు సాధించిన విజయాలు రెండు. దక్షిణాఫ్రికాలో ద్వైపాక్షిక వన్డే సిరీస్‌ల్లో కేవలం రెండు సందర్భాల్లో మాత్రమే భారత జట్టు రెండేసి విజయాల్ని సాధించింది. 1992-93 దక్షిణాఫ్రికా పర్యటనలో ఐదు వన్డేల సిరీస్‌లో రెండు వన్డే విజయాల్ని సాధించిన టీమిండియా.. 2010-11 సీజన్ వన్డే సిరీస్‌లో రెండు విజయాలు సాధించింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం దక్షిణాఫ్రికా-భారత జట్ల మధ్య జరుగుతున్న సిరీస్‌కు ప్రాధాన్యత సంతరించుకుంది. మూడో వన్డేలో భారత్ జట్టు గెలిస్తే హ్యాట్రిక్ విజయాలతో కొత్త చరిత్ర లిఖించనుంది. అదే సమయంలో దక్షిణాఫ్రికా తన సొంతగడ్డపై మరో చెత్త రికార్డును మూటగట్టుకుంటుంది. 1992 నుంచి చూస్తే న్యూలాండ్స్ గ్రౌండ్‌లో భారత జట్టు నాలుగు వన్డేలు ఆడగా రెండింట విజయం సాధించింది. మరో రెండు మ్యాచ్‌ల్లో ఓటమి పాలైంది.

అదే టీమ్..!

ఈ మ్యాచ్‌లో కూడా భారత జట్టు ఎటువంటి మార్పులు లేకుండా బరిలోకి దిగే అవకాశం ఉంది. తొలి రెండు వన్డేల్లో ఆడిన తుది జట్టుతోనే మూడో వన్డేలో కూడా భారత్ ఆడటం దాదాపు ఖాయం. వన్డే సిరీస్‌లో ఇప్పటికే కోహ్లి, శిఖర్ ధావన్, రహానేలు ఫామ్‌ను చాటుకోగా, రోహిత్ శర్మ నుంచి కీలక ఇన్నింగ్స్ రావాల్సి ఉంది. ఇక బౌలింగ్‌లో భువనేశ్వర్ కుమార్, బూమ్రా, కుల్దీప్ యాదవ్, చాహల్‌లు తమదైన ముద్రతో చెలరేగిపోతున్నారు. తమకు వచ్చిన అవకాశాన్ని వినియోగించుకుంటూ సత్తాచాటుకుంటున్నారు. మరొకవైపు రెండు వన్డేల్లో భారత జట్టు పూర్తిస్థాయిలో బ్యాటింగ్ చేయకుండానే విజయం సాధించడంతో ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేస్తోంది. మరి ఈ తరుణంలో పటిష్టమైన భారత జట్టును 'గాయాల' దక్షిణాఫ్రికా అడ్డుకట్టవేయడం కష్టమే.



జట్లు (అంచనా) :

భారత్ : విరాట్ కోహ్లి (కెప్టెన్), శిఖర్ ధావన్, రోహిత్ శర్మ, అంజిక్యారహానె, శ్రేయస్ అయ్యర్, మనీష్ పాండే, దినేష్ కార్తీక్, కేదార్ జాదవ్, ఎంఎస్ ధోనీ (వికెట్ కీపర్), హార్దిక్ పాండ్య, యజ్వేంద్ర చాహల్, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, భువనేశ్వర్ కుమార్, జస్ప్రీత్ బూమ్రా, మొహ్మద్ షమి, శార్దూల్ ఠాకూర్

దక్షిణాఫ్రికా : మార్‌క్రమం (కెప్టెన్), హషీమ్ ఆమ్లా, జేపీ డుమ్ని, ఇమ్రాన్ తాహీర్, డేవిడ్ మిల్లర్, మోర్ని మోర్కెల్, క్రిస్ మోరిస్, లుంగి ఎంగిడి, పెహ్లూక్‌వాయో, రబద, షమ్‌సీ, జొందో, ఫర్హాన్ బెహర్‌డైన్, హెన్‌రిచ్ కలాసేన్ (వికెట్ కీపర్)



అదరగొట్టిన సింధు

ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో అమ్మాయిలు బోణీ

అలోర్ సెటార్(మలేసియా) : ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు అటు సింగిల్స్‌తో పాటు మహిళల డబుల్స్‌లోనూ అదరగొట్టింది. దీంతో ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ 3-2 తేడాతో హాంకాంగ్‌పై విజయం సాధించింది. మొదటి సింగిల్స్‌లో సింధు 21-12, 21-18 తేడాతో యిప్ పూ ఇన్‌పై విజయం సాధించి భారత్‌కు ఆధిక్యాన్ని అందించింది. అనంతరం మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప- ప్రజక్త సావంత్ జోడీ 22-20, 20-22, 10-21తో వింగ్ యుంగ్-టింగ్ చేతిలో పరాజయం పాలైంది. ఆ తర్వాత జరిగిన మరో మహిళల సింగిల్స్ మ్యాచ్‌లో శ్రీ కృష్ణప్రియ కూడా 19-21, 21-18, 20-22 తేడాతో ఓటమి పాలైంది. దీంతో భారత్ 1-2తో వెనుకబడింది. మరో మహిళల డబుల్స్‌లో సిక్కిరెడ్డితో జట్టుకట్టిన సింధు 21-15, 15-21, 21-14తో విజయం సాధించి 2-2తో సమం చేసింది. ఇక చివరిదైన మరో మహిళల సింగిల్స్‌పైనే అందరి దృష్టి. హోరా హోరీగా సాగిన మూడు సెట్ల పోరులో భారత క్రీడాకారిణి రుత్విక గద్దె 16-21, 21-16, 21-13తో విజయం సాధించింది. దీంతో భారత్‌కు 3-2 ఆధిక్యం లభించింది. ఇక టోర్నీలో భాగంగా గురువారం భారత మహిళల జట్టు జపాన్‌తో తలపడనుంది. యమగూచి, ఒకుహారాతో సింధు సేన తలపడనుంది. ఈ టోర్నీని మే 20 నుంచి జరిగే ప్రతిష్టాత్మక థామస్ అండ్ ఉబెర్ కప్‌కు క్వాలిఫయర్‌గా పరిగణిస్తారు.

'దక్షిణాఫ్రికా బోర్డు బొక్కబోర్లా'



కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా జట్టు మేనేజ్‌మెంట్‌పై ఆ జట్టు మాజీ కోచ్ రే జెన్నింగ్స్ సంచలన ఆరోపణలు చేశాడు. భారత్‌తో ఇటీవల జరిగిన టెస్టు సిరీస్ సందర్భంగా పిచ్‌లను తమకు అనుకూలంగా (డాక్టరింగ్) మార్చుకోవాలని ప్రయత్నించి దక్షిణాఫ్రికా మేనేజ్‌మెంట్ బొక్కబోర్లా పడిందని ఆరోపించాడు. 'పిచ్‌లను డాక్టరింగ్ చేయాలని దక్షిణాఫ్రికా ప్రయత్నించింది. ఇప్పుడు వన్డేల్లో సిరీస్ ఓటమికి చాలా దగ్గరలో ఉంది. అటువంటి పిచ్‌లు వారికి ఏమాత్రం సాయపడవు. ఎందుకంటే ఇండియాకు బలమైన పేసర్లు ఉన్నారు. స్పిన్నర్లు కూడా అంతే దీటుగా రాణించగలరు" అని జెన్నింగ్స్ పేర్కొన్నాడు. తాను గమనించిన దానిని బట్టి వన్డే సిరీస్‌లో సఫారీలకు ఓటమి తప్పదని తేల్చి చెప్పారు. పదేళ్ల క్రితం వరకు భారత్‌లో ఫాస్ట్ బౌలర్లు లేరని, కానీ ఇప్పుడు అలా కాదని జెన్నింగ్స్ పేర్కొన్నాడు. ఇక అండర్-19 జట్టు విషయానికే వస్తే బౌలర్లు 135 కిలోమీటర్ల వేగంతో బంతులు సంధిస్తున్నారని కితాబిచ్చాడు. భారత బౌలర్లు యుజ్వేంద్ర చాహల్, కుల్దీప్ యాదవ్‌లను ఎదుర్కొనేంత సమయం లేకుండా పోయిందన్న సఫారీల బ్యాటింగ్ కోచ్ డేల్ బెన్కెన్‌స్టేన్ వ్యాఖ్యలతో జెన్నింగ్స్ ఏకీభవించాడు. అంత తక్కువ సమయంలో చేసేందుకు ఏమీ ఉండదని పేర్కొన్నాడు. స్పిన్‌ను ఎలా ఎదుర్కోవాలో తెలియనప్పుడు బంతులను తినేసి బయటపడడమే మంచిదని సూచించాడు.

లోక్‌సభలో.. కాంగ్రెస్ x టీడీపీ

- వెల్‌లోకి వచ్చిన టీడీపీ ఎంపీలు....
- ఆందోళనలకు అరకు ఎంపీ కొత్తపల్లి గీత దూరం
- సీటుకే పరిమితమైన కర్నూలు ఎంపీ బుట్టా రేణుక
- టీడీపీ ఎంపీలపై కాంగ్రెస్ నేత మల్లిఖార్జున ఖర్గే ఆగ్రహం
- ఎంపీ ఆందోళన విరమించాలని రాజ్‌నాథ్ వినతి

విశాలాంధ్ర బ్యూరో- న్యూఢిల్లీ : పార్లమెంట్ ఉభయ సభల్లో మంగళవారం టీడీపీ ఎంపీల ఆందోళన కొనసాగింది. లోక్ సభలో నినాదాలు కొనసాగిస్తున్న సమయంలో... కాంగ్రెస్ సభ్యుతో వాగ్వాదం చోటు చేసుకుంది. కాంగ్రెస్ పక్ష నేత మల్లిఖార్జున్ ఖర్గే ప్రసంగిస్తున్న సమయంలో కూడా టీడీపీ ఎంపీలు నినాదాలు చేశారు. దీంతో ఖర్గే... ప్రభుత్వమే ఇదంతా చేయిస్తోంద న్నట్లుగా కామెంట్ చేశారు. ఖర్గే మాటలతో టీడీపీ ఎంపీలు... తమ ఆగ్రహాన్ని కాంగ్రెస్ వైపు మళ్లించారు. అసలు కాంగ్రెస్ వల్లే ఏపీకి తీవ్ర అన్యాయం జరిగిందని నినాదాలు చేశారు. కాంగ్రెస్-టీడీపీ ఎంపీల మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో స్పీకర్ సభను కాసేపు వాయిదా వేశారు. తొలుత టీడీపీ ఎంపీలను బుజ్జగించేందుకు ప్రధాని మోడీ సహా మంత్రులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. నిర్దిష్ట కాలపరిమితితో హామీల అమలును ప్రకటించేంతవరకు వెనక్కి తగ్గబోమని టీడీపీ నేతలు స్పష్టం చేశారు. ఏపీకి అన్యాయం చేసిన పార్లమెంట్‌లోనే న్యాయం జరిగే వరకు ఎంపీలకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ప్రధాని హామీలు ఇవ్వడం కాదని.. లోక్ సభలో ప్రకటించే వరకూ పోరాడాలని చంద్రబాబు టీడీపీ ఎంపీలకు స్పష్టం చేశారు. అప్పుడున్న పార్టీలే ఇప్పుడు పార్లమెంటులో ఉన్నాయని... ఏపీకి న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత అన్ని పార్టీలపై ఉందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. మూడున్నరేళ్లలో ఏపీకి చేసింది కొంతే, చేయాల్సింది చాలా ఉందన్నారు. ప్రజలు సంతృప్తి చెందేలా చూడాల్సింది కేంద్రమేనని స్పష్టం చేశారు. చేస్తాం, చూస్తామనే స్థాయి దాటిపోయిందని... ఇప్పుడు స్పష్టమైన కార్యాచరణ కావాలన్నారు. రాష్ట్రానికి న్యాయం జరిగేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సభ్యులందరూ సభకు హాజరై... నిరసనల్లో పాల్గొనాలని ఆదేశించారు. పార్లమెంట్‌లో ఎంపీల పోరాటం.. కేంద్రం ప్రతిస్పందిస్తున్న తీరును రోజంతా సీఎం పరిశీలిస్తూనే ఉన్నారు. ఏపీకి అన్యాయం జరిగిందని.. అన్ని పార్టీలు చెబుతున్నాయని.. వైసీపీ మాత్రం డబుల్ గేమ్ ఆడుతోందని మండిపడ్డారు. అయితే టీడీపీ అధినేత నుంచి స్పష్టమైన ఆదేశాలుండటంతో... ఉభయసభల్లో ఎంపీలు వెల్‌లోకి వెళ్లి నిరసన కొనసాగించారు. ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలని, రాష్ట్రాన్ని కాపాడాలని కోరుతూ లోక్ సభలో ఎంపీలు ప్లకార్డులను ప్రదర్శించారు. మిత్రధర్మాన్ని కాపాడాలంటూ ఎంపీలు నినాదాలు చేశారు. పలుమార్లు లోక్ సభ వాయిదా పడినా... టీడీపీ ఎంపీల నినాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఎంపీ శివప్రసాద్... చిడతలు వాయిస్తూ నిరసన తెలిపారు. నిరసనల మధ్యే రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ కొనసాగింది. కనీసం రాష్ట్రపతి ప్రసంగంపై చర్చ ముగిసేవరకు సహకరించాలంటూ కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ సుజనా చౌదరిని పిలిచి కోరారు. అయితే ఆందోళనల విరమణ అంశం తన చేతిలో లేదని.. సుజనా స్పష్టం చేశారు. మొదట్లో వైసీపీ ఎంపీలు కూడా వెల్ వద్దకు దూసుకు వచ్చారు. కర్నూలు ఎంపీ బుట్టా రేణుక తన స్థానం వద్ద నిలబడి నిరసన తెలిపారు. ఏపీ ఎంపీల ఆందోళనను... అరకు ఎంపీ కొత్త పల్లి గీత మాత్రం పట్టించుకోలేదు.

టీడీపీ, వైసీపీ ఎంపీల ధర్నాలు

నాలుగేళ్లు ఎంజాయ్ చేసి.. ఎన్నికల ముందు వేషాలు...

నారదుడి వేషంలో టీడీపీ ఎంపీ శివ ప్రసాద్..

విశాలాంధ్ర బ్యూరో-న్యూఢిల్లీ : ప్రజా సమస్యలను గాలికి వదిలేసి నాలుగేళ్ల పాటు ఎంజాయ్ చేసిన టీడీపీ, వైసీపీ ఎంపీలు ఎన్నికల ముందు పార్లమెంటులో వేషాలు వేస్తున్నారు. వ్యాపారాలు, లాబీలు, భారీగా ఆస్తులు కూడబెట్టడమే ధ్యేయంగా సొంత పనులకు ప్రాధాన్యత ఇచ్చి ఓట్లు వేసిన ప్రజలకు మాయమాటలు చెబుతుండటం విశేషం. పార్లమెంటులో మహాత్మా గాంధీ విగ్రహం సాక్షిగా ఎంపీలు ఆందోళన చేస్తుంటే గాంధీజీని చంపిన గాడ్సే వారసులకు జరిగిన అన్యాయం చెప్పుకున్నట్టు ఉన్నది. రాష్ట్ర విభజన సమయంలో ఇదే మహాత్ముడి విగ్రహం ముందు ధర్నా చేసిన ఎంపీలు విభజనను ఆపలేకపోయారు. నాలుగేళ్ల తర్వాత ఎన్నికల ముందు పార్లమెంటులోని మహాత్ముడి విగ్రహం వద్ద వేషాలు వేస్తున్నారు. టీడీపీకి చెందిన ఎంపీలు మంగళవారం ప్లకార్డులు పట్టుకుని ఏపీకి న్యాయం చేయాలని నినాదాలు చేయడం చూపరులకు హాస్యాస్పదంగా కనిపించింది. టీడీపీకి చెందిన చిత్తూరు ఎంపీ శివప్రసాద్ నారదుడి వేషంలో వచ్చి నాటకాలు వేయడంపై పార్లమెంటులో ఇతర పార్టీల ఎంపీలు చర్చించుకుంటున్నారు. ఎన్నికల ముందు ఈ ఎంపీలు ఇలాగే చేస్తుంటారని ఉత్తరాదికి చెందిన ఎంపీలు నవ్వుకోవడం కనిపించింది. విభజన హామీలు అమలు చేయాలని, బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం చేశారని ఎంపీలు ప్లకార్డులు పట్టుకుని కొద్దిసేపు నినాదాలు చేశారు. టీడీపీ ఎంపీలు సుజనా చౌదరి, మురళీ మోహన్, గల్లా జయ్‌దేవ్, నారాయణ, సీతారామలక్ష్మీ, నిమ్మల కిష్టప్ప, మాగంటి బాబు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. ఇక వైసీపీ ఎంపీలు కూడా ఇదే ధోరణిలో వ్యవహరించడం విశేషం. పార్లమెంటులోని మెయిన్ గేట్ వద్ద వైసీపీ ఎంపీలు ఆందోళన చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.